హైదరాబాద్
ఆదివారం
11-2-2018
సంపుటి: 2, సంచిక: 73
పేజీలు: 12+16, వెల: రూ. 6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



నిజమైన ప్రేమలో కండిషన్స్ ఉండవు

మూవీ ప్లస్‌లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



కాళేశ్వరం.. దేశానికే ఆదర్శం

మిషన్ భగీరథ కూడా ఓ అద్భుతం

తాగు, సాగునీటి పథకాల్లో తెలంగాణ అగ్రగామి

నిధుల వినియోగం తీరుపై సంతృప్తి

15వ ఫైనాన్స్ కమిషన్ బృందం ప్రశంసలు

మిషన్ భగీరథ, కాళేశ్వరం పనుల పరిశీలన

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శమని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం దేశానికే ఒక నమూనాగా నిలుస్తుందని మిగతా 6లో..



చికిత్స కోసమే ఢిల్లీకి!

మోదీతోనూ సమావేశమవనున్న కేసీఆర్

పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ప్రధానిని ఆహ్వానించనున్న కేసీఆర్

పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం ఉందంటున్న పరిశీలకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రత్యేక ప్రతినిధి) :



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ వెళ్లారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన సతీసమేతంగా ఢిల్లీ వెళ్లారు. గత నాలుగు రోజులుగా పంటినొప్పితో బాధపడుతున్న కేసీఆర్, చికిత్స నిమిత్తం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చికిత్స చేయించుకున్నాక విదేశీ పర్యటన ముగించుకుని వచ్చే ప్రధాని నరేంద్ర మోడీతో ఆయన సమావేశం కానున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కేంద్రం పెండింగ్‌లో ఉన్న అంశాలు, హామీల గురించి చర్చించనున్నారు. రైతులకు ఇస్తున్న రాయితీలు, 24 గంటల విద్యుత్‌తో పాటు పెట్టుబడి పథకాల గురించి కూడా ప్రధానికి తెలుపనున్నారు. గత కొంత కాలంగా తెలంగాణ ప్రభుత్వం కీలక పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోడీని చేతుల మీదుగా ప్రారంభింపజేస్తున్న విషయం తెలిసిందే. ఈ కోవలోనే మార్చి 11న తెలంగాణలో నిర్వహించనున్న పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీని ప్రారంభించేందుకు ప్రధానిని ఆహ్వానించనున్నారు. ప్రత్యేక హోదా, నిధుల కోసం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు పార్లమెంటులో చేస్తున్న నిరసనలకు టీఆర్ఎస్ ఎంపీ కవిత కూడా మద్దతుగా మాట్లాడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనకు రాజకీయ ప్రాధాన్యం కూడా ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రధానితో ముఖ్యమంత్రి సమావేశం ఈ కారణంగా ప్రాధాన్యం గలదని వ్యాఖ్యానిస్తున్నారు.



రైల్వే శాఖ క్రమశిక్షణ చర్యలు

- అనధికార సెలవుల్లో ఉన్న వారిపై గురి
- 13,000 మంది ఉద్యోగులపై వేటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:

రైల్వేశాఖ క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. నెలల తరబడి విధులకు డుమ్మా కొడుతున్న మిగతా 6లో..

ఇదీ లోకం!





ప్రతి సృష్టి!


ల్యాబ్‌లో మానవ అండాల తయారీ..

- అండాశయ కణజాలాలే మూలం.. ఎలుకలపై ప్రయోగం విజయవంతం
- పూర్తిస్థాయి అండాలు త్వరలో రెడీ.. సంతాన రాహిత్యానికి శాస్త్రీయంగా చెక్
- టెస్ట్‌ట్యూబ్ బేబీల కంటే విభిన్నం.. బ్రిటిష్.. అమెరికన్ శాస్త్రవేత్తల విజయం
- ఫలదీకరణం చెందించడమే తరువాయి.. అది పూర్తయితే సృష్టికి ప్రతిసృష్టే

పురాణాలలో విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేస్తూ.. ఏకంగా త్రిశంకు స్వర్గాన్నే సృష్టిస్తాడు. కానీ ఇప్పుడు శాస్త్రవేత్తలు నిజంగానే ప్రతిసృష్టి కలను సాకారం చేస్తున్నారు. ఇప్పటివరకు మనిషి నుంచి సేకరించిన అండాలు, శుక్రకణాలను కృత్రిమంగా టెస్ట్‌ట్యూబ్‌లలో ఫలదీకరణం చెందించి తర్వాత మళ్లీ వాటిని గర్భంలో ప్రవేశపెట్టి టెస్ట్‌ట్యూబ్ బేబీలను పుట్టించేవారు. కానీ ఇప్పుడు ఏకంగా కృత్రిమంగా అండాలనే సృష్టించి.. సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఈ పరిశోధనలు మరింత ముందుకెళ్తే.. ఇక సంతానరాహిత్యం అనే సమస్యే ఉండదు.

మనం సండే స్పెషల్

6లో..



7 దేశాల్లో.. తెలంగాణ పర్యాటకం

బైకులపై నలుగురు యువతుల సాహస యాత్ర.. 50 రోజులు.. 17 వేల కి.మీ. ప్రయాణం

నేడు ప్రారంభం: మంత్రి చందూలాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి):

తెలంగాణ పర్యాటక రంగం ప్రాముఖ్యాన్ని ప్రపంచానికి తెలిపేందుకు తెలంగాణకు చెందిన నలుగురు యువతులు మోటారు బైకులపై సాహసయాత్ర చేయడం ఎంతో అభినందనీయమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ అన్నారు. శనివారం సచివాలయంలో ఏర్పాటు ఏసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల మిగతా 6లో..





పంచాయితీ తెగలే.. పైసలు రాలే

రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థుల గోస

నాలుగేండ్లుగా సర్టిఫికేట్ల కోసం ఎదురుచూపులు

నేటికీ విడుదల కాని 2013-14 నిధులు

పట్టించుకోని ప్రభుత్వాలు.. కనికరించని కాలేజీలు

కొలువుల వేటలో వెనకబడుతున్న గ్రాడ్యుయేట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి):

స్వరాష్ట్రం సాధించుకున్నా 'విభజన' తగాదాలు తెగలేదు. రాష్ట్రం ఏర్పడితే తమ ఆశలు తీరుతాయని విద్యార్థులు ఆశపడ్డారు. కానీ, రెండు రాష్ట్రాల మధ్య ఫీజు రీయింబర్స్‌మెంట్ కిరికిరితో నాలుగేండ్లవుతున్నా సర్టిఫికెట్లు చేతికి రాలేదు. 2013-14 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నేటికీ విడుదల కాలేదు. రీయింబర్స్‌మెంట్ నిధులు చేతికందనిదే మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో ఆదివారం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. గంటకు 20 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 59 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి సా.5.25 తదుపరి ద్వాదశి; నక్షత్రం: మూల రా.10.57 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: తె.4.53-6.41; దుర్ముహూర్తం: సా.4.41-5.27; రాహుకాలం: సా.4.47-6.13; అమృతఘడియలు: మ.3.46-5.34; శుభసమయం: ఉ.7.00-ఉ.9.00;

సూర్యోదయం: 6.48

సూర్యాస్తమయం: 6.13



300 కోట్లకు పైగానే!

ఐదీ పురుషోత్తం రెడ్డి అవినీతి ఆస్తి

ఆశ్చర్యపోతున్న ఏసీబీ అధికారులు

పరాలీలోనే నిందితుడు.. బంధువులు

8రోజులుగా సాగుతున్న ఏసీబీ సోదాలు

నలుగురు బినామీల అరెస్ట్, రిమాండ్

3లో..

చెట్టపట్టాలతో చక్కని స్నేహం

పాలస్తీనా-ఇజ్రాయెల్ సహజీవనం చేయాలి

అధ్యక్షుడు అబ్బాస్.. ప్రధాని మోదీ ఆకాంక్ష

భారత్‌తో 6 ఒప్పందాలు.. సంతకాలు పూర్తి

రూ.193 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

7లో..



పంటల నీటి అవసరాలు తీర్చే సెన్సర్



హైదరాబాద్, ఫిబ్రవరి 10: ప్రపంచ వ్యాప్తంగా జలవనరులు అడుగంటిపోతున్న క్రమంలో నీటి వృధాను అరికట్టడంతో పాటు పంటలకు సరిపడా నీళ్లందించే సరికొత్త విధానాన్ని పరిశోధకులు అభి వృద్ధి చేస్తున్నారు. పంట పరిస్థితిని గమనిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైనన్ని నీటిని విడుదలచేసే కొత్త సెన్సర్లను అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ పరిశోధకులు తెలిపారు. ఈ సెన్సర్లను సింపుల్‌గా పంట పొలాల్లో పాతిపెడితే సరి.. పంట పరిస్థితి ఎలా ఉంది, సరిపడా నీరు అందుతుందా లేదా తదితర విషయాలను ఈ సెన్సర్ పరిశీలిస్తుందట! అదే సమయంలో నీటిని వృధాగా పోనీయకుండా చూస్తుందట. పంట ఉత్పాదకతను గరిష్ఠ స్థాయికి చేర్చేందుకూ ఇది ఉపయోగపడుతుందని వివరించారు. పంట ఏ దశలో ఉంది, నీటి అవసరం ఎంత ఉందనే విషయాలను నిశితంగా పరిశీలించి సరిపడా నీటిని విడుదల చేసేందుకు ఇది తోడ్పడుతుందని వర్సిటీ వీసీ వి.ప్రవీణ్ రావు పేర్కొన్నారు.



కంది రైతును ఆదుకోండి

కేంద్ర మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి): కంది రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఇరిగేషన్, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌కు హరీశ్ లేఖ రాశారు. కందుల కొనుగోళ్ల పరిమితిని పెంచాలని కోరారు. ఈ సీజన్‌లో కందులు 2.84 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి రానుందని తెలిపారు. 75 వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే కేంద్రం అంగీకరించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. కనీసం మరో లక్షల మెట్రిక్ టన్నుల కంది కొనుగోలు కోసం సంబంధిత ఏజెన్సీలను ఆదేశించాలని కోరారు. మార్కెట్‌లో కంది రైతుల్లో ఆందోళన నెలకొంటుందన్నారు. మద్దతు ధర క్వింటాలుకు 5,450 రూపాయలు ఉండగా మార్కెట్‌లో 3,800 నుంచి 4,200 రూపాయలకే అమ్ముకోవాల్సిన పరిస్థితిని కంది రైతు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే కంది పంటపై తీవ్ర ప్రభావం పడుతుందని లేఖలో పేర్కొన్నారు.

కేయూలో విద్యార్థుల ఆందోళన

- పీహెచ్‌డీ అడ్మిషన్లు రద్దుకు డిమాండ్



వరంగల్, ఫిబ్రవరి 10 (మనం న్యూస్ బ్యూరో): కాకతీయ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల్లో అందిస్తున్న పీహెచ్‌డీ కోర్సులో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 2015-16, 2016-17 విద్యాసంవత్సరాలకు గాను మొత్తం 26 విభాగాలకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అక్రమాలు జరిగాయని, ఫలితాలు విడుదల చేయకూడదని డిమాండ్ చేస్తూ వర్సిటీ ఉపకులపతి కార్యాలయం ఎదుట విద్యార్థులు గతంలోనే ఆందోళన చేశారు. అంతేకాక ఫలితాలు రద్దు చేయాలంటూ రాష్ట్ర గవర్నర్, హోం శాఖ మంత్రికి కూడా వినతులు ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనను పట్టించుకోని విశ్వవిద్యాలయ అధికారులు శుక్రవారం అర్ధరాత్రి పీహెచ్‌డీ ఫలితాలు విడుదల చేశారు. దీంతో విద్యార్థి సంఘాలు శనివారం ఆందోళనకు దిగాయి. విశ్వవిద్యాలయ పరిపాలన భవనాన్ని ముట్టడించి, ధర్నా చేశాయి. కొందరు విద్యార్థులు పరిపాలనా భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని గవర్నర్‌ను కోరామని, న్యాయవిచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారన్నారు. అయితే యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఆగమేఘాల మీద అర్ధరాత్రి ఫలితాలు విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అక్రమాలు రుజువైతే తన బండారం బయటపడుతుందని వీసీ ఫలితాలను విడుదల చేసి చేతులు దులుపుకున్నారని, దీనిని అన్ని విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం పీహెచ్‌డీ అడ్మిషన్లు రద్దు చేసి వైస్‌చాన్సలర్‌పై న్యాయవిచారణ జరపాలని, అడ్మిషన్లను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నాయకులు చెప్పారు.

తెలుగు వర్సిటీలో ఉద్రిక్తత

- వీసీ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు
- విద్యార్థుల ఆందోళన.. ధర్నా

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి) : పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ చర్యలను నిరసిస్తూ విద్యార్థులు శనివారం ఆందోళన నిర్వహించారు. వీసీ నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారంటూ విద్యార్థులు విశ్వవిద్యాలయం ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడేందుకు వీసీ సత్యనారాయణ వారి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో విద్యార్థులు, వీసీకి మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. పరీక్షల్లో కాపీ కొట్టకున్నా అన్యాయంగా విద్యార్థులపై ఎందుకు చర్యలు తీసుకున్నారని నిలదీశారు. హాస్టల్‌లో మధ్యాహ్నం భోజన సౌకర్యం లేకుండా ఎందుకు చేశారని ప్రశ్నించారు. తరగతులకు రమ్మంటారు, ఒకటి రెండు కన్నా ఎక్కువ క్లాసులు జరగవు, వాటి కోసం రోజంతా సమయం వృథా అవుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న తాము సమయాన్ని ఇక్కడే వృథా చేసుకోమ్మంటారా అంటూ విద్యార్థులు పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీనే లేదని విద్యార్థులు వాపోయారు. విద్యార్థులను సమన్వయం చేయాల్సిన వీసీ రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. కేసులు పెడ్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. ఓయూలోని త్రివేణి హాస్టల్ నుంచి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వద్దకు సరైన బస్సు సౌకర్యం లేదనే విషయాన్ని పలుమార్లు వీసీ దృష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవటం లేదన్నారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. వీసీకి వ్యతిరేకంగా నినాధాలు చేశారు. చివరకు వీసీ తన ఛాంబర్‌కు విద్యార్థులను పిలిపించారు. క్లాసులకు హాజరు కావాలనే ఉద్దేశ్యంతోనే భోజనాన్ని ఇక్కడే క్యాంటీన్‌లో ఏర్పాటు చేయిస్తున్నానని వీసీ తెలిపారు. క్లాసులకు హాజరైతే మరింత జ్ఞానం వస్తుందని అన్నారు. విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- హ్యాండ్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే


మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 10(మనం న్యూస్): మహబూబ్‌నగర్ పట్టణంలో 63వ స్కూల్ గేమ్స్ నేషనల్ చాంపియన్‌షిప్ హ్యాండ్ బాల్ పోటీలను ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. స్థానిక జెడ్పీ మైదానంలో పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే.. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకుని హ్యాండ్‌బాల్ విసిరారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ పట్టణం నేషనల్ క్రీడలకు అథిత్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఈ పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులు ప్రతిభను చాటాలని, పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని సూచించారు. క్రీడాకా రులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సహిస్తోందని, వారు జాతీ యస్థాయిలో రాణించేందుకు తోడ్పడుతోందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహానికి తోడు తమ సామర్థ్యాన్ని పెంపొందించుకుని జాతీయస్థాయిలో పథకాలు సాధిస్తూ ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

శివరాత్రికి 'కురవి' సిద్ధం


కనులపండువగా జరగనున్న భద్రకాళి, వీరభద్రస్వామి కల్యాణం



కురవి, ఫిబ్రవరి 10(మనం న్యూస్): కురవిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైంది. వరంగల్ నగరానికి 60 కిలో మీటర్ల దూరంలో, మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న కురవిలో ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. చుట్టుపక్కల నాలుగైదు జిల్లాలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా జనం తరలి వస్తారు. కీ.శ.850 ప్రాంతంలో వేంగి రాజధానిగా ఆంధ్ర దే శాన్ని పరిపాలించిన చాళుక్యులకు సామంతుడైన భీమరాజు ఈ ఆలయాన్ని నిర్మించిన నాటి నుంచీ ప్రతి ఏటా శివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. దక్షయజ్ఞం సందర్భంగా తన సతీమణి ఆహుతికి ఆగ్రహించిన పరమేశ్వరుడు చేసిన రుద్రద తాండవం నుంచి వీరభద్రుడు పుట్టాడనీ కథనం. కాకతీయుల కాలంలో విలిసిల్లిన శైవ, వీర శైవ మతాల నేపథ్యంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆధునిక కాలంలోనూ కోరిన కోరికలు తీర్చే స్వామిగా వీరభద్రుణ్ణి భక్తులు నమ్ముతూ ఉత్సవాలకు తండోపతండాలుగా తరలి వస్తారు.


ఫైల్ ఫొటో

భక్తులకు వసతులు కల్పించాలి: శ్రీరాం జగన్నాథం



ప్రతి ఏటా లక్షలాదిగా తరలివస్తున్న భక్తుల పట్ల నిర్లక్ష్యం చూపకుండా తగిన ఏర్పాట్లు చేయాలి. కళ్యాణం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేయాలి. భక్తుల ఇబ్బందులు తీర్చి, చారిత్రక నేపథ్యమున్న ఈ గుడికి మరింతే ప్రచారం కల్పించాలి.


గిరిజనుల ఆరాధ్యదైవం వీరభద్రస్వామి: రవినాయక్



గత కొన్ని సంవత్సరాలుగా కురవి మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి కొలిచిన వారికి కొంగు బంగారాన్నిచ్చే స్వామిగా విరాజిల్లుతున్నారని, ప్రతి ఏడాది భక్తుల రద్దీ పెరుగుతూనే ఉంది. ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగంగానే ఈ ఆలయాన్ని కూడా తక్షణమే అభివృద్ధి చేయాలి.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- కురవి ఆలయ చైర్మన్ బాదావత్ రాజునాయక్



మహా శివరాత్రి సందర్భంగా కురవి జాతరకు వచ్చే భక్తులకు ఎలంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ బాదావత్ రాజునాయక్ తెలిపారు. భక్తుల కోసం మంచినీటి వసతిని కల్పించడం జరిగిందన్నారు. చైర్మన్ హోదాలో 7వ సారి కల్యాణ మహోత్సవంలో పాల్గొనటం అదృష్టంగా బావిస్తున్నానని రాజునాయక్ తెలిపారు.

అభివృద్ధికి నోచని ఆలయం

- దొంతు యాదగిరి



శివరాత్రికే కాదు.. ఇక్కడికి అనునిత్యం భక్తులు తరలివస్తూనే ఉంటారు. అయితే వారికి కనీస సౌకర్యాలు కూడా కరువైనాయి. ప్రభుత్వం వెంటనే పట్టించుకుని మౌలిక సౌకర్యాలు కల్పించాలి. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ కూడా వీరభద్రుడి ఆలయానికి కోరమీసాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

జాతరకు గట్టి బందోబస్తు

- కురవి ఎస్సై నాగభూషణం



జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశాం. అల్లర్లు చేసే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా పోలీసులు కూడా బందోబస్తులో ఉంటారని తెలిపారు. భక్తులు విలువైన ఆభరణాలు వేసుకురావద్దని, అదే విధంగా మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు.



నేటి నుంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

మేడ్చల్, ఫిబ్రవరి 10 (మనం న్యూస్): కీసరగుట్టలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి శనివారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. మొత్తం 6 లక్షల మంది భక్తులు ఉత్సవాలకు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొంటారు. ఈమేరకు ఆలయ అధికారులకు కలెక్టర్ సూచనలు చేశారు.

రామన్నకు ప్రాణహాని తలపెట్టొద్దు

- విరసం నేత వరవరరావు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి): మావోయిస్టు సాంకేతిక విభాగం హెడ్, పార్టీ సౌత్ బస్తర్ కార్యదర్శి రామన్న అలియాస్ శ్రీనివాస్ మదారు, అతడి భార్య పద్మను పోలీసులు శనివారం బస్తర్‌లో అరెస్టు చేశారు. రామన్నపై 25 లక్షల రివార్డు ఉంది. అయితే రామన్నకు ప్రాణహాని తలపెట్టకుండా, తక్షణమే కోర్టులో హాజరుపరచాలని వరవరరావు డిమాండ్ చేశారు.

పోలీసులకు పూర్తి స్వేచ్ఛ

- తెలంగాణ పోలీస్ అత్యుత్తమం
- ఆదర్శంగా కరీంనగర్ కమిషనరేట్
- పోలీస్ పోస్ట్ ప్రారంభోత్సవంలో ఈటల



కరీంనగర్, ఫిబ్రవరి 10(మనం న్యూస్ బ్యూరో): అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం పోలీస్‌శాఖకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చిందని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ప్రజలను భయాందోళనకు గురిచేసే అసాంఘిక శక్తులను, కార్యకలాపాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని చెప్పారు. గూండాయుజం, గుట్కా, మట్కా, భూ అక్రమణ తదితర పదాలు కూడా వినిపించకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈమేరకు కరీంనగర్‌లోని మానేరు బైపాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసి లేక్ పోలీస్ అవుట్ పోస్టును ఈటల శనివారం నాడు ప్రారంభించారు. మానేరు డ్యాంపై ఏర్పాటుచేసిన రెండు షెల్టర్లను ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజలకు అనుకూలమైన ఎజెండాతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. చట్టాలపై ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేస్తున్నామని చెప్పారు. కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. దేశ వ్యాప్తంగా తెలంగాణ పోలీస్ అత్యుత్తమంగా పనిచేస్తోందని, కరీంనగర్ కమీషనరేట్ ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సీపీ కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు తన కోటా నుంచి అందజేసిన 6 లక్షల రూపాయలతో లేక్ పోలీసును ఏర్పాటు చేశామన్నారు. లేక్ పోలీస్ ఏర్పాటుతో డ్యాం, జింకల పార్కు ప్రాంతల్లో అసాంఘిక, అక్రమ కార్యకలాపాలు తగ్గాయన్నారు. సందర్శకుల భద్రత కోసం రేయింబవళ్లు నిఘా కొనసాగించేందుకు ప్రస్తుతం 6 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, త్వరలో మరో 30 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పి చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు 2 గంటల్లో 'గుండె' తరలింపు


- అవయవ మార్పిడితో నిలిచిన ప్రాణం
- సీపీకి అపోలో ఎండీ ప్రతాప్‌రెడ్డి అభినందన

కరీంనగర్, ఫిబ్రవరి 10(మనం న్యూస్ బ్యూరో): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి గుండె మరో వ్యక్తిలో కొట్టుకుంటోంది.. అచేతనంగా మారాల్సిన శరీరం నెమ్మదిగా కోలుకుంటోంది. కాలి బూడిద కావాల్సిన అవయవం మరొకరి ప్రాణం నిలబెట్టింది. అవయవదానంతో పునర్జన్మ పొందడం ఒక ఎత్తైతే.. ఎక్కడో కరీంనగర్ శివార్లలో ఉన్న ఆస్పత్రి నుంచి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆస్పత్రికి సదరు అవయవాన్ని(గుండెను) చేర్చడం సవాళ్లతో కూడుకున్న పక్రియ.. దాదాపు 180 కిలోమీటర్ల దూరాన్ని కరీంనగర్ పోలీసుల సాయంతో 2 గంటల్లో అధిగమించారు. బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి శరీరం నుంచి సేకరించిన హృదయాన్ని జూబ్లీహిల్స్ ఆస్పత్రికి చేర్చారు. పూర్తి వివరాలు.. ఈ నెల 8న జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం చిన్న మెట్‌పల్లికి చెందిన మేకల నవీన్‌కుమార్(17) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరాడు. కరీంనగర్‌లోని అపోలో రీచ్ ఆస్పత్రి వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా బాధితుడు కోలుకోలేదు. చివరకు శుక్రవారం రాత్రి నవీన్ బ్రెయిన్ డెడ్ అని వైద్యులు ప్రకటించారు. విషయం తెలిసుకున్న జీవన్‌దాన్ ట్రస్ట్ సభ్యులు బాధితుడి బంధువులను కలిసి అవయవదానానికి ఒప్పించారు. నవీన్ శరీరంనుంచి హృదయం సేకరించి జూబ్లిహిల్స్ ఆపోలో ఆసుపత్రికి తరలించారు. ఇందుకోసం పోలీసుల సాయం అర్థించగా.. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌వరకు గ్రీన్ చానల్ ఏర్పాటుచేసి వారు సహకరించారు. దీంతో గుండెను రెండు గంటల్లో జూబ్లీహిల్స్‌కు చేర్చారు. దీనిని హృద్రోగం కారణంగా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి వైద్యులు అమర్చారు. అనంతరం అవయవమార్పిడి చికిత్స విజయవంతమైందని ప్రకటించారు. కాగా, గుండెను తరలించేందుకు ఏర్పాట్లుచేసిన కరీంనగర్ సీపీ కమలాసన్ రెడ్డిని, ట్రాఫిక్ సీఐ సీతారెడ్డిని అపోలో సంస్థల ఎండీ ప్రతాప్‌రెడ్డి అభినందించారు.


కోర్టు ధిక్కార చర్యలు

- ఎందుకు తీసుకోవద్దు?
- రైతు రుణ విమోచన కమిషన్ హామీ
- ఎందుకు నెరవేర్చలేదు?: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రస్థాయి రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని అమలు చేయకపోడంపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో స్పష్టం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజ న్ బెంచ్ విచారణ జరిపింది. ప్రభుత్వ హామీ గడువు గత ఏడాది నవంబర్ 21తో ముగిసిందని, రైతులు ఆత్మహత్యల నివారణకు కమిషన్ ఏర్పాటు చేయలేదని తిరిగి ఆయన హైకోర్టు ద ష్టికి తెచ్చారు. సీఎస్‌కు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.



మందుబాబు-పోలీసుల 'స్ట్రీట్ ఫైట్'..





పీకల దాకా మద్యం తాగి కారులో వంద స్పీడ్‌లో దూసుకెళ్తున్నారు.. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న పోలీసులు కారు ఆపినందుకు వారితో గొడవకు దిగారు. డ్రైవింగ్ సీటులో కూర్చున్న వ్యక్తి సైలెంట్‌గానే ఉన్నా.. పక్కన కూర్చున్న యువకుడు పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. కొంత ఓపిక పట్టిన పోలీసులు.. యువకుడి చేష్టలు శృతిమించడంతో ఎదురుదాడికి దిగారు. అయితే, ఇదంతా వీధిపోరాటాన్ని తలపించింది. మందుబాబుతో పాటు పోలీసు కూడా రోడ్డుపై కిందామీదా పడుతూ కొట్టుకున్నారు. మందుబాబుపై పోలీసు బూట్లు నాట్యం చేశాయి. మందుబాబును ఎగిరెగిరి తన్నారు. ఇదంతా ఓ వాహనదారుడు వీడియో తీసి నెట్‌లో పెట్టడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివరికి ఓ ఉన్నతాధికారి వచ్చి గొడవకు ఫుల్‌స్టాప్ పెట్టి యువకుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కారును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

యాంకర్ ప్రదీప్ ట్వీట్.. స్పందించిన కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం న్యూస్) : మేడ్చల్ జిల్లాలోని చర్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు, టాయిలెట్స్, మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలను పరిష్కరించాలని వీ-కేర్ అనే ఎన్‌జీవో సంస్థ ట్వీట్ చేసింది. ఈ పోస్ట్‌పై యాంకర్ ప్రదీప్ స్పందించారు. ఈ పోస్టును రాష్ట్ర మంత్రి కేటీఆర్‌కు ట్యాగ్‌చేస్తూ.. చర్లపల్లిలోని ఆ పాఠశాలకు తమ టీమ్ వెళ్లిందని, అక్కడ చాలా సమస్యలు ఉన్నాయని, వెంటనే పరిష్కరించాల్సిందిగా ట్విటర్‌లో కేటీఆర్‌ను కోరారు. ఈ పోస్ట్‌పై కేటీఆర్ స్పందించి పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ కలెక్టర్‌ను ఆదేశించారు. పని పూర్తయ్యాక ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని చెప్పారు. కేటీఆర్ ఆదేశాలపై స్పందించిన కలెక్టర్ మేడ్చల్ జిల్లా డీఈవో వెళ్లి అక్కడ నెలకొన్న పరిస్థితులను పరిశీలిస్తారని, పాత వాటి స్థానంలో కొత్తవి నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ట్వీట్ చేశారు. కేటీఆర్ స్పందనపై ప్రదీప్ ధన్యవాదాలు తెలిపారు. చర్లపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 120 మంది బాలికలు, 100 మంది బాలురు చదువుతున్నారు. ఈ పాఠశాల నిర్మించి 40 సంవత్సరాలవుతోంది.

ఐటీ ఎగుమతుల్లో 14 శాతం వృద్ధి

- పెట్టుబడులు ఆకర్షించడంలో ముందున్నాం: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం న్యూస్): ఐటీ ఎగుమతుల్లో 14 శాతం వృద్ధి సాధించామని, పెట్టుబడులను ఆకర్షించడంలో ముందున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. సీఐఐ ఆధ్వర్యంలో ఐటీసీ కాకతీయ హోటల్‌లో జరిగిన వివిధ కంపెనీల ప్రతినిధుల సమావేశానికి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశంలోనే ఆర్థికాభివృద్ధిలో ముందున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ కార్యాలయాలన్నీ ఇక్కడే ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఏరోస్పేస్ రంగానికి చెందిన పరిశ్రమలు ఉన్నాయని గుర్తు చేశారు. ఐటీ రంగంలో అత్యధికంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సీఐఐతో కలిసి మానుఫ్యాక్చరింగ్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. మార్చి 8న మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి జపాన్ పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందని మంత్రి కేటీఆర్ తెలిపారు.




ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

- ఈ పోరులో వృత్తి నిపుణులు కీలకం: ఉత్తమ్
- పరిపాలనలో ప్రొఫెషనల్స్ పెరగాలి: జానారెడ్డి
- రాష్ట్ర ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా దాసోజు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రొఫెషనల్స్ ప్రధాన పాత్ర పోషించాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్‌లో శనివారం గీతారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు ప్రసంగించారు. దేశంలో, రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనలో ప్రొఫెషనల్స్ పాత్ర తగ్గటమే ఇందుకు కారణమన్నారు. ప్రొఫెషనల్స్ మౌనం ప్రజాస్వామ్యానికే ముప్పు అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ త్వరలో హైదరాబాద్‌లో ప్రొఫెషనల్స్‌తో భేటీ అవుతారని తెలిపారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్, కాళోజీ వంటి వారెందరో ఉన్నారన్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతుందన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి టీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారు. మెట్రోతో పాటు ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే పునాదులు పడ్డాయనే విషయాన్ని టీఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ చరిత్రను వక్రీకరిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రొఫెషనల్స్ సలహాలు, సూచనలు చాలా అవసరమని భావించిన రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా ప్రొఫెషనల్స్‌తో కమిటీలు వేస్తున్నారని తెలిపారు. కాగా, రాష్ట్ర కాంగ్రెస్ ప్రొఫెషనల్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు దాసోజు శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడుగా ఎన్.కళ్యాణ్, కార్యదర్శిగా సంతోష్, ఇర్ఫాన్ అజీజ్, డాక్టర్ సలూజ, డాక్టర్ శర్మ, జావేద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, పద్మావతిరెడ్డి, ఏడు విభాగాలకు కన్వీనర్లుగా అవినాశ్‌రెడ్డి, నఫిసాఅలీ, సుదీర్, ప్రదీప్‌రాఘవ, ఎల్. రమేశ్, డాక్టర్ జయసింహారెడ్డి, ఎండీ. లతీపుద్దీన్, పి. రమేష్, సునీల్‌కుమారి, కశ్యప్, విజయేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అభిషేక్ నియమితులయ్యారు.


రాష్ట్ర సమస్యలు కనిపించట్లేదా?: వీహెచ్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరిన ఎంపీ కవితకు తెలంగాణకు జరిగిన అన్యాయం కనబడలేదా అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హన్మంతరావు ప్రశ్నించారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్న విషయాన్ని ఎందుకు ప్రస్తావించలేదన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ఐఐఎం, హైకోర్టు విభజన కవితకు గుర్తుకు రాకపోవడం శోచనీయమన్నారు. కేసీఆర్ కిటుకు మోదీ దగ్గర ఉన్నందునే ప్రశ్నించడంలేదన్నారు. హైదరాబాద్‌లో వసూలు చేస్తున్న పన్నుల ఆదాయాన్ని మిషన్ భగీరథకు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను కేసీఆర్ సర్వనాశనం చేస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లను డమ్మీలుగా మారారని విమర్శించారు. కాగా, తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వీహెచ్‌ను బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ తాను పోరాటం చేస్తానని అన్నారు. అక్కడి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని వీహెచ్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు.

ఫీజుల దోపిడీపై ఉద్యమించాలి

- ప్రభుత్వ అండతో రెచ్చిపోతున్న యాజమాన్యాలు
- పేరెంట్స్‌అసోసియేషన్ సమావేశం డిమాండ్




హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీపై ప్రతిఒక్కరూ ఉద్యమించాలని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో పేరెంట్స్ అసోసియేషన్ కోఆర్డినేషన్ కమిటీ(పీఏసీసీ) ఆధ్వర్యంలో శనివారం 'ఫీజుల దోపిడీ, విద్యాప్రమాణాల పతనం' అనే అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అండతోనే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయన్నారు. తిరుపతిరావు కమిటీకి విరుద్ధంగా ఫీజులు పెంచుకుంటున్నాయని మండిపడ్డారు. విద్యారంగాన్ని ప్రభుత్వం పూర్తిగా చేతుల్లోకి తీసుకోవాలన్నారు. డాక్టర్ సత్తార్‌ఖాన్ మాట్లాడుతూ భవిష్యత్‌ను నిర్ణయించేది విద్యారంగమని, దురదృష్టవశాత్తు ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యాపార విధానాల కారణంగా విద్యావ్యవస్థ ప్రైవేటు రంగంలోకి వెళుతుందన్నారు. పీఏసీసీ సభ్యుడు పి.తేజ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఉచిత నిర్బంధ విద్యను అన్ని ప్రభుత్వాలు ఉల్లంఘించాయన్నారు. పుష్కరాలకు రూ.400 కోట్లు ఖర్చు పెట్టే ప్రభుత్వం.. విద్యారంగానికి మాత్రం మొండిచేయి చూపుతుందని చెప్పారు. సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మేధావులు, విద్యారంగ నిపుణులు, పీఏసీసీ సభ్యులు, పాల్గొన్నారు.

300 కోట్లకు పైగానే..!

- తవ్వేకొద్దీ నివ్వెరపోయేలా సంపద
- ఆశ్చర్యపోతున్న ఏసీబీ అధికారులు
- పరారీలోనే నిందితుడు.. బంధువులు
- 8 రోజులుగా సాగుతున్న సోదాలు
- నలుగురు బినామీల అరెస్ట్.. రిమాండ్

ఇదీ పురుషోత్తం రెడ్డి అవినీతి ఆస్తి



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం మాజీ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ఆస్తుల చిట్టా చూసి ఏసీబీ అధికారులే నివ్వెరపోతున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు రూ.300కోట్లకు పైగానే విలువ చేసే ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఎనిమిది రోజులుగా ఏసీబీ సోదాలు నిర్వహిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే. కుటుంబం, బావ, బినామీలతో సహా పరారీలో ఉన్న పురుషోత్తంరెడ్డి గురించి ఏసీబీ బృందాలు వేట సాగిస్తున్నాయి. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి ప్రధాన బినామీలుగా ఉన్న అల్లుడు నిషాంత్‌రెడ్డితో పాటు యాదవరెడ్డి అనే వ్యక్తిని ఏసీబీ శుక్రవారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఏసీబీ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం శ్రీసాయి హరిహరా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాదవరెడ్డి హబ్సిగూడలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని, ఇందులోనూ పురుషోత్తంరెడ్డి రూ.కోట్లు పెట్టుబడి పెట్టినట్టు తెలిసింది. అలాగే మంచిరేవులలో నిషాంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి అక్రమ సొమ్ముతో విల్లాలు నిర్మిస్తున్నట్టు ఏసీబీ గుర్తించింది. వీరిద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మొదటిసారిగా బినామీ యాక్ట్..

సాధారణంగా నేరుగా లంచం ఇచ్చే కేసులు, ఆదాయానికి మించిన ఆస్తుల కేసులను అవినీతి నిరోధక శాఖ ఎక్కువగా నమోదు చేస్తోంది. అయితే ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఇప్పటివరకు పెద్దగా బినామీదారులపై నజర్ పెట్టలేదు. కానీ పురుషోత్తంరెడ్డి కేసులో అరెస్టయిన ఇద్దరు బినామీదారులుగా గుర్తించి, వీరిద్దరితో పాటు పురుషోత్తంరెడ్డిపై బినామీ యాక్ట్ కింద కొత్త కేసు నమోదు చేశారు. వీరిద్దరి లావాదేవీల వివరాలు, ఆర్థిక మార్గాలు తదితర వివరాలపై దృష్టి సారించి విచారణ జరపాలని ఏసీబీ అధికారికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పాటు ఆదాయపన్ను విభాగానికి లేఖ రాసింది. సోమాజిగూడలోని జమ్రుద్దీన్ రెసిడెన్సీలోని చరణ్స్ లైఫ్ డివైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. ఇందులో పురుషోత్తంరెడ్డికి చెందిన ఆస్తుల డాక్యుమెంట్లు, బంగారు ఆభరణాలకు సంబంధించి ఆధారాలను సేకరించింది. మరో ప్రధాన బినామీగా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి కోసం కూడా ఏసీబీ అధికారులు వేట సాగిస్తున్నట్టు తెలుస్తోంది.



బినామీ దందా

లేఅవుట్ల పర్మిషన్ వచ్చేవారి నుంచి లంచం రూపంలో పార్ట్‌నర్‌షిప్ ఉందని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇలా రెండు లేఅవుట్ల రూపంలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడులున్నాయి. నగదుతో పాటు విదేశాల్లో షాపింగ్‌లు,ఇండియాలోని టాప్ డిజైనర్లతో నగలు చేయించినట్లు గుర్తించారు. పురుషోత్తంరెడ్డి, కుటుంబ సభ్యులు దొరికితే మరిన్ని కోట్ల ఆస్తుల వివరాలు బయటపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

తవ్వే కొద్దీ ఆస్తులు..

పురుషోత్తంరెడ్డి ఆస్తుల చిట్టాలో శనివారం కొత్త కోణాలు బయటపడ్డాయి. శుక్రవారానికే సుమారు రూ.50కోట్లు విలువ చేసే ఆస్తులు, నలుగురు బినామీలను ఏసీబీ అధికారులు గుర్తించిన సంగతి తెలిసిందే. అయితే శనివారం ఉదయం సోదాలు ప్రారంభించి ఏసీబీ అధికారులకు కళ్లు బైర్లు కమ్మే ఆస్తుల దస్తావేజులు, బినామీలతో ఉన్న డీలింగ్స్ బయట పడ్డాయి. మధ్యాహ్నానికి రూ.300 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇదివరకే ఇద్దరు బినామీలను గుర్తించిన ఏసీబీ తాజాగా మరో ఇద్దరిని గుర్తించింది.

ఓ ఎమ్మెల్యే అండదండలు..?

పురుషోత్తంరెడ్డికి అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఉద్యమంలో ఉద్యోగ సంఘాల తరపున కీలకంగా వ్యవహరించిన సదరు ప్రజాప్రతినిధి అండతోనే అవినీతికి పాల్పడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. 1985లో బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగంలో చేరిన పురుషోత్తమ్‌రెడ్డి ప్రస్తుతం డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్నారు. గతంలో 2009లోనూ పురుషోత్తమ్‌రెడ్డిపై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆ సమయంలో రూ.3.7 కోట్ల అక్రమాస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ ఉన్నతాధికారి ఓ ప్రకటనలో తెలిపారు.

యాప్‌లో మద్యం ధరలు

- అందుబాటులో 880 బ్రాండ్ల రేట్లు
- ఆవిష్కరించిన మంత్రి పద్మారావు
- లిక్కర్ ధరల పట్టిక విడుదల..


హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): మద్యం ప్రియులకు శుభవార్త. ఇకపై యాప్ ద్వారా ఏ బ్రాండ్ మద్యం బాటిల్ ధరలు కావాలన్నీ క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఇందుకు సంబంధించిన యాప్‌ను మంత్రి పద్మారావు శనివారం ఆవిష్కరించారు. అలాగే..ధరల పట్టికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పద్మారావు మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా అమ్ముడు అయ్యే 25 మద్యం, 5 బీర్ బ్రాండ్ల ధరలతో ప్రామాణిక ధరల పట్టిక తయారుచేసినట్టు తెలిపారు. ఈ ధరల పట్టిక ప్రతీ మద్యం షాపు ముందు తప్పని సరిగా ఉంచాలన్నారు. 'లిక్కర్ ప్రైస్' యాప్ ద్వారా తెలంగాణలో అమ్మకం జరుగుతున్న 880 లిక్కర్ బ్రాండ్ల ధరలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ యాప్‌లో సైజు వారీగా, బ్రాండ్ల వారీగా, ధరల వారీగా ఖచ్చితమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అధిక ధరలతోపాటు మద్యం షాపు పరిసరాలు, కల్తీ మద్యం, సమయం దాటిన తర్వాత అమ్మకాలు, పాత స్టాక్ అమ్మకాలు, పర్మిట్‌రూం నిబంధనలను ఉల్లఘించినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 2017-19 మద్యం పాలసీ ప్రకారం ప్రతీ మద్యమ షాపు ముందు రెండు సీసీ కెమెరాలు అమర్చాలని, ఈ నిబంధలను ఎవరు ఉల్లఘించినా 7989111222 అనే నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. దీంతోపాటు 18004252523 గల నెంబర్ ఉచిత ఫోన్ కాల్ చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమేష్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



దేశంలోనే తొలిభవన నిర్మాణ సామగ్రి పార్కు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం కేఈఎఫ్ హోల్డింగ్‌తో కలిసి భవన నిర్మాణ సామగ్రి పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ పార్కుతో దాదాపు 10,000 మందికి ప్రత్యక్షంగా, వందల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. కేఈఎఫ్ హోల్డింగ్, కేఈఎఫ్ ఇన్‌ఫ్రా పార్కు కోసం రూ.600 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. కేఈఎఫ్‌తో కలిసి ప్రభుత్వం చేపట్టిన ఈ వెంచర్ గురించి మంత్రి కేటీఆర్ మీడియాకు తెలిపారు. ఈ తరహా పార్కు దేశంలోనే మొదటిదని, హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో 250 ఎకరాల్లో ఏర్పాటు అవుతుందన్నారు. పార్కులో పనిచేసే ఉద్యోగుల కోసం శిక్షణ ఇస్తామన్నారు. తెలంగాణ పారిశ్రామిక విధానం బాగుందని కేఈఎఫ్ హోల్డింగ్, కేఈఎఫ్ ఇన్‌ఫ్రా స్థాపకులు, చైర్మన్ ఫైజల్ ఈ కొట్టికొల్లన్ కితాబిచ్చారు. సంయుక్తంగా చేపట్టిన తొలి ప్రాజెక్టు ఇదేనని, ఎన్నో రాష్ట్రాలు పరిశ్రమలు పెట్టాల్సిందిగా ఆహ్వానం పంపినా.. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపామని తెలిపారు.

పక్షవాతం వచ్చిన వారికీ పెన్షన్ ఇవ్వాలి: జీవన్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): బోధకాలు బాధితులతో పాటు, పక్షవాతం వచ్చిన వారికి కూడా పింఛన్ ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు, సీఎల్పీ ఉప నాయకుడు జీవన్ రెడ్డి కోరారు. శనివారం నాడు గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోధకాలు బాధితులకు గతంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్ ఇచ్చిందని, ఇప్పుడు దాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తోందన్నారు. బోధకాలు ఉన్న వారికి రూ.1500 పెన్షన్ ఇవ్వాలని కోరారు. 50 సంవత్సరాలు పైబడిన బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలని కోరారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నందున ప్రతి ఐదేళ్లకు ఒకసారి సామాజిక భద్రత పెన్షన్లను పెంచాలని సూచించారు. వికలాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను మూడు వేలకు పెంచాలని, వితంతు పెన్షన్ కూడా మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అర్హతను 60 ఏళ్లకు తగ్గించాలని జీవన్ రెడ్డి కోరారు.

తిట్ల పురాణం ఆపండి

- అధికార.. విపక్షాలకు రావుల హితవు

హైదరాబాద్, ఫిబ్రవరి 10(మనం ప్రతినిధి): ఎన్నికల హామీల అమలులో టీఆర్ఎస్, వైఫల్యాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ విఫలమయ్యాయని టీటీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఒకరిని ఒకరు తిట్టుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజలు నాయకుల తీరును గమనిస్తున్నారని, తగిన సమయంలో ఆ రెండు పార్టీలకు వారే బుద్ధి చెబుతారన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన వాటిలో సాధించినవేంటో, దానిలో వారి పాత్ర ఏమిటో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం

- బీసీలకు న్యాయం జరిగేదాకా పోరాటం: లక్ష్మణ్



హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): ప్రజా పోరాటాలతో కేసీఆర్ మెడలు వంచుతామని, బీసీల హక్కుల కోసం పోరాడుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బీసీ వ్యతిరేక విధానాలపై పోరాటం ఆగదని, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఆయన అన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగిన బీసీ సంగ్రామ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడున్నర సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారని, కేసీఆర్ నిరకుంశంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీల ప్రయోజనానికి 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామన్న కేసీఆర్ ఆ మేరకు నిధులు కేటాయించలేదని, బీసీలపై ఆయనకు చిత్తశుద్ధి లేదనడానికి ఇది నిదర్శనమన్నారు. 'బీసీ సబ్ ప్లాన్' ఎన్నికల హామీగానే మిగిలిపోయిందన్నారు. ముస్లింలను బీసీలలో చేర్చి బీసీల వాటాకు కోత వేశారని, బీసీ విద్యార్థులపై ఆంక్షలు విధిస్తున్నారని ఆయన ఆరోపించారు. కులం, మతం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు. యాదవ, రజక, నాయి బ్రాహ్మణ ఇంకా అనేక కులాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలో బీసీలు యాభై శాతం ఉన్నారని వాళ్లను విస్మరించడం ప్రభుత్వానికి తగదన్నారు. బీసీ నిధుల నిరుపయోగం చేశారని, కేంద్ర నిధులను పక్కదారి పట్టించారని ఆయన ఆరోపించారు. నీళ్ల, నిధులు, నియమాకాలు దోచుకుంటున్నారని, అవినీతి, వారసత్వ రాజకీయాలకు కాంగ్రెస్, టీఆర్ఎస్‌లు పెట్టింది పేరని విమర్శించారు. ప్రభుత్వ అండతో రాష్ట్రంలో లిక్కర్ మాఫియా కొనసాగుతోందని, భూకుంభ కోణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బీసీని ప్రధానిగా, దళితుడిని రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకి దక్కుతుందన్నారు. సామాజిక తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని, ఓటుబ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలకాలని ఆయన తెలిపారు.




సి.ఎస్.ఎస్.

మననం

“నీకు పిచ్చి పట్టిందా.. పో... నీ సీటులోకి పో! మీకే క్రమశిక్షణ లేకపోతే ఇక మీ పిల్లలకేం నేర్పిస్తారు? ఆమెను నవ్వనివ్వండి.. చాలా రోజుల తర్వాత శూర్పణఖ నవ్వు చూసే భాగ్యం కలిగింది!! ఆమెకు బాగా పొగరు పట్టింది.. ఇలాంటివాళ్లు పార్టీలో ఉంటే కాంగ్రెస్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది!!”

దక్షిణాది వాళ్లంటే ముందు నుంచి ఉత్తరాది రాష్ట్రాల వాళ్లకు ఉన్న చిన్నచూపు మరోసారి బట్టబయలైంది. అందుకే సోషల్ మీడియాలో పదే పదే.. ఉత్తరాది, దక్షిణాది రెండు దేశాలుగా విడిపోయినా తప్పులేదనే వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చిట్టచివరిసారిగా ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ ఒక్కసారిగా తెలుగు రాష్ట్రాల్లో మంటలు రేపింది. ఇప్పటివరకు పోనీలే.. ఎంతైనా మిత్ర పక్షం కదా అని అణిచిపెట్టుకున్న తెలుగుదేశం పార్టీ కూడా ఒక్కసారిగా విరుచుకుపడింది. ఇంతోటి మీతో పొత్తు ఉంటే ఎంత.. ఊడితే ఎంతని నిర్ణయించేసుకున్నట్లే కనపడుతోంది. మాటలు కోటలు దాటుతాయి గానీ చేతలు గుమ్మం కూడా దాటవన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆయన మంత్రి వర్గ సహచరుల చేష్టలు కనిపిస్తున్నాయి. విభజన ఫలితంగా కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కావల్సిన కనీస మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఎంగిలి మెతుకులు కూడా విదల్చడం లేదు. ఒక కొత్త రాజధాని నిర్మాణం కావాలంటే ఏడాదికి 500 కోట్ల రూపాయల చొప్పున ముష్టి వేస్తే ఏ మూలకు సరిపోతుంది?



ఉత్తరాది ముష్టి మనకు అవసరమా?

....

గౌరవనీయులైన ఎంపీలను ఉద్దేశించి కొంతమంది పెద్దలు చేసిన వ్యాఖ్యలివి. తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడమే వాళ్లు చేసుకున్న పాపం. అదే ఉత్తరాది రాష్ట్రాల వాళ్ల గురించి ఇలాంటి వ్యాఖ్యలు ఎవరైనా చేస్తే ఒక్కసారిగా అల్లకల్లోలం రేగేది. సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు వెల్లువెత్తేవి. ఒకరి తర్వాత ఒకరుగా పార్టీల అధినాయకులు కూడా స్పందించేవాళ్లు. కానీ, దక్షిణాది రాష్ట్రాలు కావడం.. అందునా రెండుగా విడిపోయిన తెలుగురాష్ట్రాలు కావడంతో వీళ్లను ఏమన్నా ఎవరూ పెద్దగా పట్టించుకోరులే అన్న అహంకారం అడుగడుగునా కనిపిస్తోంది. దక్షిణాది వాళ్లంటే ముందు నుంచి ఉత్తరాది రాష్ట్రాల వాళ్లకు ఉన్న చిన్నచూపు మరోసారి బట్టబయలైంది. అందుకే సోషల్ మీడియాలో పదే పదే.. ఉత్తరాది, దక్షిణాది రెండు దేశాలుగా విడిపోయినా తప్పులేదనే వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చిట్టచివరిసారిగా ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ ఒక్కసారిగా తెలుగు రాష్ట్రాల్లో మంటలు రేపింది. ఇప్పటివరకు పోనీలే.. ఎంతైనా మిత్ర పక్షం కదా అని అణిచిపెట్టుకున్న తెలుగుదేశం పార్టీ కూడా ఒక్కసారిగా విరుచుకుపడింది. ఇంతోటి మీతో పొత్తు ఉంటే ఎంత.. ఊడితే ఎంతని నిర్ణయించేసుకున్నట్లే కనపడుతోంది. మాటలు కోటలు దాటుతాయి గానీ చేతలు గుమ్మం కూడా దాటవన్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆయన మంత్రి వర్గ సహచరుల చేష్టలు కనిపిస్తున్నాయి.

ఎన్నికలుంటేనే దక్షిణాది గుర్తుకొచ్చేది

విభజన ఫలితంగా కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కావల్సిన కనీస మౌలిక సదుపాయాల నిర్మాణానికి ఎంగిలి మెతుకులు కూడా విదల్చడం లేదు. ఒక కొత్త రాజధాని నిర్మాణం కావాలంటే ఏడాదికి 500 కోట్ల రూపాయల చొప్పున ముష్టి వేస్తే ఏ మూలకు సరిపోతుంది? పూర్తిగా ఒక కొత్త నగరాన్ని రూపొందించడంతో పాటు అందులో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం, వివిధ శాఖలకు సంబంధించిన భవనాలు, యూనివర్సిటీలు, జాతీయస్థాయి విద్యాసంస్థలు, వాటన్నిం టికీ భవనాలు, హాస్టళ్లు.. ఇన్ని నిర్మాణాలు చేయాల్సి ఉందన్న విషయం తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం అసలు ఎందుకు పట్టించుకోవడం లేదన్నది ఇప్పటికీ భేతాళ ప్రశ్నగానే మిగిలిపోతోంది. హైకోర్టును విభజించండి మహాప్రభో అంటూ రెండు తెలుగు రాష్ట్రాలు గొంతు చించుకుని ఇప్పటికి లెక్కలేనన్నిసార్లు అడిగినా దాని ప్రస్తావన కూడా సరిగా చేయడం లేదు.

ప్రతిసారీ ఎన్నికలే లక్ష్యంగా రాబోయే సంవత్సరంలో ఎన్నికలున్న రాష్ట్రాలకు పెద్దపీట వేస్తూ మిగిలినవాటిపై సవతిప్రేమ చూపిస్తూ వస్తున్న ఎన్డీయే సర్కారు.. మరోసారి కూడా అదే బుద్ధి చూపించుకుంది. కర్ణాటక, మహారాష్ట్రలలో త్వరలో ఎన్నికలుండటం, ఆ రెండుచోట్ల అధికారంలోకి వచ్చేందుకు కొంతవరకు అవకాశాలు కనిపిస్తుండటంతో అక్కడి ప్రజలకు బిస్కట్లు వేసి నట్లు మెట్రోరైలుకు కోట్లాది రూపాయలు కుమ్మరించింది. అదే కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రం అత్యంత అవసరమైన విజయవాడ మెట్రోరైలు గురించి అసలు ప్రస్తావనే లేకుండా పూర్తిగా విస్మరించింది. ఆ విషయం గురించి అడిగితే డీపీఆర్ పంపలేదని వంక పెడుతున్నారు. ప్రాజెక్టు నిధుల కేటాయింపునకు, డీపీఆర్‌కు సంబంధం ఏంటో అర్థంకాదు. డీపీఆర్ లేనంత మాత్రాన సుమారుగా ఎంత ఖర్చవుతుందో ఆ మాత్రం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు అంచనా ఉండదా? ఇవ్వాలనుకుంటే దాని ప్రతిపాదనను బడ్జెట్‌లో పెట్టలేరా? కావాలనుకుంటే డీపీఆర్ వచ్చిన తర్వాత దానికి అనుగుణంగా నిధుల విడుదలలో మార్పు చేర్పులు చేసుకోవచ్చు. అసలు ఆ మాటకొస్తే పార్లమెంటులో ఆమోదం పొందిన బడ్జెట్‌ను యథాతథంగా అమలుచేసిన సందర్భాలు ఇప్పటికి ఎన్ని ఉన్నట్లు? తప్పనిసరిగా క్షేత్ర స్థాయి అవసరాలను బట్టి అందులో మార్పుచేర్పులు ఉంటాయి.

అన్నీ మాటల్లోనే ...

ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సినవి అన్నీ ఇచ్చేశామని.. మిగిలిన ఒకటి, అరా ఉంటే అవి కూడా ఇచ్చేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ తన వాక్చాతుర్యంతో అందరినీ నమ్మించడానికి ప్రయత్నించారు. వాళ్లు ఇచ్చేశామని చెబుతున్న వాటిలో మచ్చుకు ఒకదాని గురించి మాట్లాడుకుందాం. ఏపీ ఎన్ఐటీ అంటూ తాడేపల్లిగూడేనికి ఇచ్చామని చెబుతున్నారు. అక్కడ ఇప్పటికే పాఠాలు చెబుతున్నామని కూడా అంటున్నారు. కానీ, అక్కడకు ఒక్కసారి వెళ్లి చూస్తే వాస్తవం ఏంటో తెలుస్తుంది. ఒక ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజి వాళ్లు వేసిన ముష్టితో ఆ ఎన్ఐటీ నడుస్తోంది. సదరు కాలేజివాళ్లు పోనీలే అని తమ భవనాలతో పాటు అదనంగా మరికొన్ని కూడా కట్టించి అందులో ఎన్ఐటీ క్లాసులు నడుపుకోడానికి అనుమతి ఇచ్చారు. హాస్టల్ వసతి విషయానికొస్తే మగపిల్లలకు అక్కడుంది గానీ ఆడపిల్లలకు వేరే చోట ప్రైవేటు భవనంలో వసతి ఇవ్వాల్సి వచ్చింది. ఇంతవరకు తాడేపల్లిగూడెం ఎన్ఐటీకి కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణానికి కావల్సిన నిధులు కూడా కేంద్రం నుంచి మంజూరు కాలేదంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. కేంద్రం ఇచ్చేశామని చెబుతున్న జాతీయస్థాయి విద్యా సంస్థల పరిస్థితి ఇంత అందంగా ఉంది. రేపోమాపో ఇక మా భవనాలు మాకు కావాలి.. మీరు వెళ్లండి అని ఆ ఇంజినీరింగ్ కాలేజివాళ్లు చెబితే ఇక విద్యార్థులంతా రోడ్డు మీద పడాల్సిందే. దానికితోడు పూర్తిస్థాయి ఫ్యాకల్టీ కూడా అక్కడ లేదు. వరంగల్‌లో ఉన్న ఎన్ఐటీ నుంచి కొంతమంది ఫ్యాకల్టీ వారాంతాల్లో వచ్చి అక్కడ పాఠాలు చెప్పి వెళ్తుంటారు. అందుకోసం దేశం మొత్తమ్మీద ఆ ఒక్క ఎన్ఐటీలో మాత్రమే శని, ఆదివారాలు కూడా పనిదినాలు అవుతున్నాయి. మిగిలిన సంస్థల సం'గతీ' అలాగే తగలబడింది.

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఐదేళ్లు కాదు పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఎన్డీయే పెద్దలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తలేదు. ఏళ్ల తరబడి ప్రతిపక్షం విపరీతంగా ఉద్యమాలు చేయడంతో ఏదో ఒకటి చేయండని ఏపీ ప్రభుత్వం అడిగిన మీదట.. ఒకరోజు అర్ధరాత్రి ఉన్నట్టుండి జైట్లీ తాము రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నామని.. అందువల్ల ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని ప్రకటించారు. ఈ ప్యాకేజి ద్వారా అదనంగా నిధులు ఇస్తామని ఊదరగొట్టారు. పోనీ, ఆ పారేసే ముష్టి ఏదో పారేస్తే దాంతోనైనా కాస్త మేలు జరుగుతుందనుకుంటే.. అందులోనూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్ర కొత్త రాజధాని నగరంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) తరహా ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చెప్పినా, ఈ ఐదు బడ్జెట్లలో దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరి ఇంకా ఎయిమ్స్ ఎప్పుడు పెడతారో, దానికి నిధులు ఎక్కడి నుంచి తేవాలో కేంద్రమే చెప్పాలి.

తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఐదేళ్లు కాదు పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఎన్డీయే పెద్దలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తలేదు. ఏళ్ల తరబడి ప్రతిపక్షం విపరీతంగా ఉద్యమాలు చేయడంతో ఏదో ఒకటి చేయండని ఏపీ ప్రభుత్వం అడిగిన మీదట.. ఒకరోజు అర్ధరాత్రి ఉన్నట్టుండి జైట్లీ తాము రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నామని.. అందువల్ల ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని ప్రకటించారు. ఈ ప్యాకేజి ద్వారా అదనంగా నిధులు ఇస్తామని ఊదరగొట్టారు. పోనీ, ఆ పారేసే ముష్టి ఏదో పారేస్తే దాంతోనైనా కాస్త మేలు జరుగుతుందను కుంటే.. అందులోనూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. రాష్ట్ర కొత్త రాజధాని నగరంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) తరహా ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చెప్పినా, ఈ ఐదు బడ్జెట్లలో దానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. మరి ఇంకా ఎయిమ్స్ ఎప్పుడు పెడతారో, దానికి నిధులు ఎక్కడినుంచి తేవాలో కేంద్రమే చెప్పాలి.

తెలంగాణ పరిస్థితీ అంతే!

ఇటు తెలంగాణకు కూడా కేంద్ర ప్రభుత్వం పెద్దగా ఒరగబెట్టింది ఏమీ లేదు. పసుపుబోర్డు కేటాయించాలని ఎంపీ కవిత దగ్గర నుంచి చాలామంది చాలాసార్లు కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నా.. అవన్నీ బధిర శంఖారావాలే అయ్యాయి తప్ప ప్రయోజనం కనిపించలేదు. ఇక రైతులకు మేలుచేసే బడ్జెట్ అని ఘనంగా చెప్పుకొంటున్నా.. ఎరువుల సబ్సిడీలను నేరుగా రైతులకు కాకుండా ఎరువుల కంపెనీలకు ఇవ్వడం వల్ల రైతులకు పైసా ప్రయోజనం కూడా రావట్లేదు. ఆ విషయాన్నీ పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రక్షణ సంస్థలను తెలంగాణలో ఏర్పాటుచేయాలని రాష్ట్ర మంత్రులు కోరినా, అటునుంచి స్పందన మాత్రం లేదు. సాగునీటి ప్రాజెక్టులు కట్టుకుంటున్నామని, వాటికి నిధులివ్వాలని కోరితే సమాధానం లేదు. రైతులందరికీ ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దానికి సంబంధించి కొంత సాయం చేయాలని అడిగితే పట్టించుకునే తీరిక కేంద్ర పెద్దలకు లేదు. జీఎస్టీ పేరుతో రాష్ట్రాల ఆదాయానికి గండిపెట్టి.. ఆ తర్వాత చేయాల్సిన సాయం మాత్రం చేయకుండా వదిలేయడం వల్ల తెలుగు రాష్ట్రాలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


ఉనికి లేదనే తెలుగురాష్ట్రాలపై చిన్నచూపు

వచ్చే సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో కూడా జమిలి ఎన్నికలే ఉన్నాయి. అసెంబ్లీలకు, లోక్‌సభా స్థానాలకు కలిపి ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. కానీ, ఈ రెండు రాష్ట్రాలలో తమకు పెద్దగా బలం పెరిగే అవకాశం లేదని కమల నాథులకు స్పష్టంగా తెలుసు. అందుకేనేమో.. ఈ రాష్ట్రాల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా అలా వదిలేశారు. పార్లమెంటు సాక్షిగా గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ నిలువునా పట్టుకుని ప్రభుత్వాన్ని, ప్రభుత్వ పెద్దలను కడిగి పారేసినా.. ఆ సమయానికి సభలో ప్రధానమంత్రి సహా ముఖ్యమైన మంత్రులెవరూ లేకపోవడం, సభాపతి స్థానంలో కూడా స్పీకర్ బదులు ప్యానల్ స్పీకర్ మాత్రమే ఉండటంతో ఆయనది అరణ్యరోదనగానే మిగిలిపోయింది. ఒకవైపు జయదేవ్, మరోవైపు కవిత సంధించిన ప్రశ్నలకు కేంద్ర పెద్దల వద్ద సమాధానం ఉంటే ఒట్టు. నాలుగేళ్ల నుంచి పదే పదే అడుగుతున్నా బీజేపీ పెద్దలకు దక్షిణాది రాష్ట్రాలు.. అందునా తెలుగు రాష్ట్రాలంటే ఎందుకు పట్టింపు ఉండట్లేదు? ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నట్లుగా.. ఈ రాష్ట్రాలు రెండూ దేశంలో భాగం కావని ఏమైనా అనుకుంటున్నారా? అలాంటి ఉద్దేశమే ఉంటే నేరుగా ముఖం మీద కుండబద్దలుకొట్టినట్లు చెప్పేయాలి. ఎవరిచావు వాళ్లు చస్తారు. ఓట్లు అడుక్కోడానికి మాత్రం పనికొచ్చే ప్రజలు.. నిధులు, ప్రాజెక్టుల విషయంలో పనికిరారని వాళ్లు అనుకుంటే వాళ్లు మనకూ అక్కర్లేదు. ఆ ఊరికి ఈ ఊరు ఎంతదూరమో, ఈ ఊరికి ఆ ఊరూ అంతే దూరమన్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు.. ముఖ్యంగా ఉత్తరాది నాయకులు గుర్తుంచుకోవాలి. ఐటీ పరిశ్రమలో దూసుకుపోతున్నది అంతా దక్షిణాది నగరాలే. ఉత్తరాదిలో ఏదో ఒకటి రెండు మినహా మిగిలిన రాష్ట్రాలలో అసలు ఐటీ జాడే లేదు.

ఉత్తరాది ఎంగిలి మెతుకులు అవసరమా?

అలాగే విశాఖపట్నం, చెన్నై లాంటి ప్రధానమైన ఓడరేవులు కూడా ఇక్కడ ఉన్నాయి. త్వరలో విజయవాడ విమానాశ్రయం కూడా అంతర్జాతీయస్థాయికి ఎదగనుంది. ఇన్ని వనరులున్నప్పుడు ఇక ఉత్తరాది వాళ్ల ఎంగిలిమెతుకుల కోసం ఆశపడాల్సిన ఖర్మ దక్షిణాది రాష్ట్రాలకు పట్టలేదు. ఇవి పూర్తి స్వయంసమృద్ధి సాధించ గలవు కూడా. ఇక్కడి సహజవనరులకు తోడు మానవ వనరులు కూడా అపారంగా ఉన్న విషయాన్ని గుర్తెరగాలి. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చినవారే. రిజర్వు బ్యాంకు గవర్నర్లుగాను, ఆర్థికశాఖలో ప్రముఖ స్థానాల్లోను కూడా ఎక్కువమంది దక్షిణాదివారే ఉంటున్నారు. ఇన్ని ఉన్న మనం వాళ్లను దేబిరించడం కంటే మన బతుకేదో మనం బతికేస్తే పోలా!!

వైజ్ఞానిక విప్లవానికి పిలుపు



మానవ వనరుల మంత్రిత్వ శాఖను కేంద్రంలో నిర్వహిస్తున్న సత్యపాల్‌సింగ్ మన పాఠశాలల్లో, కళాశాలల్లో బోధిస్తున్న డార్విన్ పరిణామ వాద పాఠ్యాంశాలను తొలగించాలని ప్రకటన చేశారు. ఈయన ఆర్.యస్.యస్. కార్య కర్తగా ఎదిగినవాడు. ఆర్.యస్.యస్.వాళ్ళు భారతదేశానికి చేసిన విద్రోహం చరిత్రలో చెరిగిపోనిది. భారతదేశంలో విస్తరిస్తున్న శాస్త్రజ్ఞానానికి అవరోధంగా మతోన్మాద కార్య క్రమాలు నిర్వహించడం ఆర్.యస్.యస్.దినచర్య. ప్రపంచం మొత్తంగా సైన్స్ దినదినం అభివృద్ధి చెందుతూనే వుంటుంది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కరు నూత్న సిద్ధాంతాన్ని ప్రపంచానికి వెలుగుదివ్వెగా అందిస్తారు. డార్విన్ ఈ శాస్త్రీయ సత్యాన్ని కనుగొనడం కోసం ఎంతో శ్రమించారు. పరిణామవాదం అనే సిద్ధాంతాన్ని చార్లెస్ డార్విన్ ప్రమాణబద్ధంగా ప్రపంచం ముందుకు తెచ్చారు. ఇందులో పరిశోధనా దృష్టి వుంది. శాస్త్రీయ దృక్పథం వుంది. నిరంతర అధ్యయనం వుంది. ఆయన దీన్ని శాస్త్ర బద్ధంగా నిరూపించారు. ఈ సిద్ధాంతాన్ని స్వీకరించక పోవడం వల్ల ఆర్.యస్.యస్. మరింత జ్ఞాన వ్యతిరేకశక్తిగా మారే ప్రమాదం వుంది. ఈ సిద్ధాంతాలు గాని విద్యార్థులకు తెలియకపోతే వారు పుక్కిట పురాణాలు చదివే అంధులుగా తయారౌతారు.

బ్రిటన్‌లో ఎడిన్‌బర్గ్ మెడికల్ అధ్య యనానికి మంచి స్థలం. డార్విన్ ఇక్కడ మెడిసన్ చది వాడు. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల కంటే కూడా ఇక్కడ విద్యలో స్వేచ్ఛవుంది. డార్విన్‌నే కాదు ఎందరో మేధావుల్ని ఎడిన్‌బర్గ్ తయారు చేసింది. ఏ మనిషైనా, పరిశోధకుడైనా కేవలం పాఠ్యగ్రంథాలు బట్టీ పెట్టడం వలన ఏమీ సాధించలేడు. డార్విన్ కొత్తగా ఆలోచించేవాడు. ఆయ నది పరిశోధనాత్మకమైన మేధస్సు. మెడిసన్‌కు వెళ్ళక ముందు ఆయన కేంబ్రిడ్జిలో స్టడీ ఆఫ్ డివినిటీని అధ్య యనం చేయడానికి వెళ్ళినపుడు కూడా, ఆయన అందులో కుదురుకోలేదు. ఆయన వివిధ రకాలైన తుమ్మెదలను సేక రించి వాటిలోని మార్పులను, వైవిధ్యాన్ని గూర్చి పరిశోధించాడు. అంతేకాదు బైబిల్లోవున్న దైవత్వాన్ని ఆయన నమ్మలేదు. మానవులు జీవుల పరిణామం నుంచి ఆవిర్భవించారని ఆయన కనుగొనగలిగాడు. రాబర్ట్ ఇంగర్‌సాల్ దేవుణ్ని మానవుడే సృష్టించాడు. తన రూపంలో తన స్వభావాలతో, తనకంటే కూడా శక్తిమంతుడిగా దేవుణ్ణి తయారు చేసుకొన్నాడు.

మానవుడు గొప్ప శిల్పి, గొప్ప నిర్మాణ కర్త అని రాబర్ట్ ఇంగర్‌సాల్ విశ్లేషించాడు. చార్లెస్ డార్విన్ అభిప్రాయం కూడా అదే. అందుకు ఆయన 'బీగల్ నావలో 5 ఖండాలు 5 సంవత్సరాలు ప్రయాణం చేశాడు. హెచ్.యం.యస్. బీగల్ అనే నావే ఆయనకు 5 సంవత్సరాలు ఒక ఇల్లు. ఆయన ప్రయాణంలో 'సీసిక్‌నెస్'కు గురయ్యాడు. అంతేకాదు ఆ అనారోగ్యం ఆయన్ని జీవితాంతం వేధించింది కూడా. ఆయన ఆయా జాతులను పరిశోధించడమే కాదు. ఒక శాస్త్రీయ సత్యాన్ని కనుగొనడం కోసం ఇంత ప్రయాణం చేసిన వ్యక్తిని, అందునా 5 ఖండాలు 5 సంవత్సరాల్లో తిరిగిన వ్యక్తిని ప్రపంచంలో మరొకరిని చూడలేము. అసలు ప్రపంచం డార్విన్ అనే శాస్త్రవేత్తను గుర్తించడమే నిజమైన వెలుగు. ఎందరో తత్వవేత్తలు అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి ఎన్నో తాత్వికమైన, శాస్త్రీయమైన, చారిత్రాత్మకమైన కొత్త అంశాలు కనుగొంటారు. అవి వెలుగులోకి రావడం చాలా కష్టం. అయితే అనేక వైరుధ్యాల మధ్య డార్విన్ వాటిని బయటకు తెచ్చాడు. డార్విన్ ముందు కూడా జీవశాస్త్ర పరిణామం గురించి కొంత పరిశోధన జరిగింది.



ఆ పునాదులను కూడా డార్విన్ పరిశోధిం చాడు. 1707-1778 మధ్య జీవించిన జీవశాస్త్రజ్ఞుడు లినేని యన్ స్వీడన్ దేశస్థుడు. ఆయన సిద్ధాంతాలు శాస్త్రజ్ఞానంతో ప్రపంచానికి వెలుగునిచ్చాయి. ప్రపంచంలో శాస్త్రవేత్త అనే వాడు ఏ దేశంలోనైనా వుండవచ్చు. ఆ శాస్త్ర జ్ఞానాన్ని మనమందరం అందుకోవడం మన జ్ఞాన విస్తృతికి మూలం అవుతుంది. శాస్త్రం అనేది మానవాభ్యుదయానికి నిచ్చెన వంటింది. ఈనాడు మానవుని ప్రతి అడుగులో అభ్యుదయం శాస్త్రజ్ఞానం వల్లే జరుగుతుంది. సంఘపరివార శక్తులు భారతదేశంలో వున్న విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టుగా వున్నారు. చరిత్రలో, అర్థశాస్త్రంలో, పర్యావరణ శాస్త్రంలో, భౌగోళిక శాస్త్రంలో అభూత కల్పనలు జూపించి సత్య నిష్టవైపు, శాస్త్ర జ్ఞానార్జనవైపు విద్యార్థులు పయనించకుండా పుక్కిట పురాణాలకు బానిసలు అయ్యేటట్లు చేస్తున్నారు. డార్విన్ అధ్యయనం చేయడం వల్ల ఒక శాస్త్ర సత్యాన్ని కనుగొనాలంటే ఎంత సుదీర్ఘమైన ప్రయాణాలు చేయాలి, ఎన్ని ప్రమాదాలను ఎదుర్కోవాలి, ఎంత త్యాగపూరితమైన జీవితాన్ని జీవించాలనే విషయాన్ని అర్థం చేసుకోవాలని మన పరిశోధకులకు అర్థం అవుతుంది. మోదీ రాజ్యంలో మతఛాందస్సులుగా వున్న మంత్రులు చాలామంది వున్నారు. వాళ్ళు జ్ఞాన విదూరులు, మానవతా రహితులు, మేథోసంపన్న విధ్వంసుకులు. నిజానికి హేతువాద భావజాలానికి, మతానికి చాలా వైరుధ్యం వుంది. శాస్త్రజ్ఞానం అనేది మనుష్యుల బుర్రలకెక్కాలంటే, విశ్వాసాలకు అతీతంగా ఆలోచించగలిగాల్సివుంది.

ఏగతి రచియించినా, ఏ గతి జీవించినా సమకాలం వారలు తత్వవేత్తలకు శాస్త్రవేత్తలకు మెచ్చరనేది ఒక సత్యం. తత్వవేత్తలను, శాస్త్ర వేత్తకు సమన్వయం సాధించడంలో అద్వితీయమైన పాత్ర ను బెర్ట్రండ్ రస్సెల్ సాధించాడు. డార్విన్‌లో కాని, కారల్ మార్క్స్‌లో కాని మరి ఏ తాత్వికునిలోను శాస్త్రవేత్తలోను వున్న శాస్త్రీయ భావజాల విస్తృతిని రస్సెల్ మన ముందుకు తెచ్చాడు. ప్రతి తత్వవేత్తకు, శాస్త్రవేత్తకు జ్ఞానానికి పరిమి తులుంటాయి. రాబోయే కాలం వారు వాటిలో కొన్నింటిని ఖండించవచ్చు. కొన్నింటిని పూరించవచ్చు. ఇదొక సత్యా న్వేషణాక్రమం.

ప్రతి పౌరుడు, విద్యార్థి, పరిశోధకుడు శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేయడం వలన, స్ఫూర్తి పొందవచ్చు. అంతేకాదు, వారి నుంచి అధ్యయన క్రమాన్ని పరిశోధనా క్రమాన్ని మనం అనుసరించవచ్చు. చార్లెస్ డార్విన్ గొప్ప పరిశోధకుడే కాదు, గొప్ప అధ్యయన పరుడు. ఆయనది శాస్త్రపరమైన రచన. ఆయన జీవితంలోని ఆటుపోటులను ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నాడు. డార్విన్ పరిణామ వాదాన్ని 6వ తరగతి నుండే పిల్లలకు అభ్యసనం చేయించకగలిగితే శాస్త్రం ఆవశ్యకత, మానవుని పుట్టుక యొక్క మూలాలు విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అర్థమౌతాయి. భూమి దేవత, పాలసముద్రం, శేషశాయి తల్పాలు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సృష్టి పెంపులయ కారుకులనే భ్రమలు తొలుగుతాయి. జ్యోతిష్య శాస్త్రం పచ్చి బూటకం, ఖగోళ శాస్త్రాన్ని అధ్యయనం చేయాలని తెలుస్తుంది. పరిణామ వాదం బుద్ధికి పదును పెడుతుంది.

భూమి గుండ్రంగా వుంది అన్నందుకు కొపర్నికస్‌ను జైల్లో బంధించారు. బ్రూనోను మంటల్లో తగలబెట్టారు. డార్విన్ పరిణామ వాదం కనిపెట్టక ముందు కూడా ప్రపంచ వ్యాప్తంగా పదార్థవాద చర్చ విస్తృతంగానే జరిగింది.

దర్శనం

డార్విన్ పరిణామ వాదం ఒక శాస్త్రంగా విద్యా వ్యవస్థను సుసంపన్నం చేసి మానవుని ఆవిర్భావం మీద ఒక స్పష్టతను తీసుకొచ్చి మనుష్యుల్లో ఆత్మస్థైర్యాన్ని కలుగజేస్తుంది. ఈ రోజున భారతదేశమే కాదు ప్రపంచం మొత్తం కూడా డార్విన్ పరిణామవాదం వైపు నడుస్తుంది. ఆర్.యస్.యస్.వాళ్ళు శాస్త్ర జ్ఞాన ఫలితాలు అనుభవిస్తున్నారు. మనిషి పుట్టుక తెలిస్తేనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. వ్యక్తి ఏ అతీతశక్తులకో బానిసై తనను తాను నియంత్రించుకోలేక అదుపుతప్పి ఉన్మాదై, హంతకుడై, అణచివేత దారుడై, ఆత్మన్యూనతాపరుడై తనను తాను ధ్వంసం చేసుకొనే పరిస్థితి నుంచి డార్విన్ పరిణామవాదం తానంటే ఏమిటో తెలుపుతుంది.

సైన్స్ బోధించే ఉపాధ్యాయులే రాళ్ళకు మొక్కుతుంటారు. పిల్లలకివ్వాల్సిన పాలను రాళ్ళ పై పోస్తారు. భారతదేశంలో గుడులున్నన్ని లైబ్రరీలు లేవు. ఆశ్రమాలున్నన్ని ల్యాబ్‌లు లేవు. దేవుళ్ళు, దేవతల పేర్లను పిల్లలకు బట్టీపట్టిస్తారు. శాస్త్రవేత్తల పేర్లు రావు. రాముడు, కృష్ణుడు ఎవర్ని చంపారో నేర్పుతారు. ఏ వస్తువు ఎవరు కనుగొన్నారో చెప్పరు. దీనివల్ల విద్య మూఢవిశ్వాసాల మధ్యలో నలిగిపోతోంది. సమాజం అంటే ఏమిటో తెలుపుతుంది. ప్రకృతికి, తనకు వుండే అంతస్సంబంధాలను తెలుపుతుంది.

అందువల్ల విద్య, జ్ఞానం, సమన్వయం అవుతాయి. సామాజిక ప్రగతికి అవి మార్గాన్ని నిర్దేశిస్తాయి. ఇప్పుడు సంఘ పరివారశక్తుల్ని, దాని పునాది మీద వున్న రాజ్యాన్ని దించడమే లౌకికవాదుల ముందున్న కర్తవ్యం. అందుకు ఐక్యంగా, సమన్వయంగా, సముజ్వలంగా, సముత్తేజంగా, వైజ్ఞానిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్ళాలి. రాజకీయ అధికారాన్ని కూడా లౌకిక వాదులు చేపట్టినప్పుడే ఆర్.యస్.యస్.వారి వైజ్ఞానిక వ్యతిరేక వాదాలకు చరమగీతం పాడగలుగుతుంది. ఇది వైజ్ఞానిక విప్లవ యుగం. ఈ యుగ పరిణామాన్ని ఎవరూ ఆపలేరు. ఇది చారిత్రక సత్యం..

◆ డాక్టర్ కత్తి పద్మారావు
సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ
9849741695

ఇది నిజం

కవిత

నాలుగు చక్రాల / బండిపైన వీది వీదిన
తినుబండారాల బల్ల / చెక్కపైన కదలుతూనే
వుంటాయి / ఏ బేరం కాకపోయినా
ఈగలు వాలుతూనే వుంటాయి
కాలం మాత్రం యథేచ్ఛగా కదులుతుంది
పూటగడవని సూర్యుడు మాత్రం అస్తమించడు
ఈ నాలుగు చక్రాల బండిని మాత్రం వదలడు
ఫుట్‌పాత్‌పైన చివికిన / దుప్పటి గూటిలో పిల్లలు
ఆకలి వనంలో అల్లాడుతూనే వుంటారు
బాటసారుల ఓదార్పు



గాలి దీపంలా తచ్చాడుతుంది
వాలే పొద్దుపైన ఆకలి తుఫాను
విసురుతూనే వుంటుంది
బొమ్మల గిరాకి లేక / పక్కనే ఓ రంగుల బొమ్మ
కన్నీటి పర్యంతమౌతుంది
మహానగరం చేదు / అనుభవాల చీకటి
ముసుగేసుకొంటుంది
చలించే మనసుతో / రిక్తహస్తాల వేదన
కదిలే పాదాల ముందు వాలిపడుతుంది
ఎప్పుడు తెల్లవారుతుందో తెలియదు గాని
ఆ పిల్లల ముఖాలపైన యథేచ్ఛగా ఈగలు
వాలిపోతుంటాయి
యాంత్రికమైన దినచర్యలో
ఆకలి బ్రతుకులు అల్లాడుతూనే వుంటాయి
ఈ ముగింపులేని బ్రతుకు రంగుల రాట్నం
దీనవదనంతో నిత్యం
సంచరిస్తునే వుంటుంది.

- రవి ఆర్కె
9849294127



మనం ఎక్స్‌క్లూజివ్

కలలు కనడం మానవ నైజం.. కానీ కలలు నెరవేరడం అనేవి చాలా కొద్ది మందికే సాధ్యమవుతాయి. ఎందరో పెద్ద దర్శకులు కన్న కలలను సినిమాల రూపంలో నెరవేర్చడం ఆయనకు కెమెరాతో పెట్టిన విద్య. ఆయనే కె.కె.సెంథిల్‌కుమార్. తెలుగు సినిమా ఖ్యాతిని 'బాహుబలి' రూపంలో ప్రపంచానికి చాటిన దర్శకుడు రాజమౌళి కన్న కలను అర్థం చేసుకుని తెరపై కని వినీ ఎరుగని రీతిలో ఆవిష్కరించారు సెంథిల్ కుమార్. ఫిబ్రవరి 14 ప్రేమికుల రోజు. ఈ సందర్భంగా తన శ్రీమతి రూహి సెంథిల్ కన్న కలలకు భర్తగా ప్రాణం పోస్తున్న ప్రేమికుడు సెంథిల్ కుమార్‌తో 'మనం' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ....

నిజమైన ప్రేమలో కండిషన్స్ ఉండవు

కె.కె.సెంథిల్ కుమార్



మీ లవ్‌స్టోరీ గురించి చెప్పండి?

నేను కెరీర్‌పై పూర్తి ఫోకస్‌గా ఉండి.. ప్రేమ, పెళ్లి గురించి చాలా రోజులు ఆలోచించలేదు. కానీ మా అమ్మనాన్న పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేస్తుండేవారు. ఆ సమయంలో 'అరుంధతి' కాస్ట్యూమ్స్ డిజైనర్ దీప ద్వారా రుహి నాకు పరిచయం అయ్యారు. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ప్రేమ పెళ్ళికి దారి తీసింది. లవ్‌ను ముందుగా నేనే ప్రపోజ్ చేశాను. కానీ రూహి మాత్రం వెంటనే ఎస్ చెప్పలేదు. కొన్ని రోజులు సమయం తీసుకుని తర్వాత ఎస్ చెప్పారు.

'బాహుబలి' భారీ విజయాన్ని ముందే ఊహించారా?

లేదండీ!... సినిమా సక్సెస్ అవుతుందని తెలుసు కానీ ఇంత పెద్ద సక్సెస్ అవుతుందని అసలు అనుకోలేదు.

రాజమౌళి, ఇతర దర్శకులతో పనిచేసే సందర్భంలో వర్క్ పరంగా ఏమైనా ఛాలెంజింగ్ ఉంటుందా?

ఒక్కొక్కరి ఆలోచనా విధానం ఒక్కొక్క తరహాలో ఉంటుంది. కథను బట్టి ఈ ఆలోచన మారిపోతూ ఉంటుంది. నేను పనిచేసిన సినిమాల్లో రాజమౌళిగారితోనే ఎక్కువగా పనిచేశాను. రాజమౌళిగారు ఒక్కొక్క సినిమాను ఒక్కొక్క స్టయిల్లో చేయాలని చూస్తుంటారు. దానివల్ల మనకు ఛాలెంజింగ్‌గా అనిపిస్తుంది. సినిమా అంటే ఒక కథను ప్రేక్షకులకు కొత్తగా చెప్పడమే. కథను అనుసరించి దర్శకుడు ఏం చెబుతాడో ఊహించి, సినిమాటోగ్రాఫర్‌గా వారికి కావాల్సిన అవుట్‌పుట్‌ను అందించాల్సిన బాధ్యత ఉంటుంది.



రాజమౌళికి, మీకు మధ్య గొడవలు జరిగాయా?

గొడవలు జరిగాయని చెప్పలేను కానీ..ఇద్దరు మనుషులు కలిసి పనిచేసే సమయంలో వారి మధ్య పాయింట్ ఆఫ్ వ్యూలో తేడా కచ్చితంగా ఉంటుంది. అలాంటి సమయంలో కాస్త పెద్దగా మాట్లాడుకోవడం కూడా జరగొచ్చంతే!. ఆ సమయంలో ఏది కరెక్ట్? ఏది తప్పు అని ఇద్దరం డిస్కస్ చేసుకుని ఏది బెటరో ఆలోచించుకుని ముందు కెళ్తుంటాం.



మీ ఆహారం విషయంలో రూహీ స్పెషల్ కేర్ ఏమైనా తీసుకుంటారా?

రూహీ యోగా టీచర్. నా హెల్త్ పట్ల హండ్రెడ్ పర్సెంట్ ఆమె చాలా కేర్ తీసుకుంటుంది. ఏమి తినాలి. ఏం తినొద్దు అనే విషయాలపై తను శ్రద్ధ వహిస్తుంటుంది. ఎక్కువగా నేను ఇంటి వంటకాలను తినడానికి ప్రాధాన్యతనిస్తుంటాను.

వర్క్ పరంగా ఎలా అప్‌డేట్ అవుతుంటారు?

సినిమాటోగ్రఫీ అనేది క్రియేటివ్ వర్క్. ప్రతి విషయాన్ని కొత్త కోణంలో చూడాల్సి ఉంటుంది. మాతో పాటు టీం సభ్యులు అందరూ కలిసి ఆ అవుట్‌పుట్ గురించి ఆలోచిస్తారు. క్రియేటివిటీని మరొకరు నేర్పించలేరు. మనలో మనం దాన్ని డెవలప్ చేసుకుంటూ రావాల్సిందే. ఇలా డెవలప్ చేసుకోవడానికి కొంత చదువుకోవాల్సి కూడా ఉంటుంది. ఉదాహరణకు సినిమాటోగ్రఫీని ముందు ఎలా చేసేవారో.. ఇప్పుడు ఎలా చేస్తున్నారు? ఎలా చేయవచ్చు... అనే విషయాలను పుస్తకాల్లో చదివి నేర్చుకోవచ్చు. చిన్నప్పుడు మీరెలా ఉండేవారు.. మీరు ఎలాంటి సంగీతం వినేవారు.. మీకేం నచ్చుతాయి ఇలాంటి విషయాలు కూడా మన వర్క్ మీద కొంత ప్రభావం చూపుతాయి. ఇలా నేర్చుకోవడం అనేది మన జీవితాంతం జరుగుతూనే ఉంటుంది. మన చరిత్ర ద్వారా కొంత నేర్చుకుంటాం. ఏ సబ్జెక్ట్‌లో ఎలా వర్క్ చేశారనేది కొన్ని సినిమాలను చూసి కూడా నేర్చుకోవచ్చు.

వ్యక్తిగత జీవితాన్ని, వృత్తి పరమైన జీవితాన్ని ఎలా బ్యాలెన్స్ చేసుకుంటున్నారు?

బ్యాలెన్స్ చేసుకోవడం ఒక ఆర్ట్. ఏ సమయంలో ఏం చేయాలనే దాని గురించి ఆలోచన ఉండి దాన్ని ఫాలో అయితే చాలు. అలాగే మనకు కుటుంబ సభ్యుల సహకారం కూడా ఉండాలి. ఆ విషయంలో నేను అదృష్టవంతుడ్ని. ఎందుకంటే పెళ్లి కాకముందు నా కుటుంబ సభ్యులు సపోర్ట్ చేస్తే... ఇప్పుడు నా భార్య రూహి నాకు పూర్తి సహకారాన్ని అందిస్తుంది.

'బాహుబలి' సినిమాకు ఎక్కువ సమయం పట్టింది. అలాంటి సందర్భాల్లో కుటుంబ సభ్యులకు సమయాన్ని ఎలా కేటాయించారు?

'బాహుబలి' వంటి పెద్ద ప్రాజెక్ట్‌ని చేసే సమయంలో కుటుంబ సభ్యులకు సమయాన్ని కేటాయించడం అంటే కాస్త కష్టమైన విషయమే. టీమ్ అందరూ ఇలాంటి సినిమా అవకాశం మళ్లీ వస్తుందో రాదో.. వచ్చింది కాబట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలోచించి హార్డ్ వర్క్‌చేశాం. అప్పుడు ఫ్యామిలీకి సంబంధించిన వ్యవహారాలను రుహినే హ్యాండిల్ చేసింది.





టెక్నీషియన్‌గా రాజమౌళిని అర్థం చేసుకోవడం కష్టమా? భార్యను అర్థం చేసుకోవడం కష్టమా?

(నవ్వుతూ..) చాలా కష్టమైన ప్రశ్న వేశారు. నిజం చెప్పాలంటే భార్యను అర్థం చేసుకోవడమే కష్టం. ఎందుకంటే రాజమౌళిగారిని అర్థం చేసుకోవాలంటే హోం వర్క్ చేస్తే సరిపోతుంది. నిజ జీవితంలో హోం వర్క్ చేయలేం కదా.

జీవితంలో సాంకేతిక నిపుణుడిగా ఉండటాన్ని ఇష్టపడతారా లేక ప్రేమికుడిగా.. భర్తగా, తండ్రిగా ఉండటాన్ని ఆస్వాదిస్తారా?



మాది ప్రేమ వివాహం. నేను జీవితంలో ప్రతి దశను ఎంజాయ్ చేశాను. లవర్‌గా, భర్తగా, తండ్రిగా అన్నింటిని ఎంజాయ్ చేశాను.. చేస్తున్నాను. ఇక వృత్తిపరంగా చూస్తే.. సినిమా చేసేటప్పుడు హండ్రెడ్ పర్సెంట్ నా ఎఫర్ట్ పెట్టి పనిచేస్తాను.

మీ శ్రీమతి పెళ్లికి ముందు ఏమైనా కండిషన్స్ పెట్టారా?

ఎలాంటి కండిషన్స్ లేవు. తనకి నాపై నమ్మకం లేకపోవడానికి మేమేం టీనేజ్‌లో ప్రేమించి పెళ్లి చేసుకోలేదు. ఓ పరిణతితో కూడిన వయసులోనే ప్రేమ పెళ్లి చేసుకున్నాం. ఇద్దరి మధ్య మంచి అవగాహన ఉంది. సాధారణంగా సినిమా అంటే గ్లామర్ ప్రపంచం. లేడీస్‌కి భయాలుంటాయి. కాదనను.. అయితే వారికి నమ్మకం ఇవ్వాల్సింది మనమే. సింపుల్‌గా చెప్పాలంటే నిజమైన ప్రేమలో కండిషన్స్ ఉండవు.

మీ శ్రీమతిని ఇంప్రెస్ చేసే పనులు చేస్తుంటారా?

పెళ్లికి ముందు నేను రూహిని కలిసే ప్రతిసారీ నాకు తను గిఫ్ట్స్ ఇచ్చేది. నేనేం ఇచ్చేవాడిని కాను. అయితే ఓసారి తనకి సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. తను హైదరాబాద్ వచ్చినప్పుడు నేను తనని పికప్ చేసుకోవడానికి బేగంపేట్ ఎయిర్‌పోర్ట్‌కి వెళ్లాను. తను బయటకు రాగానే తననే సూట్ కేసుని కారు డిక్కీలో పెట్టమని అన్నాను.

తనకి కోపం వచ్చింది.. కానీ ఏమీ అనకుండా తనెళ్లి కారు డిక్కీ ఓపెన్ చేసింది. చేయగానే.. కారు డిక్కీ నిండా గిఫ్ట్స్ చూసి థ్రిల్ అయ్యింది. అలా రూహిని ఇంప్రెస్ చేశాను. ఇక భర్తగా ప్రతిరోజూ తనని ఇంప్రెస్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను కానీ.. ఇంప్రెస్ చేయలేకపోతున్నాను.

ఇద్దరి మధ్య గిల్లికజ్జాలు గురించి?

భార్యభర్తలు అన్న తర్వాత గిల్లికజ్జాలు సాధారణంగా జరుగుతుంటాయి. ఇలాంటివి జరిగితేనే లైఫ్ హెల్దీగా ఉంటుంది. అలాంటివి జరిగినప్పుడు నేనే తనకి సారీ చెబుతాను. తొంభై శాతం ఇలాంటి గిల్లికజ్జాలు జరిగినప్పుడు మగాళ్లే సారీ చెబుతారని అనుకుంటున్నాను. మగాళ్లది తప్పున్నా.. లేకున్నా.. (నవ్వుతూ).

సెంథిల్ భర్తగా ఇంట్లో ఎలా ఉంటారు? వంటలు చేయడంలో సపోర్ట్ చేస్తుంటారా?

నేను చాలా సోమరిని. ఇంట్లో పేపర్ చదువుకుంటూ ఉంటాను. అప్పుడప్పుడు వంట చేయడానికి ట్రై చేస్తాను. అయితే అలా ట్రై చేసినప్పుడల్లా ఇంకా రూహికి పని ఎక్కువ పనైపోద్ది. అందుకే తను నన్ను వంటింట్లో ఏమీ ట్రై చేయొద్దంటుంది.

పిల్లల పెంపకం విషయంలో మీ పాత్ర ఎంతవరకు వుంటుంది?

నేను ఇంట్లో వున్నప్పుడు పిల్లలు చదువు పరంగా కొన్ని డౌట్స్ అడుగుతుంటారు. నాకు తెలిసింది నేను ఎక్స్‌ప్లెయిన్ చేస్తుంటాను. కొన్నిసార్లు నాకు తెలియకపోతే గూగుల్ అయినా వెతికి వారికి వివరిస్తుంటాను. ఎందుకంటే మనం బిజీగా వున్నాం అని చెప్తే పిల్లలు మనల్ని అడగటం మానేస్తారు. అందుకే సమయమున్నప్పుడల్లా పిల్లలతో టైమ్ స్పెండ్ చేస్తుంటాను.



మొదటిసారి తండ్రి అయినప్పుడు మీ ఫీలింగ్ ఏంటి? మీ నాన్నగారు ఏమైనా గుర్తొస్తుంటారా?

తండ్రి అయ్యేప్పుడు ఫస్ట్‌టైమ్ మా బాబుది హార్ట్‌బీట్ విన్నాను. ఆ రోజు వెరీ ఎగ్జైటింగ్‌గా అన్పించింది. మనం కొత్త రోల్‌కి ఎంటర్ అయ్యామనిపించింది. ఆ అనుభూతిని వివరించలేను. మా నాన్నగారంటే రోజు రోజుకీ గౌరవం పెరుగుతుంది. ఆయన మమ్మల్ని ఎలా పెంచారో గుర్తులేదు.. కానీ ఇలాగే వుండి వుంటుంది అనే ఫీలింగ్ అయితే వుంది. నాకు ఊహ తెలిసినప్పటి నుండి మా నాన్నగారు నాకేం కావాలో అన్నీ దగ్గరుండి చూసుకునేవారు. నా పట్ల బాగా ప్రేమగా వుండేవారు. నేను కూడా మా పిల్లలతో అలాగే ఉంటున్నాను.





మీరు మంచి పేరున్న సినిమాటోగ్రాఫర్ కదా! ఈ విషయంలో మీ పిల్లలు ఏమైనా అంటుంటారా?

'బాహుబలి' టైమ్‌లో స్కూల్‌లో వాళ్ల పిల్లలతో 'మీ ఫాదర్ 'బాహుబలి' మూవీకి కెమెరామెన్. వెరీ ప్రౌడ్ ఆఫ్ ఇట్ అనే'వారంట. ఒకరోజు మా అబ్బాయి వచ్చి 'డాడీ మీరు చాలా ఫేమస్ కెమెరామెన్ అంట నిజమేనా!' అని అన్నాడు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. పిల్లలు చాలా చిన్నవాళ్లండీ. వాళ్లు స్లోగా అర్థం చేసుకుంటారు.

సెంథిల్ కెమెరామెన్‌గానే వుండాలనే అనుకుంటున్నారా..? లేక డైరెక్షన్, ప్రొడక్షన్ ఏమైనా చేస్తారా?

ప్రస్తుతం నేను పనిచేస్తున్న సినీ రంగంలో మనం రోజు నేర్చుకుంటే ఇంకా నేర్చుకోవాలనే ఫీలింగ్ వుంటూనే ఉంటుంది. ప్రస్తుతం అయితే సినిమాటోగ్రాఫర్‌గా చాలా హ్యాపీ. ఫ్యూచర్‌లో చెప్పలేను.

మీరు ఫిబ్రవరి 14ని స్పెషల్‌గా సెలబ్రేట్ చేస్తుంటారా?

ఒకప్పుడు వేలంటెన్స్ డేని సెలబ్రేట్ చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు చేయడం లేదు. అయితే ఏదో చేయాలని ట్రై చేస్తుంటాను. ఏదన్నా స్టార్ట్ చేసినా కంప్లీట్ అవదు. ఆలోచన స్టేజ్‌లోనే వుండిపోతుంది. ఇప్పుడు మీరు గుర్తు చేశారు కాబట్టి ఏదో ఒకటి చెయ్యాలని ట్రై చేస్తాను.

– మోహన్ కుమార్ తుమ్మల



ఏడు దేశాల్లో.. తెలంగాణ పర్యాటకం

(మొదటిపేజీ తరువాయి)

11న ఉదయం 7 గంటలకు పర్యాటక భవనం నుంచి సాహ సయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ నలుగురు మహిళలు మోటారు బైక్‌లపై 7 దేశాల్లో రోడ్డు మార్గం ద్వారా యాత్రను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ యాత్రలో భారతదేశం, తెలంగాణ పర్యాటక రంగ విశేషాలను ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. 50 రోజుల్లో సుమారు 17 వేల కిలోమీటర్లు భారతదేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు తూర్పు ఆసియా దేశాల్లో ప్రయాణించనున్నారని పేర్కొన్నారు. ఈ సాహస యాత్రకు జై భారతి నాయకత్వం వహిస్తారని, ఆమెతోపాటు ప్రియ, శాంతి, శిల్ప ఉంటారని తెలిపారు. యాత్రలో భాగంగా వీరు ఇండియా, బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం దేశాల్లో పర్యటిస్తారని, ఈ సమయంలో 19 యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్లు, 35 యునెస్కో సైట్లను సందర్శిస్తారని తెలిపారు. తెలంగాణ పర్యాటక రంగానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ... యాత్రలో ఉపయోగించేందుకు 400 సీసీ బైకులను బజాజ్ ఆటో కంపెనీ వారు స్పాన్సర్ చేశారని తెలిపారు. మహిళలు సురక్షితంగా పర్యటనలు నిర్వహించడానికి ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. వీరు పర్యటించే రాష్ట్రాలు, దేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా రాష్ట్ర పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రయాణ మార్గంలో గుర్తించిన ప్రాంతాల్లో తెలంగాణ పర్యాటక శాఖకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ సాహస యాత్రకు నాయకత్వం వహించే జై భారతి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో షీ టీములను ఏర్పాటు చేసి మహిళలకు భరోసా కల్పించడంతో అమ్మాయిలు ధైర్యంగా తిరుగగలుగుతున్నారని తెలిపారు.

రైల్వే శాఖ క్రమశిక్షణ చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమయ్యింది. రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ ఆదేశాల మేరకు దేశంలోని వివిధ జోన్లలో ఉన్న రైల్వే ఉన్నతాధికారులు సర్వే నిర్వహించి విధులకు డుమ్మా కొట్టిన వారి జాబితా సిద్ధం చేశారు. రైల్వేలో మొత్తం 13లక్షల మంది సిబ్బంది ఉండగా, ఇందులో 13,000 మంది అనధికారికంగా నెలల తరబడి సెలవులో ఉన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా విధులకు డుమ్మా కొట్టిన ఈ 13,000 మందిని ఉద్యోగాల నుంచి తప్పించాలని రైల్వే శాఖ ఆయా జోన్ల అధికారులకు ఆదేశాలిచ్చింది.

కాళేశ్వరం.. దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో మిషన్ భగీరథ పనులను, సిద్ధిపేట సమీపంలో నిర్మాణంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన 11 వ ప్యాకేజీ రంగనాయకి సాగర్ పనులు, అన్నారం బ్యారేజీలను కేంద్ర ఆర్థిక సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మొహతా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులు అత్యంత భేషుగ్గా ఉన్నాయని కొనియాడారు. అతి తక్కువ వ్యవధిలో ఇంత అద్భుతంగా పనులు జరగడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మరో నాలుగు నెలల్లో సంఘం ప్రతినిధులందరూ ఈ ప్రాజెక్టును సందర్శిస్తారని తెలిపారు. రంగనాయకి సాగర్ టన్నెల్ లో పనులు జరిగే తీరుపై అరవింద్ మెహతా సంతృప్తి వ్యక్తం చేశారు. సండ్లాపూర్లోని రంగనాయక సాగర్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, మ్యాప్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, దానికి అవసరమైన నిధులు, ఖర్చు వివరాలను అరవింద్ మెహతాకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధ్యమవుతుందని మెహతా అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో నిధుల వినియోగంపై ఫైనాన్స్ కమిషన్ తనిఖీలో భాగంగా 15వ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి తెలంగాణలో పర్యటిస్తున్నట్టు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. నిధుల వినియోగంపై సంఘం సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. వీరి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఇంజనీర్లు, తదితరులున్నారు.

గంజాయి చట్టబద్ధతకు పతంజలి డిమాండ్ !



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఆయుర్వేదంలో మంచి ప్రాధాన్యత ఉన్న గంజాయిని ఎందుకు చట్టబద్ధం చేయరు? అని ఆయుర్వేద సంస్థ, యోగా గురు బాబా రామ్ దేవ్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'పతంజలి' సంస్థ ప్రశ్నిస్తోంది. పురాతన కాలం నుంచి ఆయుర్వేద ఔషధాల్లో గంజాయిని వినియోగిస్తున్నారని, పతంజలి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలకృష్ణ గుర్తు చేశారు. ఈమేరకు గంజాయిపై తాము విస్తృతంగా పరిశోధనలు జరుపుతున్నట్టు, హరిద్వార్‌లోని పతంజలి ఆశ్రమంలో దీనిపై శాస్త్రవేత్తలు లోతుగా అధ్యయనం చేస్తున్నట్టు బాలకృష్ణ వెల్లడించడం విశేషం. గంజాయిని కేవలం మత్తుమందుగా మాత్రమే కాక పలు రోగాల చికిత్సల్లో సానుకూల ప్రభావం చూపేలా పనిచేస్తుందన్న విషయం మరవరాదని బాలకృష్ణ అన్నారు.

గంజాయి సాగు నేరమంటే ఎలా?

గంజాయి మొక్కలోని విషపూరితమైన పదార్థాలను తీసివేసి, వైద్యరంగంలో విస్తృతంగా ఉపయోగించదగిన గంజాయి సాగు నేరమంటే ఎలా అన్న పతంజలి సంస్థ, దీనిని చట్టబద్ధం ఎందుకు చేయకూడదనే చర్చను మరోమారు లేవనెత్తింది. గంజాయిని నిషేధించడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వ్యాపార అవకాశాలను నిరాకరిస్తున్నారని, గంజాయి గింజల వల్ల చాలా ప్రయోజనాలున్నాయని వివరించారు. కొన్ని దేశాల్లో వీటి వినియోగం అధికంగా ఉండడంతోపాటు ఆదాయం కూడా ఎక్కువగా వస్తోందని పతంజలి పేర్కొంది. మనదేశంలో గంజాయి సాగు, అమ్మకం, వినియోగాన్ని 1985లో నిషేధించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టం కింద దీన్ని నిషేధిత జాబితాలో పొందుపరచారు. మరోవైపు గంజాయిపై పతంజలి సంస్థ వెల్లడించిన అభిప్రాయాన్ని, ట్విట్టర్‌లో నెటిజెన్లు పెద్ద సంఖ్యలో అభినందిస్తున్నారు. భారీ కార్పొరేట్ సంస్థల ఆదాయానికి పెద్దఎత్తున గండికొడుతూ షాక్ ఇస్తున్న ఆయుర్వేద సంస్థ పతంజలి ఇప్పుడు గంజాయి చట్టబద్ధత కోసం డిమాండ్ చేస్తుండగా, గంజాయి సాగు చట్టబద్ధత కోసం పట్టుబడుతున్న వారికి మరింత మద్దతు లభించినట్టైంది.

షెహనాయ్ విద్వాంసుడు జామిన్ హుస్సేన్ ఖాన్ మృతి

వారణాసి, ఫిబ్రవరి 10: షెహనాయ్ విద్వాంసుడు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ మూడో కుమారుడు జామిన్ హుస్సేన్ ఖాన్(74) శనివారం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జామిన్ హుస్సేన్ ఖాన్ వారాణాసిలో ఆయన స్వగృహంలో శనివారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు, కుమారుడు అఫక్ హైదర్ ఉన్నారు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ షెహనాయ్ పరంపరను అఫక్ కొనసాగిస్తాడని కుటుంబసభ్యులు చెప్పారు.


పంచాయితీ తెగలే.. పైసలు రాలే

(మొదటి పేజీ తరువాయి)

ధ్రువపత్రాలు ఇచ్చేదిలేదని కాలేజీల యాజమాన్యాలు భీష్మించుకు కూర్చున్నాయి. ఫలితంగా అన్ని అర్హతలూ ఉండి కూడా ధ్రువపత్రాలు లేకపోవడంతో కొలువులు పొందలేకపోతున్నారు. ఉన్నత చదువులకూ దూరమవుతున్నారు. కష్టపడి చదివించినప్పటికీ తమ పిల్లలు ఉద్యోగాలు పొందలేకపోతు న్నారని తల్లిదండ్రులు తల్లడిల్లుతు న్నారు. చదువులు పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ఏంచేయాలో తెలియక విద్యార్థులు మనోవేదనకు గురవుతు న్నారు. తెలంగాణలో పుట్టి ఆంధ్రలో చదివిన వారితోపాటు తెలంగాణలో పుట్టి తెలంగాణలో చదివినవారికి కూడా రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదలకాలేదు.

2013-14నాటికి బకాయిలు(58:42ప్రకారం రూ. కోట్లలో)

	ఏపీ	తెలంగాణ
ఎస్సీ	59.01	42.73
ఎస్టీ	15.27	11.06
బీసీ	97.19	70.38
మైనారిటీ	15.43	11.17
ఇతరులు	21.22	15.37





ఇక్కడ చదివినా విద్యార్థులకూ ఇక్కట్లే..

హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో పెద్దపల్లి జిల్లాకు చెందిన కరన్‌కుమార్ 2013-15లో ఎంబీఏ పూర్తి చేశాడు. సదరు విద్యార్థి సర్టిఫికెట్ల కోసం రెండేళ్లుగా కాలేజీ, అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. ఈ బాధ కరన్ ఒక్కరిదే కాదు. ఈయనలాంటి లక్షా 18 వేల మంది విద్యార్థులు అనుభవిస్తున్న మనో వ్యథ. తెలంగాణలో పుట్టి ఆంధ్రలో చదివిన వారి విషయంలో పాటించిన వైఖరే తెలంగాణలో పుట్టి తెలంగాణలో చదివిన విద్యార్థుల విషయంలో పాటించడం దారుణమని విద్యార్థులు ఎంత మొత్తుకున్నా వినేవారు కరువయ్యారు. తెలంగాణ ప్రభుత్వం 2 జూన్, 2014 తేదీన 2013-14కు చెందిన రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకుండా లాక్ చేసింది. స్వరాష్ట్రంలో చదివిన విద్యార్థుల విషయంలోనైనా ఈ లాక్ ఎత్తేసి, బకాయిలు విడుదల చేయాలని సంక్షేమ శాఖలు తెలంగాణ ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించాయి. అయినప్పటికీ ప్రభుత్వ స్పందన కరువైంది. ప్రభుత్వం ఇస్తామంటున్న రూ.150.73 కోట్లలో రూ.130 కోట్లు ఇచ్చినా తెలంగాణలో పుట్టి తెలంగాణలో చదివిన విద్యార్థుల రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ నిధులు చెల్లించొచ్చు అని అధికారులు, విద్యార్థి సంఘాలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాలేదని విద్యార్థి సంఘాల నేతలు వాపోతున్నారు.

58:42 జగడం..

రాష్ట్ర విభజన నాటికి రూ.358.88 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయి. ఇందులో ఏపీ 58శాతం చెల్లించాలని, మేము 42శాతం మాత్రమే చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టింది. మా విద్యార్థులతో పాటు ఇక్కడ చదివిన తెలంగాణ విద్యార్థులకు కూడా రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. అట్లాగే తెలంగాణ విద్యార్థులతోపాటు అక్కడ చదివిన ఏపీ విద్యార్థులకూ తెలంగాణ ప్రభుత్వం చెల్లించాలని మెలిక పెట్టింది. ఆంధ్రలో చదివిన తెలంగాణ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు కారణం. ఏపీలో చదివిన వారికి సంబంధించి రూ. 110.21కోట్లు, తెలంగాణలో చదివిన వారికి సంబంధించి రూ.248.67 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కేవలం రూ.150.73 కోట్లు(42శాతం) మాత్రమే చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం చెబుతూ వచ్చింది. ఆ గొడవ ఎటూతేలక రాష్ట్రం ఏర్పడిననాటికి ఉన్న రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలను రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు నిలిపివేశాయి. ఆ తర్వాత విద్యాసంవత్సరం నుంచి ఏ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు ఆ రాష్ట్రం రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లిస్తోంది.



సర్టిఫికేట్లు ఇవ్వని కాలేజీలు..

రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల అయ్యేవరకూ సర్టిఫికేట్లు ఇచ్చేదిలేదని కాలేజీల యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. ఇదేమని అడిగితే, సర్టిఫికెట్లు ఇచ్చేశాక ప్రభుత్వాలు తమను పట్టించుకోవని, విద్యార్థులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి చేయరంటున్నాయి. ధ్రువపత్రాలు కావాలంటే ఫీజు మొత్తం కట్టేసి తీసుకువెళ్లాలని తెగేసి చెబుతున్నాయి. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ విడుదల చేశాక డబ్బులు వాపస్ ఇస్తామని విద్యార్థులకు ఉచిత సలహాలు కూడా ఇస్తున్నాయి. రీయింబర్స్‌మెంట్ రానప్పటికీ విద్యార్థుల ధ్రువపత్రాలు ఆపే అధికారం కాలేజీలకు లేదని ఏఐసీటీఈ దక్షిణ మధ్య ప్రాంతీయ అధికారి సుందరేశన్ తెలిపారు. విద్యార్థులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సర్టిఫికెట్లు ఇప్పించడంతోపాటు, కాలేజీపై చర్యలు కూడా తీసుకుంటామని ఆయన చెప్పారు.

లక్షన్నర కోట్ల బడ్జెట్‌లో రూ.368 కోట్లు పెద్ద లెక్కకాదు

ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. లక్షన్నర కోట్లకుపైగా బడ్జెట్ పెడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు రూ.368 కోట్లు పెద్ద లెక్కకాదు. బడుగు, బలహీన, మైనారిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం పెద్ద బారం కాదు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చర్చించి సమస్యను పరిష్కరించుకోవచ్చు. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఇకనైనా ప్రభుత్వాలు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

-పోలెబోయిన శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

దిక్కున్న చోట చెప్పకోమంటున్నారు

నేను హైదరాబాద్‌లోని ప్రియదర్శిని కాలేజీలో 2013-15లో ఎంబీఏ పూర్తిచేశాను. ద్వితీయ సంవత్సరం రీయింబర్స్‌మెంట్ వచ్చింది. మొదటి సంవత్సరం (2013-14) రీయింబర్స్‌మెంట్ నేటికీ రాలేదు. మూడేళ్లుగా బీసీ వెల్ఫేర్ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనంలేదు. ప్రభుత్వమే లాక్ పెట్టింది, మేము ఏమీ చేయలేమని అధికారులు చెబుతున్నారు. రీయింబర్స్‌మెంట్ వచ్చేదాక సర్టిఫికెట్లు ఇవ్వబోమని కాలేజీ స్పష్టం చేసింది. ఇదేందని అడిగితే, అదంతే, దిక్కున్న చోట చెప్పుకోమంటున్నారు. ఏ కంపెనీకి ఇంటర్వ్యూకి వెళ్లినా, ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపిం చాలంటున్నారు. కాలేజీ యాజమాన్యానికి ఇదే విషయం చెబితే, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కి సమానంగా డబ్బులు చెల్లించి తీసుకెళ్లు, రీయింబర్స్‌మెంట్ వస్తే డబ్బులు వాపస్ చేస్తామంటున్నారు. అంతేసి డబ్బులు కట్టలేకే కదా, రీయింబర్స్‌మెంట్‌పైన ఆధారపడింది? ఇప్పటికైనా నిధులు విడుదల చేసి ప్రభుత్వం ఆదుకోవాలి.

-కూన ప్రభాకర్, కరీంనగర్

వామ్మో.. ప్రై 'వేటు' వైద్యం



- **బ్రతికితే ఇంటికి.. లేకుంటే కాటికి**
- **ఆపరేషన్ల పేరిట అంతులేని దోపిడి**
- **లింగనిర్ధారణ పరీక్షలు, ఆపై ఆబార్షన్లు!**
- **శస్త్ర చికిత్సలు.. కడుపుకోతలు**
- **నిబంధనలకు తూట్లు .. పేషంట్లకు పోట్లు**

కరీంనగర్, ఫిబ్రవరి 10(మనం బ్యూరో): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆసుపత్రికి వెళ్లాలంటే జనం బెంబేలెత్తిపోతున్నారు. వైద్యం కోసం వెళ్లిన మహిళా పేషెంట్‌పై ఆసుపత్రి సిబ్బందే అమర్యాదగా ప్రవర్తించడం, నిండు గర్భిణీపై వైద్యం వికటించి తనువు చాలించిన గర్భిణీ వంటి ఘటనలతో ఇక్కడి ప్రజలు అనారోగ్యమంటే వణికిపోతున్నారు. కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో గతంలో లింగ నిర్ధాణ పరీక్షలు నిర్వహించినట్లు బయటకు పొక్కినా.. మామూళ్ల మత్తులో ఉన్న అధికారులు రాత్రికి రాత్రే ఆ విషయాన్ని నొక్కిపెట్టారు. పలు ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జ్యోతిష్యం, ముహూర్తం పేరుతో గర్భిణీ స్త్రీల కడుపు కోతల వైద్యం వికటించి, గత వారం రోజుల్లో నలుగురు గర్భిణీలు ప్రయివేటు ఆస్పత్రుల్లోనే తనువు చాలించారు. ఇదేంటని సదరు ప్రయివేటు ఆస్పత్రుల ముందు ధర్నాలు చేపడితే రాజకీయ పలుకుబడితో వారి నోళ్లు మూయిస్తున్నారు.

సగం దవాఖానాలకు అనుమతుల్లేవు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 300లకు పైగా ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో సగానికి సగం ప్రయివేటు ఆస్పత్రులకు అనుమతులే లేవు. వైద్యాధికారులతో చేతులు కలిపిన ఆసుపత్రుల యాజమానులు దర్జాగా వీటిని నిర్వహిస్తున్నారు. అందుకే ఇలాంటి ఆసుపత్రులపై ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేసిన సంఘటనలు జరగలేదు. ప్రైవేటు ఆస్పత్రులలో ప్రసవించేందుకు వస్తున్న గర్భిణీలకు సిజేరియన్ ఆపరేషన్లతో వీటిని వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారు. ఇక ఇక్కడికి వైద్యం కోసం వచ్చినవారు అడ్వాన్సుగా వేలల్లో చెల్లిస్తేగానీ చికిత్స మొదలు కాదన్నది బహిరంగ రహస్యమే. అయినా ఇవేమీ పట్టనట్టు వైద్యాధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఆసుపత్రుల యాజమాన్యాలు చెలరేగిపోతూ, రోగులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. సదరు ప్రయివేటు ఆస్పత్రుల నిర్వాహకులు, వైద్యులు స్వయంగా మెడికల్ షాపులు, వైద్య పరీక్ష నిర్వహణ కేంద్రాలు కొనసాగిస్తూ, వచ్చిన రోగులందరికీ రోగ నిర్ధారణ పరీక్షల పేరుతో దోచేస్తున్నారు.

ప్రతి సృష్టి!

- ల్యాబ్‌లో మానవ అండాల సృష్టి
- అండాశయ కణజాలాలే మూలం
- ఎలుకలపై ప్రయోగం విజయవంతం

(మనం సెంట్రల్ డెస్క్)


మనం సండే స్పెషల్





అండాశయ కణజాలాల నుంచి కృత్రిమంగా మానవ అండాలను ప్రయోగ శాలలో తయారుచేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ముందుగా ఎలుకలపై చేసిన ప్రయోగాల్లో పూర్తిస్థాయిలో ఈ తరహా అండాలను రూపొందించి, బుల్లి ఎలుకలను కూడా పుట్టించారు. మానవ అండాలను కూడా ఇప్పటికే సిద్ధం చేసినా.. వాటిపై మరింతగా ప్రయోగాలు జరగాల్సి ఉంది. అది పూర్తయితే ఇక ప్రపంచంలో సంతానరాహిత్యం అనే సమస్య ఎప్పటికీ ఉండదు. నిజానికి ఇప్పటికే టెస్ట్‌ట్యూబ్ బేబీల ప్రక్రియ ఉన్నా.. అందులో ఆరోగ్యకరమైన అండాల సేకరణ అనేదే అతిపెద్ద సమస్యగా ఉండేది. అలా సేకరించిన తర్వాత వేగంగా ఉండే శుక్రకణాలతో వాటిని పరీక్షనాళికల్లో ఫలదీకరించేవారు. ఆరోగ్యకరమైన అండాల ఉత్పత్తి లేనివారికి ఇదే పెద్ద సమస్య అవుతుంది. సరిగ్గా ఈ విషయంలోనే శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించి.. పాక్షిక విజయం కూడా సాధించారు. ఈ పరిశోధనలు మాలిక్యులర్ హ్యూమన్ రీప్రొడక్షన్ అనే పత్రిక తాజా సంచికలో ప్రచురితమయ్యాయి. బ్రిటన్, అమెరికాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలలో పాల్గొన్నారు.

ప్రయోగాలలో భాగంగా ముందుగా ఎలుకల అండాలను ప్రయోగశాలలో వాళ్లు తయారుచేశారు. వాటి నుంచి పూర్తిస్థాయి ఎలుకలను కూడా పుట్టించారు. ఆ తర్వాతి దశలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిన మానవ అండాలను కూడా సిద్ధం చేశారు. ఎడిన్‌బర్గ్, న్యూయార్క్‌లోని సెంటర్ ఫర్ హ్యూమన్ రీప్రొడక్షన్‌లలో గల రెండ పరిశోధక ఆస్పత్రులలో ప్రపంచంలోనే తొలిసారిగా మానవ శరీరం వెలుపల.. మానవ అండాలను సిద్ధం చేశారు. అవి పూర్తిస్థాయి అండాలుగా కూడా ఎదగడం విశేషం. వీటి సాయంతో ఇక సంతాన సాఫల్య చికిత్సల తీరు పూర్తిగా మారిపోతుందని పరిశోధనలకు సహ నేతృత్వం వహించిన ఎవెలిన్ టెల్ఫర్ చెప్పారు. ఇప్పుడు అండం ఆరోగ్యకరంగా అభివృద్ధి చెందేందుకు కావల్సిన పరిస్థితులపై దృష్టిపెట్టామని, ఆ తర్వాతి కాలంలో శుక్రకణాలతో వీటిని ఫలదీకరణ చెందించడమే మిగిలి ఉంటుందని వివరించారు. ఈ పరిశోధనలపై శాస్త్రవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అదే సమయంలో.. ఫలదీకరణ అంశాన్ని కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాలని హెచ్చరిస్తున్నారు. అతి తక్కువ కాలంలోనే ఈ దశ కూడా సాధ్యం అవుతుందని లండన్ ఇంపీరియల్ కాలేజీకి చెందిన ఎండోక్రినాలజీ సీనియర్ క్లినికల్ లెక్చరర్ అలీ అబారా తెలిపారు. ప్రస్తుతానికి ఈ పరిశోధనలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని.. వీటిని మరింత సురక్షితంగా కొనసాగించి, ఫలదీకరణ సమయంలో కూడా అవి సాధారణ స్థితిలోనే ఉండేలా చూసుకోవడం ముఖ్యమని తెలిపారు. సాధారణంగా ఈ అండాలు చాలా సున్నితంగా ఉంటాయి. అవి పెరిగే వాతావరణం చాలా ముఖ్యం. అందుకే ఇప్పటికి 30 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నా, ప్రయోగాలన్నీ విఫలం అవుతూ వచ్చాయి. ఇపుడు ముందుగా జంతువుల మీద చేసిన ప్రయగాలు సఫలం అవుతుండటంతో.. అండాశయ కణజాలాలు విస్తారంగా అందుబాటులో ఉంటే మరింత ఆరోగ్యవంతమైన, సఫలం కాగల అండాల ఉత్పత్తి సాధ్యం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం అండాలు ఎలా అభివృద్ధి చెందుతాయనే అంశం మీదే శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. ఇది విజయవంతం అయితే.. తర్వాతి దశలో ఫలదీకరణం విషయం చూసి.. ఇక పూర్తిగా కృత్రిమ మనిషిని సృష్టించే అవకాశం ఉండొచ్చు. ఇప్పటివరకు సినిమాల్లో చూసినవి.. కథల్లో చదివినవి ఇక మీదట వాస్తవాలుగా మన కళ్లముందే సాక్షాత్కరించే అవకాశమూ లేకపోలేదు.



హైదరాబాద్‌లో ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం జరిగిన శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవంలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు. చిత్రంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.



ఆర్మీ క్యాంపుపై ఉగ్రదాడి

- నలుగురు జైషే ముష్కరుల చొరబాటు
- ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టిన సైనికులు
- ఇద్దరు జవాన్ల మృతి.. ఆరుగురికి గాయాలు
- సైనికుల మృతిపై కశ్మీర్ సీఎం సంతాపం
- పాక్ తీరు మారకపోతే యుద్ధమే: ఫరూక్



జమ్ము, ఫిబ్రవరి 10: కశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు దాడికి దిగారు. సుంజ్వాన్‌లోని ఆర్మీ క్యాంపులో నలుగురు జైషే మహ్మద్ ముష్కరులు చొరబడి కాల్పులకు దిగారు. ఈ దాడిలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఓ జవాను కుమార్తెసహా ఆరుగురు గాయపడ్డారు. రంగంలోకి దిగిన సైనికులు ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. శనివారం తెల్లవారుజామున 4.55 ప్రాంతంలో క్యాంపు వద్ద ఉగ్రవాదుల కదలికలను భద్రతా సిబ్బంది గుర్తించా రు. ఆ సమయంలో క్యాంపు వద్ద పహారాలో ఉన్న సెంట్రీపై కాల్పులు జరిపి లోపలికి చొరబడే ప్రయత్నం చేశారు. తక్షణం అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ముష్కరులపై కాల్పులకు దిగడంతో వారు పక్కనే ఉన్న ఆర్మీ కుటుంబ సభ్యుల క్వార్టర్స్‌లోకి దూరారు. దీంతో జమ్ము కశ్మీర్ పోలీసులు, సైన్యం రంగంలోకి దిగి క్వార్టర్స్‌ను జల్లెడ పడుతున్నారు. క్వార్టర్స్‌లో పిల్లలు, మహిళలు ఉండడంతో సైనికులు ఎంతో అప్రమత్తతతో ఆపరేషన్ సాగిస్తున్నారు. క్రమంగా బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో సైనికుల కుటుంబసభ్యులను వెనుక ద్వారం గుండా తరలించే ప్రయత్నిస్తున్నారు. నలుగురు లేదా ఐదుగురు ఉగ్రవాదులు క్వార్టర్స్‌లోకి చొరబడి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఉగ్రవాదులపై కాల్పులకు దిగిన సైనికులు ముగ్గురిని హతమార్చారు. వారు ఆర్మీ క్యాంపు వెనుక ఉన్న డ్రైనేజీ ద్వారా లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అనుమానం రాకుండా ఉండేందుకు ఉగ్ర వాదులు సైనికుల దుస్తుల్లో వచ్చినట్లు తెలుస్తోంది. ఈ దాడి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా క్యాంపునకు దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలోని అన్ని పాఠశాలలను మూసి వేయాలని అధికారులు ఆదేశించారు. 2013 ఫిబ్రవరి 9 అఫ్జల్ గురును ఉరి తీసిన నేపథ్యంలో అతడి వర్ధంతి సందర్భంగా జైషే ఉగ్రవాదులు దాడికి పాల్పడే అవకాశాలున్నాయని నిఘా వర్గాలు ఆర్మీని ముందే హెచ్చరించాయి. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ జమ్ముకశ్మీర్ డీజీపీ వైద్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ము కశ్మీర్‌లో భద్రతను మరింత పెంచాలన్నారు. సైనికుల ఆపరేషన్ కొనసాగుతున్నందున నిరంతరం కేంద్ర హోంశాఖ సమీక్షిస్తుం టుందని ట్వీట్ చేశారు. కాగా, ఈ దాడిలో మరణించిన జవాన్లకు జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అసెంబ్లీలో సంతాపం తెలిపారు. ఈ ఘటనలో సుబేదార్ మదన్‌లాల్ చౌదరి, సుబేదార్ మొహమ్మద్ అష్రఫ్ మిర్ అమరులయ్యారని సభా వ్యవహారాల మంత్రి అబ్దుల్ రెహ్మాన్ వీరి వెల్లడించారు. అలాగే కల్నల్ ర్యాంకు అధికారి, హవల్దార్ అబ్దుల్ హమీద్, లాన్స్ నాయక్ బహదూర్ సింగ్, సుబేదార్ మదన్‌లాల్ కుమార్తె, మరో ఇద్దరు పిల్లలు గాయపడ్డారన్నారు.

పాక్ జిందాబాద్ అన్న ఎన్‌సీ ఎమ్మెల్యే



ఈ దాడి నేపథ్యంలో అసెంబ్లీలో పలు పార్టీలు పాక్ వ్యతిరేక నినాదాలు చేశాయి. బీజేపీ, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), సీపీఎం, కాంగ్రెస్ సభ్యులు ఈ దాడిని ఖండించారు. ఈ సమయంలో ఎన్‌సీ సీనియర్ ఎమ్మెల్యే మహ్మద్ అక్బర్ లోన్ పాక్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినదించారు. దీంతో ఒక్కసారిగా సభ వాతావరణం వేడెక్కింది. బీజేపీ సహా ఇతర పార్టీలు ఆయన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అంతా ఎన్‌సీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో సభ స్తంభించిపోయింది. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. కాగా, అక్బర్ లోన్ వ్యాఖ్యలను ఎన్‌సీ పార్టీ ఖండించింది. ఈ తరహా వ్యాఖ్యలు తగవని పార్టీ ప్రతినిధి జునైద్ అజీమ్ మట్టూ హెచ్చరించారు. ఎన్‌సీ దేశ విభజనను వ్యతిరేకించిన పార్టీ అని గుర్తించాలని సూచించారు. కాగా, శనివారం సాయంత్రం సీఎం మెహబూబా ముఫ్తీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.



పాక్‌తో యుద్ధం తప్పదు: ఫరూక్ అబ్దుల్లా

ఆర్మీ క్యాంపుపై ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో ఎన్‌సీ అధ్యక్షుడు, జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా స్పందించారు. సీమాంతర ఉగ్రవాదానికి పాక్ ముగింపు పలకకపోతే యుద్ధాన్ని ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులు భారత్‌పై దాడి చేయని రోజంటూ లేదని మండిపడ్డారు. భారత్‌తో పాకిస్థాన్ శాంతిని కోరుకుంటుంటే ఉగ్ర మార్గాన్ని విడనాడాలని సూచించారు. లేనిపక్షంలో పాక్‌పై యుద్ధానికి దిగడం తప్ప భారత్ వద్ద మరో మార్గం లేదని హెచ్చరించారు. యుద్ధం వల్ల రెండు దేశాలకూ నష్టమేనని, పాక్ ఉగ్రవాదాన్ని తుదముట్టించి శాంతి చర్చలకు రావాలని సూచించారు.



బేస్ క్యాంపుల్లో భద్రత కట్టుదిట్టం

- ఏర్పాట్ల కోసం 1,487 కోట్లు
- నిధులు జారీ చేసిన ప్రభుత్వం
- పది నెలల్లో పూర్తికావాలి: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: జమ్ము కశ్మీర్ సహా దేశ సరిహద్దుల వెంబడి రక్షణను మరింత కట్టుదిట్టం చేసే చర్యల కోసం రూ.1,487 కోట్ల నిధులను కేంద్రం మంజూరుచేసింది. ఆయా ప్రాంతాల్లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లను పటిష్ట పరిచి, భద్రతాపరమైన లోపాలను అధిగమించేందుకు ఈ నిధులను వెచ్చించాలని సూచించింది. వాస్తవాధీన రేఖ వెంబడి కాల్పుల ఘటనలు చోటుచేసుకోవడం, విధుల్లో ఉన్న సైనికులు ప్రాణాలు కోల్పోవడం తదితర ఘటనల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కాగా, అవసరమైన భద్రతా ఏర్పాట్లు పది నెలలలోగా పూర్తవ్వాలని రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సైన్యాన్ని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తూ ఉండాలని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌కు సూచించారు. ఇటీవలి కాలంలో పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘించడం, వాస్తవాధీన రేఖ వెంబడి ఉగ్రవాద చొరబాటు యత్నాలు తదితర ఘటనలను ఎదుర్కొనే క్రమంలో పలువురు భారత సైనికులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే! సరిహద్దులకు సమీపంలో ఉన్న బేస్ క్యాంపులు లక్ష్యంగా దాడులు జరుగుతుండడంతో వాటిని మరింత పటిష్ఠ పరచాలని, భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తాజా ప్రకటన నేపథ్యంలో ఆర్మీ బేస్ క్యాంపుల ఆధునికీకరించి భద్రతను పెంచే చర్యలు తీసుకోనున్నారు. 2016లో పఠాన్‌కోట్ ఎయిర్‌ఫోర్స్ బేస్ క్యాంప్‌పై ఉగ్రదాడి తర్వాత ఆర్మీ బేస్ క్యాంప్‌ల భద్రతలో డొల్లతనం బయటపడింది. ఈ లోపాలను సరిదిద్దుకుని, మరోసారి ఉగ్రదాడులకు అవకాశమివ్వని రీతిలో పటిష్ఠపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా దాడి ఘటన, భద్రతా లోపాలపై ఓ కమిటీని నియమించింది. బేస్ క్యాంపుల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన అనంతరం లెఫ్టినెంట్ జనరల్ ఫిలిప్ కాంపోజ్ నేతృత్వంలోని ఈ కమిటీ పలు సూచనలు చేసింది. ఇందులో దశల వారీగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నది ప్రధానమైన సూచన.. ఇలా బేస్ క్యాంపుల వద్ద కనీసం మూడు దశల భద్రత కల్పించాలని కమిటీ పేర్కొంది. సెక్యూరిటీ ఆడిట్ తర్వాత మొత్తం మూడు వేలకు పైగా సున్నితమైన క్యాంపులతో పాటు మరో ఆరు వందల అత్యంత సున్నితమైన క్యాంపులను కమిటీ గుర్తించింది. ఈ క్యాంపుల వద్ద ఏర్పాట్లను మరింత పెంపొందించాలని ప్రభుత్వానికి సూచించింది. మరోవైపు బేస్ క్యాంపులపై దాడి యత్నాల నేపథ్యంలో త్రివిధ దళాలకూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక అధికారాలను కట్టబెట్టింది. సరిహద్దుల వెంబడి భద్రతా ఏర్పట్లను పటిష్ఠ పరిచే విషయంలో సైన్యానికి స్వేచ్ఛ కల్పించాలని ప్రభుత్వానికి సూచించింది.

టూజీ.. ఎస్పెస్పీగా ఏఎస్జీ

- స్పెక్ట్రం కుంభకోణం తీర్పుపై అప్పీల్
- సీబీఐ.. ఈడీలకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: టూజీ స్పెక్ట్రం కుంభకోణం కేసును సీబీఐ ప్రత్యేక కోర్టు కొట్టేసిన నేపథ్యంలో ఆ తీర్పును సవాలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ కేసులో టెలికం శాఖ మాజీమంత్రి ఎ.రాజా, డీఎంకే ఎంపీ కనిమొళిసహా నిందితులందరికీ ప్రత్యేక కోర్టు విముక్తి ప్రసాదించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కేంద్ర పరిశోధన సంస్థ (సీబీఐ) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లకు అనుమతి ఇచ్చింది. దీంతోపాటు అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) తుషార్ మెహతాను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎస్పెస్పీ)గా నియమిస్తూ అధికార ప్రకటన జారీచేసింది. ఈ నెల 19లోగా అప్పీలు దాఖలు చేయాల్సినందున ప్రస్తుత ఎస్పెస్పీ ఆనంద్ గ్రోవర్‌నుంచి మెహతా త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారు. కాగా, 2008 నుంచి గుజరాత్ అదనపు అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన మెహతా- కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక 2014 జూన్‌లో ఏఎస్జీగా నియమితులయ్యారు.

చెట్టపట్టాలతో చక్కని స్నేహం

పాలస్తీనా-ఇజ్రాయెల్ సహజీవనం చేయాలి.. అధ్యక్షుడు అబ్బాస్.. ప్రధాని మోదీ ఆకాంక్ష

- భారత్‌తో 6 ఒప్పందాలు.. సంతకాలు పూర్తి
- రూ.193 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



రమల్లా, ఫిబ్రవరి 10: తూర్పు జెరూసలెం తమ భవిష్యత్ రాజధానిగా ఇజ్రాయెల్‌తో చెట్టపట్టాలేసుకుని, రెండు దేశాలూ శాంతియుత సహజీవనం చేయడమే తమ స్వప్నమని పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ఆకాంక్షించారు. ఈ దిశగా 1967నాటి అంతర్జాతీయ తీర్మానాల పరిధిలో చర్చలకు సంసిద్ధత వ్యక్తంచేశారు. దీనికి అనుగుణంగా బహుళపక్ష యంత్రాంగం ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. భారత-పాలస్తీనా సంబంధాలు కాలపరీక్షను తట్టుకుని నిలిచాయని, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి నెలకొనాలని తాము కూడా ఆశిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాలుసహా ఇతరత్రా అంశాలపై చర్చలు... ఆరు ఒప్పందాలపై సంతకాలు ముగిశాక దేశాధినేతలిద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోదీతో ఫలవంతమైన, నిర్మాణాత్మక చర్చలు సాగాయని అబ్బాస్ పేర్కొన్నారు. మొత్తం 50 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాల్లో విద్యారంగానికి సంబంధించినవి మూడున్నాయి.

అనేక సవాళ్లను ఎదుర్కొనడంలో పాలస్తీనా ప్రజలు ఎనలేని ధైర్యసాహసాలు ప్రదర్శించారని మోదీ పేర్కొన్నారు. పాలస్తీనా ప్రగతి పయనానికి భారత్ సదా మద్దతిస్తుందని హామీ ఇచ్చారు. చర్చలతోనే శాశ్వత పరిష్కారం సాధ్యమని స్పష్టం చేశారు. సౌహార్ద దౌత్యం, దూరదృష్టి ప్రదర్శించడం ద్వారానే హింస, గతకాలపు చేదు జ్ఞాపకాల నుంచి విముక్తి సాధ్యమన్నారు. ఇదంతా సులభ సాధ్యమేమీ కాదన్నది వాస్తవమే అయినా నిరంతర ప్రయత్నం మాత్రం ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్‌తో తమ శాంతి ప్రక్రియ విషయంలో అంతర్జాతీయ వేదికలమీద భారత్ ఎంతో గొప్ప పాత్ర పోషించిందని అబ్బాస్ కొనియాడారు. ''మీ చారిత్రక పర్యటన నేపథ్యంలో అత్యంత గొప్ప అతిథిగా మిమ్మల్ని ఆహ్వానించడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. పాలస్తీనా శాంతి కోసం భారత్ సదా మద్దతిస్తూనే ఉండటం ఆ దేశ నాయకత్వంతోపాటు ప్రజలు కూడా మాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు నిదర్శనం'' అని ప్రశంసలు కురిపించారు. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుకు ప్రధాని మోదీ చేసిన కృషికి గుర్తింపుగా విదేశీ దేశాధినేతలకు ప్రకటించే అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా'తో అబ్బాస్ ఆయనను సత్కరించారు. దీనిపై ప్రధాని కృతజ్ఞతలు తెలుపుతూ- ''ఈ పురస్కారం రెండు దేశాల మధ్య స్నేహబంధానికి నిదర్శనం మాత్రమేగాక భారత్‌కు ఎంతో గర్వకారణం'' అన్నారు.

ప్రగతి పయనానికి సదా మా మద్దతు

రమల్లాలో ఘన స్వాగతం

అంతకుముందు పాలస్తీనాలో చరిత్రాత్మక పర్యటనను మోదీ శనివారం ప్రారంభించారు. ఢిల్లీ నుంచి శుక్రవారం జోర్డాన్ వెళ్లిన ఆయన, రాత్రి అక్కడే బసచేసి శనివారం సైనిక హెలికాప్టర్‌లో రమల్లా నగరం చేరుకున్నారు. ఈ హెలికాప్టర్‌కు ఇజ్రాయెల్ వాయుసేన హెలికాప్టర్లు రక్షణగా రావడం గమనార్హం. ఇక తమ దేశంలో అధికార పర్యటనకు వచ్చిన తొలి భారత ప్రధాని మోదీకి పాలస్తీనా ప్రధానమంత్రి రమీ హమదల్లా ఘనస్వాగతం పలికారు. అటుపైన కీర్తిశేషుడైన పాలస్తీనా దిగ్గజ నేత యాసిర్ అరాఫత్ సమాధి వద్దకు వెళ్లిన మోదీ, అక్కడ పుష్పగుచ్ఛాన్నుంచి ఆయనకు నివాళి అర్పించారు. అలాగే అదే ప్రాంగణంలోని అరాఫత్ మ్యూజియంను సందర్శించి అధ్యక్ష భవనానికి చేరుకున్నారు. ఆ ప్రాంగణంలో అధ్యక్షుడు అబ్బాస్ ఆప్యాయ ఆలింగనంతో మోదీకి సౌహార్ద స్వాగతం పలికారు. సైనిక వందనం తర్వాత రెండు దేశాల జాతీయ గీతాలాపన అనంతరం వారిద్దరూ అధికార చర్చల్లో పాల్గొన్నారు. అధ్యక్ష భవనం వద్ద మోదీకి స్వాగతం పలికినవారిలో కేథలిక్ చర్చి ఆర్చిబిషప్ పౌలస్ మార్కుజో, అల్-అక్సా మసీదు ఆధ్యాత్మిక నాయకులు కూడా ఉన్నారు. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతల దిశగా భారత్ చిరకాల మద్దతుకు మోదీ పర్యటన నిదర్శనమని అబ్బాస్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ నిరుడు ఇజ్రాయెల్‌లో తొలిసారి పర్యటించినపుడు పాలస్తీనా వెళ్లలేదు. దీంతో భారత పాలస్తీనా సంబంధాలపై విశ్లేషకులు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే, పాలస్తీనా సందర్శన కోసం ప్రధాని మోదీ ఇజ్రాయెల్ మీదుగా కాక జోర్డాన్ నుంచి రావడంద్వారా రెండు దేశాలతో సమాన సంబంధాలపై స్పష్టమైన సందేశం పంపారు.

కేంద్రం ఓ భయంకరమైన రోగి



- డాక్టర్ మాట కూడా వినడం లేదు
- ఎన్‌డీఏ ప్రజల రక్తం పీల్చేస్తోంది
- కొత్త ప్రభుత్వంతోనే సమస్య పరిష్కారం
- కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్యలు


కొచ్చి, ఫిబ్రవరి 10: ప్రజల రక్తం పీల్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపొందించిందని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. కొత్త ప్రభుత్వంతోనే దేశ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు. పదేళ్ల యూపీఏ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ భయంకరమైన వైద్యుడు చేతిలో ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ శుక్రవారం రాజ్యసభలో చేసిన వ్యాఖ్యకు చిదంబరం ఘాటుగా బదులిచ్చారు. బీజేపీ హయాంలోని కేంద్ర ప్రభుత్వం ఓ భయంకరమైన రోగి అని, మంచి వైద్యుడు చెప్పే మాటలు వినే శక్తి, సామర్థ్యాలు కూడా లేవని అన్నారు. బీజేపీ పాలనలో వైద్య, విద్య, వ్యవసాయం, ఉపాధి రంగాలు వృద్ధి చెందలేదన్నారు. భారీ పథకాలు, భారీ ప్రకటనలు తప్ప ప్రధాన సమస్యలపై ఎన్‌డీఏ దృష్టి సారించలేదని చిదంబరం ఆరోపించారు. పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ ప్రభుత్వం ప్రజల రక్తాన్ని పీలుస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్- భారత ఆర్థిక వ్యవస్థ అంశంపై కొచ్చిలోని రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ నిర్వహించిన సదస్సులో చిదంబరం ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డీఏ హయాంలో భారత ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందని అన్నారు. అంతేకాక కేంద్ర ప్రభుత్వం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీకి 'జుమ్లా(జిమ్మిక్) అనే కొత్త పదాన్ని అందించిందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితిపై మాట్లాడేందుకు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, ఎకనమిక్ సర్వే పుస్తక రచయిత డాక్టర్ అరవింద్ సుబ్రమణియన్‌కు స్వేచ్ఛ ఇస్తే, రోగి పరిస్థితి బాగా ఆందోళనకరంగా ఉందని, మాట వినడం లేదు సరికదా చికిత్స కూడా తీసుకోవడం లేదని చెబుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం వైద్యుడు మాట వినని ఓ భయంకరమైన రోగి అని చిదంబరం అన్నారు. కాంగ్రెస్ నేత మాటల ప్రకారం చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అరవింద్ సుబ్రమణియన్ మంచి వైద్యుడు, బీజేపీ ప్రభుత్వం భయంకరమైన రోగి. వైద్యుడు మంచి వాడైతే రోగి ఎలాంటి వాడైనా రోగం నయం చేయవచ్చని కేంద్ర మంత్రి జైట్లీ శుక్రవారం రాజ్యసభలో అన్నారు. అంతేకాక పదేళ్ల యూపీఏ ప్రభుత్వాన్ని భయంకరమైన వైద్యుడుతో పోల్చారు. వైద్యుడు సరైన వాడు కాకపోతే కోలుకుంటున్న రోగులు కూడా చనిపోతారని అన్నారు. యూపీఏ పాలన కంటే బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఎన్నో విధాల మేలు అని జైట్లీ అన్నారు. అయితే, యూపీఏ పాలనలో క్రూడాయిల్ బ్యారెల్ ధర 147 డాలర్లుకు చేరింద ని, ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అది 40 డాలర్లకు పడిపోయిందని, ఆ తర్వాత అంతకంటే తక్కువ ధరకు కూడా చేరిందని చిదంబరం అన్నారు. యూపీఏ హయాంలో క్రూడాయిల్ ధర వంద డాలర్లు కంటే తక్కువ పలికిన రోజు తనకు గుర్తే లేదని, ఎన్‌డీఏ ప్రభుత్వం నక్క తోక తొక్కిందని, రెండున్నరేళ్లుగా క్రూ డాయిల్ ధర 40 డాలర్లు దాటడం లేదన్నారు. అయితే జైట్లీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల క్రూడాయిల్ ధరలు పెరిగే అవకాశం ఉందని, ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపనుం దన్నారు. ద్రవ్యోల్బణాన్ని ప్రభావితం చేసే ఏకైక కమొడిటీ క్రూడాయిల్ అని, అందువల్ల క్రూడాయిల్ బ్యారెల్ ధరను 60 నుంచి 65 డాలర్లుగా తీసుకుని బడ్జెట్‌ను రూపొందిస్తారన్నారు. అయితే క్రూడాయిల్ ధరలపై తాను పార్లమెంట్‌లో జైట్లీని ప్రశ్నించానని, ఆయన బదులు ఇవ్వలేదని చిదంబరం చెప్పారు. ఒకవేళ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి, క్రూడాయిల్ ధరలు కూడా పెరిగితే మీరు ఎం చేస్తారు, ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేసుకుని పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తారా అని అడిగితే ఇప్పటి వరకు బదులే లేదన్నారు. ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని మార్చడానికి మార్గం ఏంటిని ప్రశ్నించగా, కొత్త ప్రభుత్వమే అని చిదంబరం బదులిచ్చారు.

ఆర్థిక వ్యవస్థ దిగజారుతోంది

తమ ప్రభుత్వ హయాంలో వృద్ధి రేటు సంతృప్తికరంగా ఉందని ఎన్‌డీఏ ప్రభుత్వం చేసిన ప్రకటన పట్ల కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత వృద్ధి రేటు యూపీఏ ప్రభుత్వంలో పదేళ్ల సగటు కంటే తక్కువ అని, దేశ ఆర్థిక వ్యవస్థ నానాటికి దిగజారిపోతుందని చిదంబరం పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఆయన కొన్ని ట్వీట్‌లు చేశారు. గత 30ఏళ్ల సగటుతో పోలిస్తే ప్రస్తుతం భారతదేశ వృద్ధి రేటు చాలా తక్కువుగా ఉందని ప్రపంచబ్యాంకు మాజీ ప్రధా న ఆర్థికవేత్త కౌశిక్ బసు పేర్కొన్నారని, కానీ ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వృద్ధి రేటు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు.

అమ్మాయిలు కూడా బీర్లు తాగేస్తున్నారు


- గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్



పణజి, ఫిబ్రవరి 10: మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇటీవల అమ్మాయిలు కూడా మద్యం తీసుకుంటున్నారని, అది ఆందోళన కలిగించే విషయమని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ అన్నారు. గోవా ప్రభుత్వ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన యూత్ పార్లమెంట్‌లో పారికర్ మాట్లాడారు. అమ్మాయిలు బీర్లు తాగడం ప్రారంభించారని, మోతాదుకు మించి తీసుకుంటున్నారని, వాళ్లను చూస్తే భయమేస్తుందని అన్నారు. తాను అమ్మాయిలందరినీ ఉద్దేశించి మాట్లాడడం లేదని, సభలో ఉన్నవారి గురించి కూడా కాదని పారికర్ అన్నారు. గోవాలో డ్రగ్స్ సరఫరా వ్యవస్థను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డ్రగ్స్ మాఫియా అంతమయ్యే వరకు దాడులు జరుగుతాయని వెల్లడించారు. కళాశాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం లేదన్నారు. డ్రగ్స్ మాఫియాపై చర్యలు ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకు 170 మందిని పోలీసులు అరెస్టు చేశారన్నారు. నిరుద్యోగం అంశంపై మాట్లాడిన పారికర్ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర యువత కష్టపడేందుకు ఇష్టపడడం లేదన్నారు. ఓ ప్రభుత్వ శాఖలో కింది స్థాయి క్లర్క్ ఉద్యోగం కోసం పెద్ద క్యూ లైన్లు కనిపిస్తున్నాయని, యువత కష్టపడేందుకు సిద్ధంగా లేదనేందుకు ఇదే నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే పని ఏమి ఉండదనే భావన ప్రజల్లో ఉందని మనోహర్ పారికర్ అన్నారు.

అలగాజనమంతా గోవా వస్తున్నారు

- ఆ రాష్ట్ర మంత్రి విజయ్ సర్దేశాయ్



పణజి, ఫిబ్రవరి 10: గోవా తీర సందర్శనకు వచ్చే వారిలో ఇతర రాష్ట్రాల వారే అధికంగా ఉంటారని, వారంతా అలగాజనమని, ఉత్తరాదికి చెందిన పర్యాటకులు గోవాను హరియాణాగా మార్చాలని చూస్తున్నారని ఆ రాష్ట్ర పట్టణ, ప్రణాళిక శాఖ మంత్రి విజయ్ సర్దేశాయ్ అన్నారు. పణజిలోని ఓ రిసార్టులో నిర్వహించిన గోవా బిజ్ ఫెస్ట్‌లో ఆయన మాట్లాడారు. గోవా అధికంగా ఉత్తరాది పర్యాటకులపైనే ఆధారపడిందని, వారు చాలా బాధ్యతారహితంగా ఉంటారని, గోవా గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గోవాలో హరియాణాను సృష్టించాలనుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర జనాభా కన్నా ఆరు రెట్ల మంది పర్యాటకులు గోవాకు వస్తున్నారని, వారంతా ఉన్నస్థాయికి చెందిన వారు కాదన్నారు. బాధ్యత రాహిత్యంతో వ్యవహరించే పర్యాటకులను నియంత్రించడం కష్టమన్నారు. తలసరి ఆదాయం, సాంఘిక, రాజకీయ చైతన్యం, ఆరోగ్యం వంటి అనేక రంగాల్లో గోవా ప్రజలు దేశంలో మిగిలిన ప్రాంతాల ప్రజల కంటే ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నారన్నారు.

ఔరంగజేబు ఓ ఉగ్రవాది: ఎంపీ గిరి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: 'ఔరంగజేబు ఓ ఉగ్రవాది.. నిజానికి ఆయన చేష్టలకు తగినంత శిక్షను అనుభవించలేదు. ఆయన సోదరుడు దారా షికో మాత్రం మేధావి' అని ఢిల్లీ ఎంపీ మహేష్ గిరి పేర్కొన్నారు. ఈమేరకు ఔరంగజేబు అండ్ దారా షికో: ఏ టేల్ ఆఫ్ టూ బ్రదర్స్ పేరుతో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపీ ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారంలోకి రావడానికి, పాలనలోనూ ఔరంగజేబు ఎంతో దారుణంగా వ్యవహరించేవాడు. అలాంటి వ్యక్తి పేరును దేశ రాజధానిలో ఓ రోడ్డుకు పెట్టడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ పేరును మార్చి మాజీ రాష్ట్రపతి, దివంగత శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం రోడ్‌గా వ్యవహరించడం అదృష్టమేనని తెలిపారు.




• నాగచైతన్య, సమంత

పెళ్ళి తర్వాత కూడా..

నాగచైతన్య, సమంత జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సినిమాల్లోనే కాదు రియల్ లైఫ్‌లోనూ ఈ ఇద్దరు క్యూట్ కపుల్‌గా పేరు తెచ్చుకున్నారు. అయితే 'ఆటోనగర్ సూర్య' తరువాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఒక్క సినిమా కూడా రాలేదు. పెళ్లి తరువాత మళ్లీ ఈ ఇద్దరూ కలిసి నటిస్తే బావుంటుందని వారి అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓ వార్త ఫిలింనగర్‌లో జోరుగా వినిపిస్తోంది. అదేంటంటే ఈ జోడీ మరోసారి స్క్రీన్ మీద కనిపించబోతోందట. 'నిన్నుకోరి' సినిమాతో అందరినీ మెప్పించిన శివ నిర్వాణ.. తన తదుపరి సినిమాను చైతూతో తీయాలనుకుంటున్నాడు. ఇందులో హీరోయిన్‌గా సమంతను అడగగా.. ఆమె వెంటనే ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రాన్ని 'నిన్నుకోరి' నిర్మాతలు కోనవెంకట్, దానయ్య నిర్మించనున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే చై-సామ్ అభిమానులకు నిజంగా శుభవార్తే.


• రకుల్ ప్రీత్‌సింగ్

ఆరడుగుల బుల్లెట్ కోసం..!

తన అందం, అభినయంతో అందరి హృదయాలను దోచుకునే హీరోయిన్ పెళ్ళి చేసుకోబోతోందంటే అది ఆసక్తికరమైన వార్తే. తాను పెళ్ళాడబోయే అబ్బాయి ఇలా ఉండాలి... అలా ఉండాలి అంటూ ఎన్నో క్వాలిఫికేషన్స్ చెప్తుంటారు హీరోయిన్లు. దానికి తను కూడా అతీతం కాదంటోంది రకుల్ ప్రీత్‌సింగ్. ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో.. తనను పెళ్లి చేసుకోబోయే వాడు ఆరడుగుల ఎత్తు ఉండాలని చెప్పింది. ప్రస్తుతం అలాంటి వరుడి కోసం ఎదురు చూస్తోందట రకుల్. తన హైట్ 5.9 అడుగులనీ, అందుకే కనీసం ఆరడుగుల మగాడు తనకు భర్తగా రావాలని కోరుకుంటున్నానని చెప్పింది. అంతే కాదు అలాంటి వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నానని తెలిపింది. మరి ఈ అందాల భామను పెళ్లాడే ఆ ఆరడుగుల బుల్లెట్ ఎవరో తెలియాలంటే వేచి చూడాల్సిందే.

రానా నిర్మాణంలో!

అఖిల్ హీరోగా నటించిన 'హలో' చిత్రం విడుదలైన తర్వాత జనవరి 10న తను చేయబోయే కొత్త సినిమాల వివరాలు తెలియజేస్తానని చెప్పారు. అయితే అతని కొత్త సినిమా గురించిన ఎలాంటి వార్త వెలువడలేదు. అఖిల్ నెక్స్‌ట్ సినిమా సుకుమార్ లేదా సత్యప్రభాస్ పినిశెట్టి దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అయితే ఇంతవరకు ఎవరూ కన్‌ఫర్మ్ అవ్వలేదు. అయితే అఖిల్ నెక్స్‌ట్ సినిమాకి సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయన్నది వాస్తవం. ఇక్కడ మరో విశేషమేమిటంటే అఖిల్ తదుపరి రెండు సినిమాలను హీరో రానా దగ్గుబాటి నిర్మించనున్నారు. కథ, దర్శకుడు ఓకే అయిన వెంటనే ఈ సినిమాలు ప్రారంభమవుతాయి.


• అఖిల్

ధనుష్ హాలీవుడ్ సినిమా టీజర్



హీరో ధనుష్ హాలీవుడ్ సినిమా 'ది ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ది ఫకీర్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించిన టీజర్ ఇటీవల విడుదలైంది. దీనితోపాటు దర్శకుడు కెన్ స్కాట్ బైట్‌ని కూడా విడుదల చేశారు. దీన్ని ధనుష్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఈ చిత్రంలో అజాతశత్రు లావాష్ పటేల్ పాత్రలో నటిస్తున్నారు ధనుష్. ముంబయ్‌కి చెందిన ఓ కుర్రాడు కొన్ని కారణాల వల్ల ప్రపంచ యాత్రకు వెళ్ళాల్సి వస్తుంది. ఈ ప్రయాణంలో జరిగే ఘటనలు, అతను చేసే సాహసాలు, ఓ ప్రేమకథ.. ఇవన్నీ సినిమాలో ఉంటాయి. ఎమోషనల్ కామెడీ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించినట్టు దర్శకుడు తెలిపారు. ధనుష్ సరసన బెరనైస్ బెజో, అలెగ్జాండ్రా దడారియోలతో నటించారు. రొమైన్ ప్యూర్తొలా రాసిన 'ద ఎక్స్‌ట్రార్డినరీ జర్నీ ఆఫ్ ద ఫకీర్ హూ గాట్ ట్రాప్డ్ ఇన్ యాన్ ఐకియా వార్డ్‌రోబ్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి వివిధ దేశాలకు చెందిన టెక్నీషియన్స్ పని చేశారు. మే 30న ఇంగ్లీష్‌తోపాటు ఫ్రెంచ్ భాషలోనూ ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.



అమితాబ్‌కు అస్వస్థత

బాలీవుడ్ హీరో అమితాబ్ బచ్చన్ అనారోగ్యం పాలయ్యారు. శుక్రవారం సాయంత్రం ముంబయ్‌లోని లీలావతి హాస్పిటల్‌లో చేర్పించారు. గత కొంతకాలంగా ఆయన జీర్ణాశయ సమస్యలతోపాటు మెడ, వెన్నెముక నొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో వెన్నెముక కింది భాగంలో నొప్పిగా ఎక్కువ కావటంతో ఆయన ఆసుపత్రిలో చేరినట్టు సమాచారం. ''లుంబార్' (నడుము కింది భాగం) ప్రాంతంలో నొప్పిగా ఉన్నట్టు అమితాబ్ చెప్పారు. కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చి ఆపై డిశ్చార్జ్ చేశాం'' అని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. అమితాబ్ ప్రస్తుతం '102 నాటౌట్' అనే చిత్రంలో నటిస్తున్నారు. దాదాపు 27 ఏళ్ల తర్వాత మరో సీనియర్ నటుడు రిషికపూర్‌తో ఆయన స్క్రీన్ పంచుకున్నారు. ఇందులో రిషి అమితాబ్‌కు కొడుకు పాత్రలో కనిపించబోతున్నారు. ఉమేష్ శుక్లా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఓ గుజరాతీ నాటిక ఆధారంగా రూపొందుతోంది. మే నెలలో '102 నాటౌట్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



డూప్ లేకుండా నికీషా ఫైట్స్!

పవన్ కళ్యాణ్ పులి సినిమాతో పరిచయమైన బ్యూటీ నికీషా పటేల్. అలరించే అందం.. ఆకట్టుకునే అభినయం నికీషా సొంతం. అయితే కెరీర్ అనుకున్నంత వేగంగా సాగలేదు. మధ్యలో కొన్ని సినిమాల్లో అలరించిన నికీషా ఇప్పుడు ఓ లేడీ ఓరియంటెడ్ మూవీతో రాబోతోంది. ఈ సినిమాలో నికీషా పోలీస్ ఆఫీసర్‌గా పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తుంది. అందుకు తగ్గట్టుగానే సినిమా టైటిల్ కూడా 'రాడీపోలీస్' అని పెట్టారు. ఈ చిత్రంలో చాలా పవర్ ఫుల్‌గా ఉంటుందని చెబుతున్నారు మేకర్స్. 'రాడీపోలీస్'లో ముకుల్‌దేవ్ విలన్‌గా నటిస్తున్నాడు. మరో కీలక పాత్రలో సీనియర్ హీరో భానుచందర్ నటిస్తుండటం విశేషం. సినిమా కథను బట్టి యాక్షన్ ఎపిసోడ్స్‌కు చాలా స్కోప్ ఉంటుంది. రిస్కీగా సాగే రోప్ యాక్షన్ సీన్స్ కూడా ఉంటాయట. వాటిని ఎలాంటి డూప్ లేకుండా అత్యంత రియలిస్టిక్‌గా చేసింది హీరోయిన్ నికీషా. ఆల్రెడీ నికీషా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకుంది. పైగా తను రియల్ బాక్సర్ కూడా. కాబట్టి ఈ యాక్షన్ సీక్వెన్స్ అన్నీ చాలా ఈజీగా చేసేసింది. అంతేకాదు, ఇకపైనా ఇలాంటి యాక్షన్ ఓరియంటెడ్ సినిమాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని చెబుతోంది. జానీ దర్శకత్వంలో ఆర్.ఎ. ప్రొడక్షన్స్ పతతాకంపై వేణు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేస్తామని దర్శకనిర్మాతలు చెబుతున్నారు.

జ్ఞాపకాల జల్లు తొలిప్రేమ



ప్రేమ ఎప్పుడూ నిత్యనూతనమే. అలాంటి ప్రేమను నేపథ్యంగా తీసుకుని ఎన్ని సినిమాలు తెరకెక్కినా.. తాము రూపొందించే ప్రేమ కథలో ఏదో ఓ కొత్త కోణాన్ని చూపే ప్రయత్నం చేస్తుంటారు యువ దర్శకులు. వెంకి అట్లూరి కూడా అలాంటి ప్రయత్నమే చేశారు 'తొలిప్రేమ'తో. వరుణ్ తేజ్, రాశి ఖన్నా జంటగా నటించిన ఈ చిత్రం.. మూడు దశలలో సాగే ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా తెరకెక్కింది. శనివారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రంపై 'మనం' అందిస్తున్న సమీక్ష మీ కోసం..

చిత్రం: తొలిప్రేమ
తారాగణం: వరుణ్ తేజ్, రాశి ఖన్నా, సుహాసిని, విద్యుల్లేఖ రామన్, సప్న పబ్బి, ప్రియదర్శి, హైపర్ ఆది తదితరులు
ఛాయాగ్రహణం: జార్జ్ సి.విలియమ్స్
సంగీతం: తమన్
కూర్పు: నవీన్ నూలి
నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్
రచన-దర్శకత్వం: వెంకి అట్లూరి
విడుదల తేది: ఫిబ్రవరి 10, 2018

కథాంశం

రైలు ప్రయాణంలో పరిచయమైన వర్ష (రాశి ఖన్నా)ని తొలి చూపులోనే ప్రేమిస్తాడు ఆదిత్య (వరుణ్ తేజ్). తనకు ఏదనిపిస్తే అది చెప్పేసే ఆది.. తను ప్రేమిస్తున్న విషయాన్ని కూడా వెంటనే వర్షతో చెప్పేస్తాడు. ప్రతి విషయాన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకునే వర్ష.. ఆదికి వెంటనే ఏ విషయం చెప్పదు. తరువాత రోజు ఇద్దరూ విడిపోతారు. కట్ చేస్తే.. మళ్ళీ మూడు నెలల తరువాత ఒకే కాలేజీలో చేరతారు ఆది, వర్ష. ఆ సమయంలో.. వర్షకి తన ప్రేమని మరోసారి వ్యక్తం చేస్తాడు. కొన్ని రోజుల తరువాత వర్ష కూడా తన ప్రేమని ఓ అనూహ్య పరిస్థితిలో కాలేజ్‌మేట్స్ మధ్య వ్యక్తం చేస్తుంది. అంతా బాగుందన్న సమయంలో.. ఇద్దరి మధ్య గొడవ తలెత్తుతుంది. దాంతో బ్రేకప్ చెప్పుకుంటారు. మళ్ళీ ఆరేళ్ళ తరువాత లండన్‌లో కలుస్తారు. వర్ష దగ్గరవ్వాలనుకున్నా.. ఆది మాత్రం ఆమెపై ప్రతి సందర్భంలోనూ కోపం వ్యక్తం చేస్తూనే ఉంటాడు. చివరికి వీరిద్దరు మళ్ళీ ఒక్కటయ్యారా? లేదా? అనేదే ఈ చిత్ర కథ.

విశ్లేషణ

'తొలిప్రేమ'.. మూడు దశల్లో సాగే అందమైన ప్రేమకథా చిత్రమిది. తొలి రెండు దశల మధ్య ఉండే తక్కువ గ్యాప్‌ను మినహాయించి చూస్తే.. 'ఎటో వెళ్ళిపోయింది మనసు', 'మళ్ళీ రావా' తరహాలో ఇది కూడా ఒకే జంట మధ్య మూడు దశల్లో సాగే ప్రేమకథ. విచిత్రమైన పరిస్థితుల మధ్య కలుసుకోవడం, విడిపోవడం.. మళ్ళీ దగ్గరవ్వడం.. ఇలానే ఉంటాయి 'తొలిప్రేమ'లో ప్రేమికుల మధ్య పరిస్థితులన్నీ. పరిస్థితులే విలన్ అన్నట్లుగా సాగే ఈ ప్రేమకథా చిత్రాన్ని.. దర్శకుడు వెంకి అట్లూరి యువతరానికి కనెక్ట్ అయ్యేలా చక్కగా తెరకెక్కించారు. అయితే తొలి పది నిమిషాలు భారంగా సాగుతాయి. ఆ తరువాత కథనం క్రమంగా పుంజుకుంటుంది. ద్వితీయార్థంలో కొన్ని సన్నివేశాలు సాగదీసినట్లుగా ఉన్నా ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ సీన్స్ కట్టిపడేస్తాయి. ఆదికి రాఖీ కట్టమని సీనియర్స్ వర్షని బలవంతపెట్టినప్పుడు.. 'ఆదికి తప్ప ప్రతి ఒక్కరికీ రాఖీ కడతాను' అంటూ ఆదితో నేరుగా ప్రేమను వ్యక్తం చేసే సన్నివేశం, అలాగే నరేష్‌తో కులం గురించి ఆది మాట్లాడే సన్నివేశం.. అదే సందర్భంలో వర్ష పిల్లల ప్రేమ గురించి చెప్పే మాటలు, ప్రీ క్లైమాక్స్ సన్నివేశాల్లో ఆది, అతని తల్లి (సుహాసిని) మధ్య సాగే సన్నివేశం, పతాక సన్నివేశం.. ఇలా కొన్ని సన్నివేశాల్ని ఆకట్టుకునేలా తెరకెక్కించారు దర్శకుడు. అలాగే విద్యుల్లేఖా రామన్‌ను అక్క అంటూ వరుణ్ పిలిచే సీన్స్ ఫన్నీగా ఉంటాయి. ఓవరాల్‌గా.. 'తొలిప్రేమ'ని ఈ తరంకి కనెక్ట్ అయ్యేలా బాగానే డీల్ చేశారు దర్శకుడు.

నటీనటుల విషయానికి వస్తే.. వరుణ్ తేజ్‌లోని నటుడిని మరో మెట్టు ఎక్కించిన చిత్రమిది. ఇగో ఎక్కువగా ఉండే ఈ పాత్రలో వరుణ్ ఒదిగిపోయారు. అలాగే ప్రేమ సన్నివేశాల్లోనూ రాణించారు. లుక్స్ వైజ్.. లండన్ సీన్స్‌లో వరుణ్ ఇంప్రెసివ్‌గా ఉన్నారు. ఇక రాశి విషయానికి వస్తే.. ఇది ఆమె కెరీర్ బెస్ట్ పెర్‌ఫార్మెన్స్ అనే చెప్పాలి. 'ఊహలు గుసగుసలాడే' తరువాత ఆమెకి దక్కిన మరో మంచి పాత్ర ఇది. ప్రతి ఫ్రేమ్‌లోనూ అందంగా కనిపించడమే కాకుండా.. తన నటనతో మెప్పించింది. వరుణ్‌తో ఐలవ్‌యూ చెప్పే సన్నివేశంలోనూ, నరేష్‌తో పిల్లల ప్రేమ గురించి మాట్లాడే సన్నివేశంలోనూ ఆమె నటన గుర్తుండిపోతుంది. ఓ విధంగా చెప్పాలంటే.. ఈ సినిమాకి రాశి ఓ సర్‌ప్రైజ్ ప్యాక్ అనే చెప్పాలి. అలాగే కులం పిచ్చి ఉన్న వ్యక్తి పాత్రలో నరేష్ నటన బాగుంది. హీరో తల్లిగా సుహాసిని పాత్ర పరిధి తక్కువే అయినా.. పతాక సన్నివేశాల్లో తన ఉనికిని చాటుకున్నారు. హీరో ఫ్రెండ్ రవిగా ప్రియదర్శి, సెకండాఫ్‌లో వచ్చే హైపర్ ఆది, అలాగే విద్యుల్లేఖా రామన్ నవ్వులు పంచారు. మిగిలినవారు పరిధి మేర ఓకే అనిపించుకున్నారు.

సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ప్రేమకథలకు సంగీతమే సగం బలం. ఆ విషయంలో తమన్ పనితనం మెప్పిస్తుంది. తమన్ సంగీత సారథ్యంలోని పాటలన్నీ బాగున్నాయి. అలాగే నేపథ్య సంగీతం కూడా బాగా కుదిరింది. జార్జ్ సి.విలియమ్స్ ఫొటోగ్రఫీ సినిమాని మరోస్థాయికి తీసుకెళ్ళింది. ప్రతి ఫ్రేమ్‌నూ అందంగా చూపించారాయన. ఎడిటింగ్ మరింత క్రిస్పీగా ఉండాల్సింది. మాటల్లో 'కలగా నా జీవితంలోకి వచ్చావ్. కలగంటున్నప్పుడు వెళ్ళిపోయావ్.. మళ్ళీ ఇలా మెరిసావ్. కలో నిజమో అర్థం కావడం లేదు', 'జ్ఞాపకాలు చెడ్డవైనా, మంచివైనా ఎప్పటికీ మనతోటే ఉంటాయి... మోయక తప్పదు', 'దేవుడికే కాస్ట్ లేదు.. ఆఫ్టాల్ మనుషులం మనకెందుకు', 'ప్రేమలో తప్పు ఉంటే విడిపోవడంలో అర్థముంది.. గొడవలో తప్పు ఉంటే విడిపోవడంలో అర్థం లేదు', 'తాను తన ప్రేమని దాచుకుంది.. కోపాన్ని దాచుకుంది', 'మీరు ఎన్ని ఇచ్చినా.. ఇవ్వనిదే గుర్తుంటుంది పిల్లలకి', 'ప్రేమించుకున్న వాళ్ళు విడిపోతే ఆ ఇద్దరే ఏడుస్తారు.. పెళ్ళిచేసుకున్నాక ఆ ఇద్దరూ విడిపోతే కుటుంబాలు ఏడవాలి', 'నీకు ప్రేమ, కోపం రెండూ ఎక్కువే.. కోపం వల్ల ఆ అమ్మాయిని దగ్గరకు రానివ్వడం లేదు, ప్రేమ వల్ల ఇంకే అమ్మాయిని దగ్గరకు రానివ్వడం లేదు', 'మన జీవితంలోకి ఎందరు అమ్మాయిలు వచ్చినా.. మొదట ప్రేమించిన అమ్మాయే గుర్తుండిపోతుంది' వంటి డైలాగులు బాగున్నాయి. నిర్మాణ విలువలకి ఎక్కడా వంక పెట్టలేం.

రేటింగ్: 3.25/5

చివరగా: జ్ఞాపకాల జల్లు 'తొలిప్రేమ'

విశాఖలో కోటి శివలింగాల ప్రతిష్ఠ

- శివరాత్రి సందర్భంగా మహా కుంభాభిషేకం
- సత్యనారాయణకు స్వర్ణకంకణ ఘన సన్మానం
- 'విశ్వనట సామ్రాట్' ప్రదానం: టీఎస్ఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 10: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా విశాఖపట్నం సముద్రతీరాన కోటి శివలింగాలను ప్రతిష్ఠించి, మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీ టి.సుబ్బరామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంగీత, సాహిత్య, నృత్య, నాటక, సృజనాత్మక కళల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణకు 'స్వర్ణకంకణ ఘనసన్మానం' చేసి విశ్వనట సామ్రాట్ బిరుదును ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సుబ్బరామిరెడ్డి, మంత్రి గంటా శ్రీనివాసరావు, బాలకృష్ణ, మోహన్‌బాబు, మురళీ మోహన్, బ్రహ్మానందం, పరుచూరి వెంకటేశ్వరరావు, గౌతమితో పాటు కిల్లి కృపారాణి, ద్రోణంరాజు శ్రీనివాస్, ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారు. కాగా 26 సంవత్సరాలుగా విశాఖ తీరంలో సుబ్బరామిరెడ్డి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


ఆశాభోంస్లేకు యశ్‌చోప్రా అవార్డు
ఈ నెల 16న ముంబైలో ప్రదానం

ప్రముఖ గాయని ఆశాభోంస్లేకు యశ్‌చోప్రా స్మారక జాతీయ అవార్డు దక్కింది. ఈ నెల 16న ముంబైలో జరిగే ఓ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. బాలీవుడ్ దర్శకుడు యశ్ చోప్రా జ్ఞాపకార్థం 2014లో ఆయన ఈ అవార్డును నెలకొల్పారు. భారత చలనచిత్ర రంగంలో ప్రతిభావంతులైనవారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. 2014లో లతామంగేష్కర్‌కు, 2015లో అమితాబ్ బచ్చన్‌కు, 2016లో రేఖకు, 2017లో షారుక్‌ఖాన్‌కు ఈ అవార్డును బహూకరించారు. ఈ ఏడాది ఆశాభోంస్లేకు ఇవ్వాలని జ్యూరీ కమిటీ నిర్ణయించింది. కమిటీలో పమేలా చోప్రా, టి.సుబ్బరామిరెడ్డి, బోనీకపూర్, పద్మినీ కొల్హాపురి, మధుర్ బండార్కర్, హనీ ఇరానీ, అల్కాయాగ్నిక్, అనూ రంజన్, శశి రంజన్ ఉన్నారు. ముంబైలో సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రేఖ



స్వర్ణకంకణాన్ని బహూకరిస్తారు. ఈ కార్యక్రమానికి మోహన్‌బాబు, శత్రుఘ్న సిన్హా, జయప్రద, సుభాష్ ఘాయ్, పమేలా చోప్రా, వీడియోకాన్ అధినేత వీఎన్ దూత్ తదితరులు హాజరవుతారు.





థ్యాంక్యూ చెల్లెమ్మా!

- కవితకు ట్విటర్‌లో పవన్ కృతజ్ఞతలు
- ఏపీకి మద్దతు తెలిపిన టీఆర్ఎస్ ఎంపీ
- అందుకు జనసేనాని ధన్యవాదాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): పార్లమెంటు వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మద్దతు తెలిపిన టీఆర్ఎస్ ఎంపీ కవితకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. కవితకు ధన్యవాదాలు చెబుతూ ఆయన ట్వీట్ చేశారు. ''రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఏపీకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లోక్‌సభ లో మద్దతు తెలిపిన టీఆర్ఎస్ ఎంపీ, చెల్లెలు కవితకు హృదయ పూర్వక కృతజ్ఞతలు'' అంటూ పవన్ ట్వీట్ చేశారు. విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో ఏపీ ఎంపీలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. లోక్‌సభలో కవిత మాట్లాడు తూ.. ఏపీ ఎంపీల పోరాటానికి మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమె కేంద్రాన్ని కోరారు.

నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలి

విభజన హామీలపై సంయుక్త నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆర్థిక వేత్తలు, ప్రభుత్వ మాజీ అధికారులు, విద్యావేత్తలు, సామాజిక, రాజకీయ నేతలతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అంతేగాక కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదం నెలకొన్న అంశాలపై విస్తృతంగా చర్చించాలని పవన్ ట్వీట్ చేశారు.

దళితుల అభివృద్ధే చంద్రబాబు ఆశయం


- వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి: కేఈ



ఉండ్రాజవరం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్): అగ్రవర్ణాలతో సమానంగా దళితులు సామాజిక, ఆర్థిక పురోగతిని సాధించి, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయమని ఉప ముఖ్యమంత్రి కె.ఇ.కృష్ణమూర్తి అన్నారు. ఈ ఆశయంతోనే దళితతేజం కార్యక్రమానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరం దగ్గరలోని వేలివెన్ను గ్రామంలో ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషరావుతో కలసి కేఈ.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలు మంజూరు చేసి, వారి అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. దళితుల సంక్షేమం కోసం నిత్యం సరికొత్త ఆలోచనలో కృషి చేస్తున్న చంద్రబాబు అభినందనీయులని కొనియాడారు. గత పాలకుల వల్ల దళితుల జీవితాలు అదోగతి పాలయ్యాయని విమర్శించారు. తమ పాలన పట్ల దళితులు సంతృప్తిగా ఉన్నారన్నారు. దళితవాడల అభివృద్ధికోసం చంద్రబాబు కంకణం కట్టుకున్నారని కేఈ చెప్పారు.

రాష్ట్రంలో అందరికీ సొంత ఇళ్లు

- 2019 నాటికి 19 లక్షల ఇళ్ల నిర్మాణం: కాల్వ



కాకినాడ, ఫిబ్రవరి 10 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సొంత ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా ఇళ్లు లేని వారి కోసం 20.97 లక్షల గృహ నిర్మాణానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 2019 నాటికి 19 లక్షల ఇళ్లను నిర్మించడానికి బృహత్తర ప్రణాళికను అమలుచేస్తున్నామని అయన పేర్కొన్నారు. 2014 నాటికి మంజూరై అసంపూర్తిగా మిగిలిన ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగా ఇప్పటి వరకు 4.28 లక్షల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు. గతేడాది అక్టోబరు 2న లక్ష ఇళ్లలో సాముహిక గృహ ప్రవేశాలు చేపట్టామని గుర్తు చేశారు. మరో ఒక లక్ష 50 వేల గృహప్రవేశాలు త్వరలోనే చేపట్టనున్నట్లు మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. అంతకుముందు బిక్కవోలు మండలం పందలపాకలో ఒక కోటి 95 లక్షల రూపాయలతో చేపట్టనున్న 124 ఎన్టీఆర్ గృహ నిర్మాణం సముదాయానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇదే గ్రామంలో 500 మందికి స్థల పట్టాలు అందించామన్నారు.

తెర మీదకు రామాయపట్నం



- ముగిసిన అధ్యాయం దుగరాజుపట్నం
- సాధ్యం కాదని తేల్చి చెప్పిన అరుణ్ జైట్లీ
- అంతర్జాతీయ కన్సల్టెన్సీలదీ అదే మాట
- ప్రభుత్వం చొరవచూపితే వచ్చే అవకాశం


అమరావతి, ఫిబ్రవరి 10 (మనం ప్రతినిధి): మొన్న అంతర్జాతీయ కన్సల్టెన్సీలు ఎర్నెస్ట్ అండ్ యంగ్, ఎ.ఇ. కామ్, నిన్న నీతి ఆయోగ్.. నేడు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ.. దుగరాజుపట్నంలో పోర్టు నిర్మాణం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. రక్షణపరమైన ఇబ్బందుల దృష్ట్యా దుగరాజుపట్నంలో పోర్టు సాధ్యం కాదని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని, మరో ప్రత్యామ్నాయం సూచిస్తే పోర్టుకు నిధులు కేటాయిస్తామని టీడీపీ ఎంపీలకు జైట్లీ స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా దుగరాజుపట్నానికి సమీపంలోనే శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఇస్రో)తో పాటు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పులికాట్ సదస్సు ఉంది. అక్కడ పోర్టు నిర్మిస్తే రక్షణపరంగానే కాకుండా పర్యావరణ సమస్యలు ఎదురవుతాయి. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో సహజసిద్ధ అనుకూలతలు ఉన్నట్లు కన్సల్టెన్సీలు తెలిపాయి. నీతిఆయోగ్ కూడా గత ఏడాది ఇదే విషయాన్ని తేల్చి చెప్పింది. దుగరాజుపట్నం రాదని తెలిసినా ప్రజా ప్రతినిధులంతా దానిగురించే ఇప్పటివరకు ప్రస్తావిస్తూ వస్తున్నారు. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో పోర్టు నిర్మించాలని ఆందోళనలు చేస్తున్నా ఎవరికీ పట్టలేదు. 'రామాయపట్నం పోర్టు నిర్మిస్తే కృష్ణపట్నం పోర్టుతో కుదుర్చుకున్న ఒప్పందాలు దెబ్బతింటాయ'ని ప్రభుత్వంలోని ఒక ముఖ్యనేత అన్నట్టు ప్రచారం జరుగుతోంది. పార్టీ మినీ మహానాడులో తీర్మానమైతే చేశారు గానీ, ముఖ్యమంత్రిని కలిసి రామాయపట్నం గురించి అడిగిన దాఖలాలు లేవు. ఇపుడు కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై జరుగుతున్న ఆందోళనలో భాగంగా దుగరాజుపట్నం తెరమీదకు రావటం, అక్కడ పోర్టు సాధ్యం కాదని తాము ఎప్పుడో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామని ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పటం ఇపుడు చర్చనీయాంశమైంది. ప్రత్యామ్నయం సూచిస్తే నిధులు కూడా కేటాయిస్తామని చెప్పటంతో రామాయపట్నాన్ని సాధించుకునే బాధ్యత ఇపుడు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపై పడింది.

'రైట్స్' ఏం చెప్పింది..!?

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమికల్ సర్వీసెస్ (రైట్స్) కూడా రామాయపట్నం పోర్టుకు పచ్చజెండా ఊపింది. రామాయపట్నంలో పోర్టు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే రైట్స్ అధ్యయన బృందంతో సర్వే చేయించింది. 9.71 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉండటం, మడ అడవులు లేకపోవడం, నౌకలు నిలిచి ఉండేందుకు 20 మీటర్ల లోతు వరకు సముద్రం అనుకూలంగా ఉండటం, మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలోనే జాతీయ రహదారులు, రైల్వే లైను ఉండటం రామాయపట్నానికి సాంకేతికంగా, ఆర్థికంగా అనుకూలతలని రైట్స్ చెప్పింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చింది. కేవలం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం వల్లే రామాయపట్నం పోర్టు ఇంతవరకు సాకారం కాలేదన్న అభిప్రాయం నెలకొంది. ఇపుడు దుగరాజుపట్నం కథ కంచికి చేరటంతో రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా రామాయపట్నం పోర్టును సూచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనంతపురం తరువాత రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ప్రకాశం జిల్లాకు రామాయపట్నం రావటం చారిత్రక అవసరం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగులెత్తే అవకాశం ఉన్న రామాయపట్నం పోర్టు ఏర్పాటు కేవలం రాష్ట్ర ప్రభుత్వం చొరవతోనే సాధ్యమవుతుంది.

త్వరలో కార్యాచరణ

రామాయపట్నం పోర్టు సాధన కోసం త్వరలోనే కార్యాచరణను ప్రకటించనున్నట్టు ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరు రంగారావు అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటన నేపథ్యంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 12న సమావేశమై రామాయపట్నం పోర్టు సాధన కోసం కార్యాచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని అధికారపార్టీ ప్రజా ప్రతినిధులు ముఖ్యమంత్రిని ఒప్పించి రామాయపట్నం సాధనలో పాలు పంచుకోవాలని కోరారు. సీఎం సమయం ఇస్తే వేదిక ప్రతినిధులు కూడా కలిసి రామాయపట్నం ఆవశ్యకతను వివరిస్తామని తెలిపారు.



పోర్టు ఎక్కడ?

దుగరాజపట్నమా.. రామాయపట్నమా?

రెండింటిపై అంతర్జాతీయ కన్సల్టెన్సీలతో సర్వే

పోర్టు నిర్మాణంపై చొరవచూపని రాష్ట్ర ప్రభుత్వం

ఇదే అదనుగా.. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

ఇప్పటికే కోస్తా జిల్లాలకు తీవ్రస్థాయిలో అన్యాయం

నీరుగారుతున్న ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం హామీ

2017 డిసెంబరు 30న 'మనం' ప్రచురించిన కథనం

మోదీ నినాదం జియో హింద్

- బీజేపీ పాలనలో ఆర్థిక సంక్షోభం
- పేదలు పేదలుగానే మిగిలిపోయారు
- ఓడినా ప్రభుత్వ ఏర్పాటే ఆ పార్టీ లక్ష్యం
- ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు: ఏచూరి



భీమవరం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ జైహింద్ అంటుంటారని, ఆయన నినాదం జియో హింద్‌గా మారిందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా ఎదగకుండా నాశనం చేసిందని, ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని అన్నారు. మూడున్నర సంవత్సరాలతో ధనికులు బాగా పెరిగారని, పేదలు పేదలుగానే మిగిలిపోయారని అన్నారు. శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిందన్నారు. నోట్ల రద్దు వల్ల చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని, కార్మికులు రోడ్డున పడి దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. దోపిడీ దారి విధానమే బీజేపీ ప్రభుత్వ విధానమని విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వంలో ఎటువంటి కుంభకోణాలు జరగలేదని చెబుతున్నా చాలా వెలుగులోకి వచ్చాయన్నారు. విదేశీ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా బీజేపీ ప్రభుత్వం మేలు చేసిందన్నారు. స్వాతంత్ర్యం తర్వాత దేశంలో ప్రైవేట్ ఆర్మీ వచ్చిందని, గోవులకు ప్రత్యేక రక్షణ దళాలు వచ్చాయని విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని, బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే జరుగుతున్నారయన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని, ఎన్నికల్లో వాగ్దానం మొండి చేయి చూపించారని ఏచూరి మండిపడ్డారు. బడాబాబులకు రెండు లక్షల కోట్లు రాయితీ రూపంలో కట్టబెట్టారన్నారు. ఎన్నికల్లో ఓడినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే బీజేపీ లక్ష్యమని విమర్శించారు. దేశంలో వామపక్షాల ఐక్యత బలపడాలని పిలుపునిచ్చారు. వామపక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు చేస్తామని, బలమైన నాయకత్వం కోసం కృషి చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఏపీలో ఎవరు అభివృద్ధి చెందారో చంద్రబాబు చెప్పాలన్నారు. పేదలకు ఒక ఎకరా కూడా పంచలేదన్నారు. చట్టసభలలో కమ్యూనిస్టులు ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహాసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, పార్టీ తెలంగాణ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పొలిట్‌బ్యూరో సభ్యులు రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, గపూర్ పాల్గొన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు, జిల్లా మాజీ కార్యదర్శి రుద్రరాజు, సత్యనారాయణ రాజు పార్టీ పతావిష్కరణ గావించారు.

చాలా ఇచ్చాం.. ఇస్తాం

- ఏపీ ఎంపీలది ప్రచారం మాత్రమే
- రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడింది
- రెవెన్యూ లోటు రూ. 22,113 కోట్లు
- మొత్తం 14వ ఆర్థిక సంఘం ఇస్తుంది
- బీజేపీ ప్రతినిధి జీవీఎల్.. ఎంపీ హరిబాబు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పట్ల కేంద్రం సవతి ప్రేమ చూపిస్తోందని, నిధులు ఏమాత్రం ఇవ్వడం లేదని.. అవసరమైన దాంట్లో ఆవగింజంత మాత్రమే విదిలిస్తోందంటూ టీడీపీ చేస్తున్న 'ప్రచారాన్ని' బీజేపీ ఖండించింది. కేంద్ర ప్రభుత్వంతో సమస్యలేమైనా ఉంటే వాటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ మేరకు పార్టీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, విశాఖపట్నం ఎంపీ కె. హరిబాబు ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రానికి పలు సంస్థలు, ప్రాజెక్టులు కేటాయించడంతో పాటు నిధులు కూడా ఇచ్చామంటూ ఒక జాబితాను చూపించారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని జీవీఎల్ పేర్కొన్నారు. ఏపీకి చెందిన టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు చేస్తున్నదంతా ప్రచారం మాత్రమేనని ఆయన ఖండించారు. శుక్రవారం జరిగిన సమావేశంలో రెవెన్యూ లోటు, ప్రత్యేక ప్యాకేజి అంశాలు పరిష్కారం అయ్యాయని హరిబాబు చెప్పారు. ప్రతిపాదిత సంస్థలు, ప్రాజెక్టులపై కూడా కేంద్రం నుంచి హామీ వచ్చిందని అన్నారు. 14వ ఆర్థిక సంఘం ఉండే ఐదేళ్ల కాలంలో మొత్తం రూ. 22,113 కోట్ల రెవెన్యూ లోటును ఏపీకి గ్రాంటుగా చెల్లిస్తారని ఆయన తెలిపారు.

లేడీస్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

- ఎంతకీ స్పందించని ఫైర్ సిబ్బంది
- బుగ్గిపాలైన ఆభరణాలు.. సర్టిఫికెట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్ బ్యూరో): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో విశాఖపట్నంలోని ఓ లేడీస్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ఎన్ని సార్లు ఫోన్ చేసినా అగ్నిమాపక సిబ్బంది స్పందించకపోవడంతో ఫర్నీచర్, మహిళల ఆభరణాలు, సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతైపోయాయి. అందులో ఉంటున్న 40 మంది మహిళలు మాత్రం బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. విశాఖలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న సేఫ్ హ్యాండ్స్ లేడీస్ హాస్టల్‌లో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. హాస్టల్‌లో అగ్ని నిరోధక పరికరాలు లేకపోవడంతో అందులో ఉంటున్న 40 మంది మహిళలు ఏమీ చేయలేక బయటకు పరుగులు తీశారు. వారు ఎన్నిసార్లు ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది కోసం మళ్లీ ఫోన్ చేయగా ఎందుకు జరిగింది? ఎలా జరిగింది అని వ్యర్థ ప్రశ్నలతో కాలయాపన చేశారు. ఆలస్యంగా ఫైరింజన్ అక్కడికి చేరుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. హాస్టల్‌లో ఉంటున్న మహిళల వస్తువులు, బంగారు ఆభరణాలు, దుస్తులు, సర్టిఫికెట్లు, ఇతర విలువైన డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోయాయి. అలాగే హాస్టల్ ఫర్నీచర్ కూడా పూర్తిగా దగ్ధమైపోయింది. కాగా, ఈ హాస్టల్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అపార్టుమెంటులోని పెద్ద పెద్ద గదులను చెక్కలతో విభజించి హాస్టల్‌గా ఏర్పాటు చేయడంతో స్వల్ప వ్యవధిలోనే మంటలు వ్యాపించాయి. యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌లో 28 వేల కేసులు పరిష్కారం

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన లోక్ అదాలత్‌లో ఒక్కరోజే ఏకంగా 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో శనివారం లోక్‌అదాలత్‌లను నిర్వహించారు. వాటిలో 28 వేల కేసుల పరిష్కారం ద్వారా రూ.58.4 కోట్ల మేరకు కక్షిదారులకు పరిహార చెల్లింపులు జరిగాయి. తెలంగాణలో 10 వేల కేసులు, ఏపీలో 18 వేల కేసులు పరిష్కారమయ్యాయి. తెలంగాణలో రూ.26 కోట్లు, ఏపీలో రూ.32.4 కోట్ల మేర పరిహారం చెల్లింపులకు కేసుల్లోని ఇరుపక్షాల వారు అంగీకరించారు. ఈ మేరకు ఏపీ/తెలంగాణ రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీల సభ్య కార్యదర్శులు రాంబాబు, మధుసూదన్‌రావు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఇవిగాక హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 500 కేసుల ద్వారా 6.5 కోట్లు పరిహార చెల్లింపులకు ఆమోదం లభించిందని లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలియజేశారు. కేసులు పరిష్కారమైన వాటిలో అత్యధికంగా మోటార్ వెహికల్ యాక్ట్ కింద నమోదైన రోడ్డు ప్రమాదాలకు సంబంధించినవి ఉన్నాయి.

విశాఖ జేసీకి 2 వేల జరిమానా


- హైకోర్టు ఆదేశాల ఉల్లంఘనకు ఫైన్


హైదరాబాద్, ఫిబ్రవరి 10 (మనం లీగల్ ప్రతినిధి): హైకోర్టు ఆదేశాల అమలులో అలసత్వం వహించినందుకు విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు రూ.2 వేల జరిమానా విధించింది. అనకాపల్లి షుగర్ ఫ్యాక్టరీలో పని చేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్న ఆదేశాల్ని అమలు చేయకపోవడంతో జాయింట్ కలెక్టర్‌పై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇచ్చేందుకు స్వయంగా కోర్టుకు రావాలన్న ఆదేశాల్ని అమలు చేయకపోవడంతో జేసీకి రూ.2 వేలు జరిమానా విధించింది. కాగా, మహిళా పారిశ్రామికవేత్తల సమావేశం ఉన్నందున రాలేకపోతున్నట్లు జేసీ లిఖితపూర్వకంగా తెలియజేశారు.


కార్మిక సమస్యలకు పరిష్కారమేదీ?


- కేంద్ర బడ్జెట్‌పై బీఎంఎస్ ఆగ్రహం
- 20న దేశ వ్యాప్త నిరసనకు పిలుపు


విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (మనం న్యూస్ బ్యూరో): కార్మికుల సమస్యలపై గతంలో ఎన్ని సార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా వాటికి తాజా బడ్జెట్‌లో పరిష్కారం చూపకపోవడం దారుణమని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కార్మికులు ఈ నెల 20న ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు సభ్యుడు జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తాము 5 లక్షల మంది కార్మికులతో ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శనతో 44 సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. అప్పట్లో సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రులు బడ్జెట్‌లో వాటిని ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇకనైనా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మరోసారి తమ డిమాండ్లను కేంద్రానికి తెలిపేలా 20న దేశవ్యాప్త నిరసన చేపడుతున్నామని చెప్పారు. అనంతరం 26న అన్ని జిల్లా కేంద్రాలు, ఫ్యాక్టరీ గేట్‌ల వద్ద నిరసనలకు దిగుతామన్నారు. అవసరమైతే 46వ భారతజాతీయ కార్మిక సదస్సును బహిష్కరిస్తామని జగదీశ్వరరావు హెచ్చరించారు.











‘నియంత్రణ సంస్థలు రిస్కులను గుర్తెరిగి వ్యవహరించాలి’

- **మార్కెట్లలో సర్దుబాటు చోటు చేసుకుంటోందన్న ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్**

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ బుడగ ‘‘చాలా ప్రధాన సమస్యగా దారితీయకూడదు’’ అని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. ముమ్ముందు ఎదురు కాగల రిస్కులను మార్కెట్ల నియంత్రణ సంస్థలు గుర్తించవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. దేశీయ, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఇటీవల ఈక్విటీల ధరలు ఘోరంగా పతనమవడం గురించి ఆయన ప్రస్తావించారు. ‘‘అంతర్జాతీయంగానే కాక, ఇండియాలోనూ ఇప్పటికే సర్దుబాటు చోటుచేసుకుంటోంది. క్యాపిటల్ మార్కెట్లు ఎలా దిశ మార్చుకోగలవో ఇది మనకు తెలియజెబుతోంది’’ అని ఉర్జిత్ అన్నారు. ‘‘ఈ బుడగ చాలా ప్రధాన సమస్యగా దారితీయగల సూచనలు ప్రస్తుతానికి ప్రపంచ మార్కెట్లలోకానీ, భారతదేశంలోకానీ, ఇంతవరకు కనిపించలేదు. అయినా, ముమ్ముందు ఎదురు కాగల సమస్యలను ఫైనాన్షియల్ మార్కెట్ నియంత్రణ సంస్థలైన ఆర్.బి.ఐ, భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబి) గుర్తెరగాలి’’ అని ఉర్జిత్ స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్ సమర్పించిన తర్వాత, ఆర్థిక మంత్రి ఆర్.బి.ఐ బోర్డు నుద్దేశించి ప్రసంగించడం ఆనవాయితీ. అలా అరుణ్ జైట్లీ ప్రసంగించిన తర్వాత, ఉర్జిత్ పటేల్ సమాచార సాధనాలవారితో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా మార్కెట్లలో చోటుచేసుకుంటున్న సర్దుబాటుతో మార్కెట్ సూచీలు చాలా వేగంగా కదలగలవనే విషయాన్ని మరోసారి స్పష్టమైపోయిందని అన్నారు. ‘‘ఈ అధిక ఈక్విటీ ధరల చక్రభ్రమణంలో ఓ మంచి సంగతి ఉందని అనుకుంటున్నాను. అదేమిటంటే, ఇందులో భాగస్వామిగా ఉన్న దాదాపు ప్రతి ఒక్కరూ, ఇది ఎక్కువ కాలం కొనసాగకపోవచ్చని, సర్దుబాటుకు అవకాశం ఉందని చెప్పడమే. అది మంచి పరిణామమని అనుకుంటున్నాను. అంతర్గతంగానే రిస్కు పట్ల తగినంత విముఖత ఉంది. మదుపరులే దానిని పెంపొందిస్తూ వచ్చారు’’ అని ఉర్జిత్ అన్నారు. అంతర్జాతీయ ఈక్విటీల ధరలు కుప్పకూలడంతో ఈ వారంలో భారతీయ స్టాక్ మార్కెట్లు కూడా ఒక్క సెషన్‌లో తప్పించి తీవ్ర పతనాన్ని చవి చూశాయి.


గీటురాయిగా భావించే సెన్సెక్స్ శుక్రవారం ఒక శాతం పైగా క్షీణించి, గత నెల రోజుల్లో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయి వద్ద ముగిసింది. సెన్సెక్స్ గురువారం 330 పాయింట్లను మూటగట్టుకోగలిగిందికానీ, అంతకుముందు ఏడు ట్రేడింగ్ సెషన్లలో అది 2,200 పాయింట్లకు పైగా కోల్పోయింది. దేశీయంగాను, అంతర్జాతీయంగాను కూడా కనపడిన ప్రతికూల సంకేతాలే దానికి కారణం. బ్యాంకుల వడ్డీ రేట్ల గురించి అడిగినపుడు, ఒక బ్యాంకు రెండు రోజుల క్రితం మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎం.సి.ఎల్.ఆర్)ను తగ్గించిన సంగతిని ఉర్జిత్ తెలిపారు. ‘‘లబ్ధి బదలీ విషయానికి వస్తే, ద్రవ్య విధాన కమిటీ ప్రారంభించిన సడలింపు చక్రభ్రమణం నుంచి, ఇప్పటి ఎం.సి.ఎల్.ఆర్ వరకు దానిని పోల్చి చూస్తే, వాస్తవానికి బదలీ బాగుందని చెప్పాల్సి ఉంటుంది. వాస్తవంగా, ఏం జరిగిందంటే, ఆ బదలీ ఆలస్యంగా చోటుచేసుకుంది. పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా కొంత బదలీ చోటుచేసుకుందని నేను అంగీకరించి తీరాలి. ఎందుకంటే, మన వ్యవస్థలో ఫైనాన్షియల్ మధ్యవర్తిత్వం చోటుచేసుకుంటోంది’’ అని ఉర్జిత్ పటేల్ వ్యాఖ్యానించారు.

కనీస మద్దతు ధరపై చర్చించాం

ఈక్విటీలపై దీర్ఘకాల మూలధన లాభ పన్నును పునః ప్రవేశపెట్టాలని ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన సంగతి గురించి శనివారంనాడు సెబి బోర్డుతో జరిపన సమావేశంలో చర్చించినట్లు అరుణ్ జైట్లీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అయితే, ఆర్.బి.ఐ బోర్డుతో జరిపిన సమావేశంలో ఆ అంశం ప్రస్తావనకు రాలేదని ఆయన అన్నారు. ఆర్.బి.ఐతో ‘‘జరిపిన సమావేశంలో (వ్యవసాయ ఉత్పత్తులకు) కనీస మద్దతు ధర గురించి చర్చించాం. ఎందుకంటే, ఈ సమావేశం బడ్జెట్ నేపథ్యంలో చోటుచేసుకుంది. దానిని ఎలా అమలుజరపాలి, రైతులపై, వస్తువుల ధరలపై అది ఎలాంటి ప్రభావం చూపిస్తుంది, ఎగుమతుల పోటీ సామర్థ్యం ఎలా ఉంటుంది వంటి అంశాలన్నింటినీ విద్యాపరంగా చర్చించాం’’ అని జైట్లీ చెప్పారు.

‘మనసుపెట్టి పరిష్కారం చూపండి’

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార వృత్తి నిపుణులు ‘‘సిద్ధాన్న పరిష్కారాల’’ కోసం ఎదురుచూడకూడదని, తామందిస్తున్న సేవలకు చార్జీలను మితిమీరి వసూలు చేయకుండా నిగ్రహం పాటించాలని భారతీయ ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డు (ఐ.బి.బి.ఐ) అధ్యక్షుడు ఎం.ఎస్. సాహూ అన్నారు. నిర్దిష్ట ఉదంతాలలో ఇన్‌సాల్వెన్సీ వృత్తి నిపుణులు వ్యవహరించిన తీరు, స్వతంత్రతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఆయన ఆ రకమైన వ్యాఖ్యలు చేశారు. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐ.బి.సి) కింద సాగే దివాలా ప్రొసీడింగులలో ఆ వృత్తి నిపుణుల పాత్ర కీలకం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు



బకాయిలుపడి తీర్చలేకపోయిన కంపెనీల దివాలా పరిష్కారానికి ఈ వృత్తి నిపుణులు మార్కెట్ నిర్ధారిత, కాలబద్ధ పరిష్కారాలు చూపించగలుగుతారు. ‘‘రెడీ మేడ్ పరిష్కారాల కోసం చూడకండి...(దివాలా పరిష్కారం)కి మనసు పెట్టి పనిచేయవలసి ఉంటుంది’’ అని శనివారం నాడిక్కడ ఇన్‌సాల్వెన్సీ వృత్తి నిపుణుల సదస్సులో సాహూ అన్నారు. ఇన్‌సాల్వెన్సీ వృత్తి నిపుణులకు ప్రతిభ, శీలసంపద రెండూ అవసరమని ఆయన అన్నారు. తమ పనిని వేరే వారికి అప్పగించడం లేదా ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వడం చేయవద్దని సాహూ కోరారు. వృత్తినిపుణులు తాజా పరిస్థితులను ఆకళింపు చేసుకుంటూ, పోటీనిచ్చేవారుగా కొనసాగుతూ ఉండాలని ఐ.బి.బి.ఐ అధినేత అన్నారు. ఒక పరిష్కార ప్రక్రియను పూర్తి చేయడానికి పట్టే సమయాన్ని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించుకునే అవకాశాన్ని వృత్తి నిపుణులు పరిశీలించాలని ఆయన అన్నారు. భారతీయ ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డు ఐ.బి.సిని అమలుజరుపుతోంది. దాని కింద పరిష్కార ప్రక్రియ 270 రోజుల లోపు పూర్తికావలసి ఉంది. ఐ.బి.సి సారమంతా వేగంలోనే ఉందని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) అధ్యక్షుడు ఎం.ఎం. కుమార్ అన్నారు.



బాండ్ మార్కెట్ పటిష్టతకు చర్యలు

న్యూఢిల్లీ: కార్పొరేట్ బాండ్ మార్కెట్ వేళ్ళూనుకునేట్లుగా మరిన్ని చర్యలు తీసుకోవలసిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబిని కోరారు. ఐ.పి.ఓలలో కొనసాగుతున్న ఆరోహణ ధోరణి పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలను సాధించడంలో సహాయపడవచ్చని ఆయన అన్నారు. స్టాక్ మార్కెట్ ధోరణులు, ఇటీవల తాను తీసుకున్న చర్యల గురించి సెబి శనివారంనాటి సమావేశంలో జైట్లీకి వివరించింది. అనూచానంగా వస్తున్న సంప్రదాయం ప్రకారం, బడ్జెట్ సమర్పణ అనంతరం, సెబి బోర్డుతో సమావేశమయ్యారు. కార్పొరేట్ బాండ్ మార్కెట్ వేళ్ళూనుకునేట్లు చేయడంపై సెబి దృష్టి కేంద్రీకరించాలని ఆర్థిక మంత్రి అభిప్రాయపడినట్లు సెబి చైర్మన్ అజయ్ త్యాగి చెప్పారు. పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాలను సాధించడానికి మరిన్ని ఐ.పి.ఓలు సహాయపడతాయని, మౌలిక వసతుల ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టుల (ఇన్‌విట్‌ల) ద్వారా ఆస్తుల నగదీకరణ పట్ల ఆర్థిక మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారని త్యాగి చెప్పారు. ‘‘మా ప్రాథమ్యాలేమిటో, గత ఏడాది కాలంగా మేం ఏం చేస్తూ వస్తున్నామో ఆర్థిక మంత్రికి మేం వివరించాం’’ అని ఆయన చెప్పారు. మార్కెట్ల నియంత్రణ సంస్థ తీసుకున్న చర్యలను జైట్లీ ప్రశంసించారని కూడా ఆయన తెలిపారు. ‘‘‘సెబి’కన్నా కూడా ప్రపంచ వ్యాప్తంగా క్యాపిటల్ మార్కెట్లే నిజంగా బాగా పనిచేస్తున్నట్లుంది’’ అని త్యాగి వ్యాఖ్యానించారు.

సెబికి సంబంధించి బడ్జెట్‌లో చేసిన ప్రకటనల అమలు గురించి కూడా ఈ బోర్డు సమావేశంలో చర్చించారు. సెబి బోర్డు సమావేశంలో జైట్లీతోపాటు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పొన్ రాధాకృష్ణన్, ఫైనాన్స్ కార్యదర్శి హస్‌ముఖ్ అధియా, ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్, కార్పొరేట్ వ్యవహారాల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్, సెబి బోర్డు సభ్యులు, జి. మహాలింగం, అరుణ్ పి. సాతే, మాధబి పురీ బక్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

‘ద్రవ్య లోటుపై ఇప్పటికి ఇబ్బందేమీ లేదు’

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య పరిస్థితి సౌకర్యవంతంగానే ఉండగలదని, ద్రవ్య లోటును కట్టడి చేసే లక్ష్యాలను చేరుకోవడంలో లోటుపాట్లపై ప్రస్తుతానికి ఎలాంటి కలవరమూ లేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరలపై తక్షణం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఊహాజనిత పరిస్థితిని ఆధారం చేసుకుని మదింపు చేయకూడదని ఆయన అన్నారు. గత మూడు రోజుల పరిస్థితిని చూస్తే ముడి చమురు ధరలు మళ్ళీ తగ్గుతున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. ద్రవ్య లోటు కట్టడి చేయలేకపోవడం గురించి ఈ దశలో ఎలాంటి ఆందోళనా చెందడం లేదని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌ను సమర్పించిన తర్వాత, ఆర్థిక మంత్రి ఆర్.బి.ఐ బోర్డుతో సమావేశమవడం రివాజుగా వస్తోంది. అలా సమావేశమైన తర్వాత, జైట్లీ పత్రికలవారితో మాట్లాడారు. ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన జరిగిన ద్రవ్య విధాన కమిటీ ఇటీవలి సమావేశంలో వడ్డీ రేట్లను మార్చకుండా యథాతథ స్థితిని కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం ‘‘సమతౌల్యంతో కూడిన నిర్ణయ’’ మని జైట్లీ అభివర్ణించారు. ‘‘ద్రవ్య లోటు కట్టడి లక్ష్యాన్ని సాధించడానికి సంబంధించినంత వరకు వచ్చే ఏడాది పరిస్థితి మరింత సుఖకరంగా ఉంటుందని భావిస్తున్నా. ఇక రాబడులకు సంబంధించినంత వరకు లోటు ఉంటుందని ఈ దశలో నేను అనుకోవడం లేదు’’ అని జైట్లీ అన్నారు. ‘సెబి’ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో కూడా జైట్లీ సమావేశమయ్యారు. క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ చెప్పిన అంశాలలో ప్రముఖమైనది ఒకటుందని, అది రుణానికి సంబంధించినంత వరకు కార్పొరేట్ బాండ్లపై ఆధారపడడం ఎక్కువ అవడమని జైట్లీ చెప్పారు. కంపెనీల ఈక్విటీ-రుణ నిష్పత్తి రానున్న రోజుల్లో మెరుగుపడుతుందని భావిస్తున్నామని, బాండ్ల ద్వారా నిధులు సమీకరించడంలో క్యాపిటల్ మార్కెట్లు మంచి ధోరణిని కనబరుస్తున్నాయని ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు.



ఇంజన్ లోపంతో విమానాల నిలిపివేత

న్యూఢిల్లీ: ఇంజన్‌లో సమస్యలు తలెత్తడంతో మూడు ఎ320 నియో విమానాల సర్వీసులను ఇండిగో విమానయాన సంస్థ నిలిపివేసింది. విమానయాన నియంత్రణ సంస్థ డి.జి.సి.ఎ సీనియర్ అధికారి ఒకరు ఈ అంశాన్ని వెల్లడించారు. నిలిపివేసిన విమానాలలోని ఇంజన్లు ప్రాట్ అండ్ విట్నే సంస్థ తయారు చేసినవి. యూరోపియన్ విమానయాన భద్రతా నియంత్రణ సంస్థ



ఇ.ఎ.ఎస్.ఎ ఆదేశం మేరకు విమానాలను నిలిపివేశారు. నిర్దిష్ట సీరియల్ నంబరు కలిగిన పిడబ్ల్యు1100 ఇంజన్లు అమర్చిన ఎ320 నయా విమానాల పయనయోగ్యతకు సంబంధించి ఇ.ఎ.ఎస్.ఎ శుక్రవారం ఒక అత్యవసర ఆదేశం జారీ చేసిందని ఆ అధికారి చెప్పారు. గాలిలో విహరిస్తున్న సమయంలో ఇంజను ఆగిపోవడం, టేకాఫ్‌లు కాకపోవడం వంటి దృష్టాంతాల నేపథ్యంలో ఈ ఆదేశం జారీ అయింది. ఎ320 నియో ఫ్యామిలీ విమానాల విషయంలో ఈ సమస్యలు తలెత్తాయి. సమస్యలు తలెత్తిన ఇంజన్లు వేరు చేసేందుకు సూచనలు సమకూర్చేందుకు ఎయిర్‌బస్ ఒక అలర్టు జారీ చేసింది. ఇండిగో ఎ320 నియోలలో గతంలో తలెత్తిన సమస్యలకు, తాజా సమస్యకు మధ్య తేడా ఉందని అధికారి తెలిపారు.

చమురు ధరలు అంచనా వేయలేం

న్యూఢిల్లీ: ద్రవ్య విధాన నిర్ణయాలు దూరదృష్టితో తీసుకునేవై ఉండాలని, వాటిని దైనందిన ద్రవ్యోల్బణ రేట్లను ఆధారం చేసుకుని తీసుకోలేమని ఆర్.బి.ఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఏ విధంగా ఉండబోతున్నాయో అంచనా వేయడం కష్టమని ఆయన అన్నారు. ఇటీవలి రోజులలో అవి రెండు విధాలుగా ఉన్నాయి. అవి పెరిగినా, తగ్గినా రెండు రకాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు మనం సిద్ధమై ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ‘‘కొద్ది నెలల క్రితం జూన్‌లో అనుకుంటూ, ముడి చమురు ధరలు పీపాకు 45 అమెరికన్ డాలర్లు దాటదని చెబుతూ వచ్చారు. ద్రవ్య విధాన కమిటీకి వచ్చిన సలహాలలో కొన్ని దాన్ని ఆధారం చేసుకున్నవే’’ అని ఉర్జిత్ అన్నారు. బ్యాంకుల రుణాలలో వృద్ధి మెరుగుపడగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీలు క్యాపిటల్ మార్కెట్ల నుంచి గణనీయ మొత్తాలను సమీకరించుకోగలుగుతున్న ప్రోత్సాహకర ధోరణి పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ‘‘ద్రవ్య విధానాన్ని సమీక్షించేటప్పుడు మనం పురోగామి దృక్పథంతో ఉండాలిగానీ, నిన్నటి లేదా




నేటి ద్రవ్యోల్బణ రేట్లను దృష్టిలో పెట్టుకోకూడదు. ప్రపంచంలోని ఇతర కేంద్ర బ్యాంకుల తీర్మానాలతో పోలిస్తే మావే సుదీర్ఘమైనవి. మేం మా నిర్ణయాలను జాగ్రత్తగా వివరిస్తున్నాం. ఏడాదిలో రెండుసార్లు ద్రవ్య విధాన నివేదికను సమర్పిస్తున్నాం’’ అని ఉర్జిత్ చెప్పారు. ‘‘మా నిర్ణయాలు తిరోగామి దృక్పథంతోకన్నా పురోగామి దృక్పథంతోనే ఉన్నాయని భావిస్తున్నాను’’ అని ఆయన చెప్పారు. జి.డి.పి వృద్ధి రేటు ఎరుగుతున్న ధోరణిని సూచిస్తోందని ఆయన అన్నారు. రుణాలలో వృద్ధి చోటుచేసుకోవడం శుభ సంకేతమని, ప్రభుత్వ రంగ బ్యాంకులకు పునర్ మూలధనీకరణతో అది మరింత పెరగగలదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు.



గ్రేటర్ నోయిడాలో ఆటో ఎక్స్‌పో 2018లో శనివారంనాడు హోండా కంపెనీ కొత్త బైక్ వద్ద బాలీవుడ్ నటీమణి తాప్సీ పన్ను

జౌళి పరిశ్రమలో నిపుణుల కొరత



కోల్‌కతా: నైపుణ్య అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించవలసిందిగా పశ్చిమ బెంగాల్ సాంకేతిక విద్యా శాఖ మంత్రి పూర్ణేందు బసు శుక్రవారంనాడు జౌళి రంగానికి విజ్ఞప్తి చేశారు. ‘‘పరిశ్రమల నుంచి అప్రెంటిస్‌లకు ఏమంత ఎక్కువ డిమాండ్ లేదు. జౌళి రంగం నుంచే ఎంతో కొంత కృషి సాగుతోంది. కనుక, జౌళి రంగాన్ని పరిరక్షించేందుకు ఆ రంగంలోనే నైపుణ్య అభివృద్ధి చోటుచేసుకోవాలి. ఈ విషయంలో ఇండియన్ జ్యూట్ మిల్స్ అసోసియేషన్ కూడా ముందుకు వచ్చి తన వంతు చేయూత నందించాలి’’ అని పూర్ణేందు అన్నారు. అనియత రంగంలో ఇప్పుడున్న వర్కర్లను నిపుణులుగా తయారు చేయాలని కోరారు. వారున్న సేవల రంగాల్లో మెరుగ్గా అల్లుకుపోయేందుకు ఆ నైపుణ్యం వారి సాధికారతనిస్తుందని ఆయన చెప్పారు. చిన్న, సన్నకారు రైతులను నిపుణులను చేసే ప్రధాన కృషిని ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆయన చెప్పారు. జాతీయ స్థాయి అస్సెస్‌మెంట్లు, సర్టిఫికేషన్ కోసం సుమారు 16 నైపుణ్య రంగాలు అవగాహన పత్రాలపై సంతకాలు చేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు. కొత్త లాటులో కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టిన సమయంలో జౌళి పరిశ్రమలో నైపుణ్యాల మధ్య వ్యత్యాసం అపారంగా ఉందని ఐ.జె.ఎం.ఏ చైర్మన్ సంజయ్ కజారియా అన్నారు. కొత్త యంత్రాలు, ప్రక్రియలను నడిపించడానికి పరిశ్రమకు ఏటా 15,000 మంది నిపుణులైన సిబ్బందికి కొరత ఏర్పడుతోందని ఆయన చెప్పారు.

మనం బాల

ఆదివారం, 11 ఫిబ్రవరి 2018

www.manamnews.com

నెలల వయసు నుంచి స్కూల్ వయస్సు వరకు పిల్లలకు పోషకాహారం చాలా అవసరం. కొన్ని రకాల పదార్థాలంటేనే చిన్నారులకు మక్కువ. కొన్ని అంటే మొహం తిప్పుకుంటారు. ఇక్కడ ఏదన్నది కాదు ముఖ్యం... వారికి అందాల్సిన పోషకాలు అందుతున్నాయా? లేదా? అన్నది తల్లిదండ్రులు చూసుకోవాల్సిన అంశం. ఈ నేపథ్యంలో ఏ వయసులో ఏ ఆహారం అందించొచ్చన్నది, పోషకాహారం, వైద్య నిపుణుల సూచనలు ఎలా ఉన్నాయన్నది తెలుసుకుందాం...





పిల్లలకు పోషకాహారం

కొవ్వు పదార్థాలు

కొవ్వు పదార్థాలు పిల్లలకు అధికంగా ఇవ్వకూడదు. కానీ, తగినంత మోతాదు అవసరమే. కొన్ని రకాల పోషకాలను శరీరం తగిన విధంగా వినియోగించుకునేందుకు ఇవి అవసరమవుతాయి. కొవ్వులు అధికంగా ఉండే వాటిలో హోల్ మిల్క్ పదార్థాలు, వంట నూనెలు, మాంసం, చేపలు, నట్స్.

నిరంతరం రక్తం

శరీరంలో అన్ని కణాలకు నిరంతరం రక్తం సరఫరా కావాలి. ఆ రక్తం తయారీకి కీలకం ఐరన్. పౌల్ట్రీ, చేపలు, తృణ ధాన్యాలు, బీన్స్, నట్స్ లో ఐరన్ లభిస్తుంది.

ఆరోగ్యకరమైన వృద్ధి

బి విటమిన్స్ లో ఒక రకం. ఆరోగ్యకరమైన వృద్ధికి, కణాల అభివృద్ధికి ఇది అవసరం. ఇది లోపిస్తే రక్త హీనత ఏర్పడుతుంది. తృణ ధాన్యాలు, కాయ, గింజ ధాన్యాలు, పాలకూర, నలుపు లేదా కిడ్నీ బీన్స్,

విటమిన్ ఎ

శరీర నిర్మాణానికి, కంటి చూపునకు, చర్మ ఆరోగ్యానికి, ఇన్ఫెక్షన్ నివారణకు విటమిన్ ఎ తోడ్పడు తుంది. క్యారట్లు, స్వీట్ పొటాటో, ఆప్రికాట్స్, పాలకూర, క్యాబేజీ, చేప నూనెలు, గుడ్డు పచ్చసొన.

విటమిన్-సి

శరీరంలో రక్త నాళాల గోడల బలోపేతానికి, గాయాలు మానేందుకు, వ్యాధి నిరోధక శక్తికి, ఎముకల, దంతాల బలానికి విటమిన్ సి అవసరం. సిట్రస్ జాతి పండ్లు (కమలా, నిమ్మ, బత్తాయి తదితర), స్ట్రాబెర్రీ, టమాటా, ఆలుగడ్డలు, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, దోసకాయ, పాలకూర, బొప్పాయి పండు, మామిడిపండులో విటమిన్ సి తగినంత లభిస్తుంది.



ప్రొటీన్స్

శరరీంలో కణాల నిర్మాణానికి ప్రొటీన్లు అవసరం. ఆహరాన్ని శక్తిగా మార్చేందుకు, ఇన్ఫెక్షన్ పై పోరాడేందుకు, ఆక్సిజన్ ను సరఫరా చేసేందుకు ప్రొటీన్లు అవసరం. మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, నట్స్ (బాదం, ఆక్రూట్ తదితర), బీన్స్, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

కార్బోహైడ్రేట్స్

శరీరానికి శక్తినందించే కీలక వనరులు ఇవి. కొవ్వు, ప్రొటీన్లను శరీర కణజాల నిర్మాణానికి ఉపయోగిం చేందుకు ఇవి అవసరం. చక్కెరలు, గంజి, పీచు పదార్థాలు ఇలా భిన్న ఆహార పదార్థాల్లో కార్బొహైడ్రేట్స్ తగినంత ఉంటాయి. చిన్నారులకు మాత్రం చక్కెరలు కాకుండా, ఇతర రూపాల్లో ఇవి అందేలా శ్రద్ధ తీసుకోవాలి.





అన్ని పోషకాలు

వీరికి ఈ వయసులో తల్లిపాలు లేదంటే ఫార్ములా మిల్క్ లేదంటే రెండూ కలిపి ఇవ్వొచ్చు. దాదాపుగా అన్ని పోషకాలు తల్లి పాల నుంచి అందుతాయి. కానీ, విటమిన్ డి తగినంత అందదు. అందుకే వీరిని ప్రతీ రోజూ సూర్యోదయం సమయంలో కొంత సమయం పాటు ఎండలో ఉంచితే విటమిన్ డి అందుతుంది. లేదంటే విటమిన్ డి చుక్కల మందు రూపంలో అందించాలి. అలానే ఐరన్ కూడా వీరికి తగినంత అందదు. అందుకే వైద్యులు ఐరన్, జింక్, విటమిన్స్ కూడిన డ్రాప్స్‌ను సూచిస్తుంటారు. పిల్లలకు పాలిచ్చే తల్లులు పూర్తి పోషకాహారాన్ని తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే వారి నుంచే పిల్లలకు పోషకాలు అందాలి కనుక. తగిన పోషకాహారం తీసుకోవడం వల్ల బ్రెస్ట్ మిల్క్ తగినంత ఉత్పత్తి ఉంటుందని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా మరేమీ ఇవ్వకూడదు. పిల్లలకు రెండో ఏడాది ముగిసే వరకు బ్రెస్ట్ ఫీడింగ్‌ను కొనసాగించాలి. ఆరు నెలల వయసులో శిశువులు ఘన ఆహారాన్ని తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారు. కనుక వారికి రైస్, ఉడికించిన పండ్లు, కూరగాయలు ఇవ్వాలి.

రుచి చూసేలా ప్రోత్సాహం

కొత్త ఆహార పదార్థాలను రుచి చూసేలా చిన్నారులను ప్రోత్సహించాలి. పండ్లు, ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు, యోగర్ట్ లేదా పెరుగు ఇవి చాలా కీలకం. వీటిని పిల్లలు అవాయిడ్ చేయకుండా చూసుకుంటే చాలు. ఏడాది వయసు నుంచి పిల్లలు తోటి కుటుంబ సభ్యులు తినే వాటినే అనుసరిస్తుంటారు. కనుక కుటుంబ సభ్యుల ఆహార అలవాట్లు వారిపై ప్రభావం చూపిస్తాయి.

పాలు సరిపడా ఉండేలా!

ఎదిగే వయసు కనుక పాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. తల్లిపాలే సరిపోవు కనుక విడిగా పాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎముకలు, దంతాలకు క్యాల్షియం చాలా అవసరం. శరీర నిర్మాణంలో కండరాలతోపాటు ఎముకలకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ పాలతో అలర్జీ ఉండి, పిల్లలు తీసుకోకపోతే సోయా మిల్క్, క్యాల్షియంతో కూడిన పండ్ల రసం, రైస్, ఓట్ మీల్ ఇవ్వాలి. ఈ వయసులో వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను కూడా సూచించొచ్చు. అలాగే, పీచు పదార్థం చాలా అవసరం. ఇచ్చే ఆహారంలో ఇది తగినంత ఉండాలి.

ఐదేళ్ల తర్వాత శారీరక వృద్ధి

పిల్లలకు ఐదేళ్ల వయసు నాటికి వారిలో మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఐదో ఏట నుంచి వారిలో అసలైన శారీరక వృద్ధి మొదలవుతుంది. ఇందుకోసం వారిలో తగినంత రక్త సరఫరా జరిగేందుకు వీలుగా ఐరన్ సప్లిమెంట్లను ఇవ్వాలి. కానీ, తల్లిదండ్రులు నేడు సహజ ఆహారానికి బదులు ప్రాసెస్డ్ ఆహార పదార్థాలైన బిస్కట్లు, శాండ్ విచ్‌లు, నూడుల్స్ (ఇవన్నీ ప్రాసెస్ చేసినవి, వేయించినవి), కాండీలు, చాక్లెట్లు ఇవ్వడం జరుగుతోంది. వీటి వల్ల ట్రాన్స్ ఫ్యాట్ పిల్లలకు ఎక్కువ అందుతుంది.

అల్పాహారం ఆప్షన్స్

మిల్క్ షేక్, పండ్లు లేదా పాలతో కార్న్ ఫ్లేక్స్ లేదా ఓట్స్ కలిపి తీసుకోవచ్చు. అటుకులను కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు. ఆమ్లెట్, చపాతీ కలిపి తీసుకోవచ్చు. ఉడికించిన గుడ్డు తినిపించొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం పిల్లలు రోజులో నాలుగు సార్లు ఫుల్ మీల్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆహారం కూడా తాజా పండ్ల రసాలు, ప్రొబయోటిక్ పెరుగు, కూరగాయలు (రసాలు, ఉడకబెట్టిన రూపంలో) కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, చపాతీలు, పరాటాలు కూడా భాగం చేసుకోవాలి. మొలకెత్తిన ధాన్యం, బీన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పోషకాహార బలం లభిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.



పిల్లలు పెరిగేకొద్దీ..!

పిల్లలు ఆకలి ఉన్నంత మేర తింటారు. కొంత తిన్న తర్వాత వద్దు అని ముఖం తిప్పుకుంటున్నా రంటే వారి కడుపునిండినట్టుగానే అర్థం చేసుకోవాలి. పిల్లలు పెరిగేకొద్దీ వారిలో ఆకలి కూడా అలానే పెరగడం సహజంగానే జరుగుతుంది. ఒకవేళ పిల్లలు సరిగా ఆహారం తినడం లేదని మీరు గమనిస్తే ఆ విషయాన్ని పోషకాహార నిపుణుల దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే, బరువు తగ్గుతూ ఉన్నా ఉపేక్షించకుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

అనారోగ్యంతో ఉన్నప్పుడు...

అనారోగ్యంతో ఉన్నప్పుడు కడుపు మాడ్చకూడదు. శక్తితో కూడిన ధాన్యాలు, పాలు, ఉడికించిన కూరగాయలు కొంచెం చొప్పున ఎక్కువ సార్లు అందించాలి. పుష్కలంగా నీరు, ద్రవ పదార్థాలు ఇవ్వాలి. డీహైడ్రేషన్ రాకుండా అవసరమైతే ఓరల్ రీహైడ్రేషన్ ద్రావకాన్ని తాగించాలి.

పండ్లు, కూరగాయలు

వీటితో నీరు, విటమిన్స్, మినరల్స్, పీచు (ఫైబర్) తగినంత లభిస్తాయి. చిన్నారులు ఐదు భాగాల పండ్లు, కూరగాయలను ఒక రోజులో తీసుకోవాలి.

ఫ్యాట్స్, నూనెలు

చిన్న పిల్లలు, టీనేజీ వయసులో ఉన్నవారికి కొవ్వులు, నూనె పదార్థాలు ఎంతో అవసరం. చిన్నారుల మానసిక వృద్ధికి ఇవి తోడ్పడతాయి. కొవ్వు అన్నది మన శరీరంలో ఇంధనంలా పనిచేస్తుంది. ఫ్యాట్ లో కరిగే విటమిన్ ఎ, డీ, ఈ, కే లను శరీరం గ్రహించేలా చేయగలదు. కొవ్వుతో కూడిన పదార్థాలు అధికంగా తీసుకుంటే బరువు పెరగడం, స్థూలకాయం, గుండె జబ్బులు తదితర ప్రమాదాలుంటాయి. అందుకే వీటిని తగినంత మోతాదులో తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. నట్స్, అవొకాడో, కార్న్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, ఆలివ్ ఆయిల్, కనోలా ఆయిల్ ను ఇందుకు ఎంచుకోవచ్చు.

పాలు, పాల పదార్థాలు

పాలు, పాల పదార్థాలు ఎన్నో పోషకాలకు నెలవు. వీటిలో విటమిన్ ఎ, డి, బి1, బి2, బి12 విటమిన్లు, మినరల్స్, ముఖ్యంగా క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. చిన్నారులు, యుక్త వయసులోకి వచ్చిన వారికి పాలు చాలా అవసరం. ఎముకల వృద్ధికి అవసరమైన క్యాల్షియం అందుతుంది.

మాంసం, బీన్స్

మాంసం, పౌల్ట్రీ, చేపలు, బీన్స్, బఠానీలు, గుడ్లు, విత్తనాలు ఎన్నో పోషకాలకు నెలవు. ఆరోగ్యకరమైన ఆహారంలో వీటికి చోటుండాలి. మన శరీరంలో వివిధ రకాల పనులకు అవసరం.

ఎంత మేర పాలు అవసరం?

2-3 ఏళ్ల మధ్య చిన్నారులకు రెండు కప్పుల పాలు (480 ఎంఎల్) ఇవ్వాలి. 4-8 ఏళ్ల పిల్లలకు రెండున్నర కప్పులు (600 ఎంఎల్) ఇవ్వాలి. 9 ఏళ్లు దాటిన వారికి మూడు కప్పులు (720 ఎంఎల్) ఇవ్వాలని డాక్టర్ దేవయాని బెనర్జీ సూచించారు. కొవ్వు తీసిన పాలు, 1 శాతం ఫ్యాట్ ఉన్న పాలను ఉపయోగించడం మంచిదని ఆమె సూచించారు.



శారీరక కదలికలు

పిల్లలకు రోజువారీ శారీరక శ్రమ అవసరం. బలమైన ఎముకలు, తగినంత కండరాల బలం కోసం శారీరక కదలికలు ఉండేలా చూడాలి. నడక, పరుగు, ఇతర క్రీడలు ఉపయోగపడతాయి. ఈ విషయంలో తల్లిదండ్రులే పిల్లలకు మార్గదర్శకం. కనుక వారు చేయడం ద్వారా పిల్లలను ప్రోత్సహించొచ్చు. పిల్లలకు సమతుల పోషకాహారం ఎంతో ప్రాధాన్యమని ఇక్కడ చెప్పుకున్నాం. అవేంటన్న సందేహం రావచ్చు. కనుక పోషకాలు ఏవి, ఎందులో అవి లభ్యమవుతాయన్నది ఇక్కడ తెలుసుకోవచ్చు.


రంగులు వేయండి



చుక్కలు కలపండి



దారి కనుక్కోండి



మాతో ఆడితే ఆ కష్టాలు తెలుస్తాయి



- బ్లైండ్ క్రికెట్‌తో కోహ్లీ సేన ఆడాలన్న సీఏబీఐ కార్యదర్శి

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన రెండు పురుషుల జట్లు ప్రపంచ క్రికెట్‌లో సునామీ సృష్టిస్తున్నాయి. ఒకటి విరాట్ కోహ్లీ నేతృత్వంలోని జాతీయ జట్టు కాగా.. రెండోది బ్లైండ్ క్రికెట్ టీమ్. ఈ జట్టు ఇటీవలే బ్లైండ్ వరల్డ్ కప్‌ను గెలిచింది. బ్లైండ్ క్రికెట్ ఆడటం అంత సులువేమీ కాదని.. ఒక్కసారి తమ జట్టుతో కోహ్లీ సేన ఆడితే అందులో ఉన్న కష్టాలేంటో తెలుస్తాయని క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ) కార్యదర్శి జాన్ డేవిడ్ అన్నారు. బ్లైండ్ క్రికెట్ జట్టు వన్డే వరల్డ్ కప్‌తో పాటు ఇటీవల రెండు టీ20 వరల్డ్ కప్‌లు, రెండు ఆసియా వరల్డ్ కప్‌లు, నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లు గెలిచింది. అయినప్పటికీ బీసీసీఐ గుర్తింపు కోసం పోరాటం చేస్తోంది. బ్లైండ్ క్రికెట్ జట్టుతో కోహ్లీ సేన ఆడితే ఎలా ఉంటుందో డేవిడ్ వివరించారు. 'కోహ్లీ సేన కళ్లకు గంతలు కట్టుకుని ఓ డెమో మ్యాచ్ ఆడింది. రవీంద్ర జడేజా మోకాళ్లపై కూర్చొని బాల్ కోసం వెతికాడు. రోహిత్ శర్మ అతని తలపై మొట్టికాయ వేసి వెక్కిరించాడు. అయినా వాళ్లు బంతిని కనుక్కోలేకపోయారు. కంటి చూపు లేకుండా క్రికెట్ ఆడటం ఎంత కష్టమో వాళ్లకు తెలిసింది. 2015లో టీమిండియాతో కాసేపు ఆడే అవకాశం లభించింది. రవిశాస్త్రి బౌలింగ్ చేశారు. కాసేపు కళ్లు మూస్తే నేను ఎక్కడ ఉన్నానో నాకే తెలియడం లేదు.. బ్లైండ్ క్రికెట్ అడటం కనిపిస్తున్నంత సులువేమీ కాదని ఆయన అన్నారు' అని డేవిడ్ వివరించారు. అయితే గతవారం బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రీని, సీఓఏ హెడ్ వినోద్ రాయ్‌లను కలిశామని.. వాళ్లు తమ అభివృద్ధిని చూసి పాజిటివ్‌గా ఉన్నారని సీఏబీఐ అధ్యక్షుడు మహంతేష్ చెప్పారు.



కోహ్లీతో స్నేహాన్ని రాజకీయాలు నిర్వచించలేవు

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది

సెయింట్ మోరిట్జ్ (స్విట్జర్లాండ్): సరిహద్దు రేఖ వద్ద ఉన్న ఉద్రిక్తత వల్ల ఇండియా, పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్‌కు ఆటంకాలు ఎదురవుతుండొచ్చు. కానీ టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీతో తన హృదయపూర్వక అనుబంధాన్ని రాజకీయాలు నిర్వచించలేవని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది అన్నాడు. 'కోహ్లీతో నా అనుబంధాన్ని రాజకీయాలు నిర్దేశించలేవు. విరాట్ మంచి వ్యక్తిత్వమున్న వ్యక్తి. నేను పాకిస్థాన్‌కు ఎలాగో కోహ్లీ కూడా భారత క్రికెట్‌కు అంబాసిడర్' అని సెయింట్ మోరిట్జ్ ఐస్ క్రికెట్ టోర్నీ సందర్భంగా అఫ్రిది అన్నాడు. 'కోహ్లీ ఇతర క్రికెటర్లను ఎంతో గౌరవిస్తాడు. నా ఫౌండేషన్‌కు (షాహిద్ అఫ్రిది ఫౌండేషన్) స్వయంగా సంతకం చేసిన జెర్సీని ఇచ్చి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు' అని అఫ్రిది చెప్పాడు. పాకిస్థాన్‌లోని వెనకబడిన వర్గాల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగు నీటిని అఫ్రిది ఫౌండేషన్ అందిస్తూ ప్రజా సేవ చేస్తోంది. 'విరాట్‌తో మాట్లాడినపుడల్లా నా ఆత్మీయునితో మాట్లాడినట్టు అనిపిస్తుంది. మేము కలిసినపుడల్లా చాలా సేపు మాట్లాడుకుంటాం. అంతేకాకుండా మెసేజ్‌లు కూడా పెట్టుకుంటాం. ఇటీవల కోహ్లీ పెళ్లి చేసుకున్నప్పుడు అతనికి శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ పెట్టాను. ఇద్దరు వ్యక్తుల మధ్య సంబంధాల మాదిరిగానే రెండు దేశాల మధ్య సంబంధాలు ఉండాలని మేము ఒక ఉదాహరణగా ఉంటాం. పాకిస్థాన్ తర్వాత అంతటి ప్రేమాభిమానులను ఇండియా, ఆస్ట్రేలియాల్లో చవిచూశాను' అని మాజీ కెప్టెన్ అన్నాడు.

ప్రొటీస్‌కు ఊరట

మూడో వన్డేలో గెలిచిన సౌతాఫ్రికా - 2-1తో సిరీస్ కైవసం చేసుకున్న మిథాలీ సేన - మహిళల వన్డే సిరీస్



పొచెఫ్‌స్ట్రూమ్: భారత మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆతిథ్య సౌతాఫ్రికా జట్టుకు ఊరట కలిగింది. సిరీస్ కోల్పోయినప్పటికీ చివరి వన్డేలో గెలిచి పరువు నిలబెట్టుకుంది. డు ప్రీజ్ అజేయ అర్ధ సెంచరీతో జట్టును గెలిపించింది. కానీ సెంచరీ చేయకుండానే లక్ష్యాన్ని చేరుకోవడంతో నిరాశతో వెనుదిరిగింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. తర్వాత సౌతాఫ్రికా జట్టు 49.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 241 పరుగులు సాధించింది. రెండో ఓపెనర్ వోల్వార్ట్, స్టెయిన్, వాన్ నీకెర్క్ జట్టుకు తమ వంతు సహకారం అందించారు. చివరి వన్డేలో భారత జట్టు ఓడినా 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

గెలవగల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల జట్టు ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. మూడో ఓవర్లో శిఖా పండే వేసిన మూడో బంతికి లెజి లీ అవుటైంది. తర్వాత వచ్చిన స్టెయిన్‌తో కలిసి వోల్వార్ట్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడే క్రమంలో రన్‌రేట్ మందగించింది. వోల్వార్ట్, స్టెయిన్ కలిసి అడపాదడపా బౌండరీలు కొడుతూ, క్రీజు వద్ద నిలదొక్కుకునే ప్రయత్నం చేశారు. కానీ 16వ ఓవర్లో బిస్ట్ వేసిన బంతికి స్టెయిన్ ఆమెకే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో 51 పరుగుల వద్ద సౌతాఫ్రికా రెండో వికెట్ కోల్పోయింది. తర్వాత వచ్చిన డు ప్రీజ్, వోల్వార్ట్ కలిసి జట్టును వంద పరుగుల మార్క్‌ను దాటించారు. ఈ క్రమంలో



వోల్వార్ట్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే 39వ ఓవర్లో బిస్ట్ వేసిన చివరి బంతికి వోల్వార్ట్ అవుటైంది. దీంతో 169 పరుగుల వద్ద మూడో వికెట్ పడింది. వోల్వార్ట్, డు ప్రీజ్ కలిసి మూడో వికెట్‌కు 119 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించారు. తర్వాత వచ్చిన వాన్ నీకెర్క్, డు ప్రీజ్ కలిసి మిగతా పనిని పూర్తి చేశారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 70 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని అందించారు. డే ప్రీజ్ 90, వాన్ నీకెర్క్ 41 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. తొలి ఓవర్లో ఇస్మాయిల్ వేసిన మూడో బంతికి ఓపెనర్ స్మృతి మంధన అవుటైంది. దీంతో పరుగుల ఖాతా ప్రారంభం కాకుండానే తొలి వికెట్ పడింది. తర్వాత వచ్చిన కెప్టెన్ మిథాలీ రాజ్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయింది. ఆరో ఓవర్లో ఐదో బంతికి మిథాలీ అవుటైంది. దీంతో 10 పరుగులకే భారత జట్టు రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే తర్వాత వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ మరో ఓపెనర్ దీప్తి శర్మ కలిసి స్కోరు బోర్డును ముందుకు కదిలించారు. తక్కువ పరుగులకే రెండు వికెట్లు కోల్పోవడంతో ఆచి తూచి ఆడాల్సి వచ్చింది. అయినప్పటికీ 18వ ఓవర్లో నీకెర్క్ వేసిన మూడో బంతికి హర్మన్‌ప్రీత్ అవుటైంది. అయితే తర్వాత వచ్చిన వేద కృష్ణమూర్తి జట్టును ఆదుకుంది. వేద కృష్ణమూర్తి, దీప్తి శర్మ కలిసి నాలుగో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించారు. అయితే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న వేద కృష్ణమూర్తి 34వ ఓవర్లో అవుట్ కావడంతో వీరి భాగస్వామ్యానికి తెరపడింది. అప్పటికే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న దీప్తి శర్మ మరో 46 పరుగుల తర్వాత వెనుదిరిగింది. తర్వాత మేశ్రం, సుష్మ వర్మ కూడా తక్కువ పరుగులకే వెనుదిరిగారు. శిఖ పాండే జట్టుకు తనవంతు సహకారం అందించేందుకు చివరి వరకు క్రీజులో నిలిచింది. వస్త్రాకర్, ఏక్తా బిస్ట్ తక్కువ పరుగులకే పెవిలియన్ చేరారు. పూనమ్ పాండే చివరి బంతికి రనౌట్ కావడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.



మార్చిలో పాక్ పర్యటనకు వెస్టిండీస్

కరాచీ: వెస్టిండీస్ జట్టు మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పాకిస్థాన్ పర్యటనకు వెళ్లనుంది. దుబాయ్‌లో జరిగిన ఐసీసీ సమావేశంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఈ టోర్నీని ఖరారు చేసుకుంది. అయితే ఐసీసీ సమావేశాల అనంతరం పీసీబీ చైర్మన్ నజాం సేథీ, వెస్టిండీస్ చైర్మన్ డేవ్ కామెరూన్ చర్చించి సిరీస్‌పై తుది నిర్ణయం తీసుకుంటారని పాక్ బోర్డు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 'మ్యాచ్‌లు మార్చి 29, 31, ఏప్రిల్ 1 తేదీల్లో జరుగుతాయి. వేదికలను తర్వాత ఖరారు చేస్తారు. ఈ మ్యాచ్‌లను లాహోర్‌లో నిర్వహించాలని ముందుగా అనుకున్నారు' అని ఆ అధికారి అన్నారు. ఇందుకు బదులుగా ఆగస్టులో ఫ్లోరిడా, హూస్టన్‌లలో జరగనున్న ముక్కోణపు సిరీస్‌లో పాల్గొనేందుకు పాక్ అంగీకరించిందన్నారు. ఈ సిరీస్‌లో ఆతిథ్య వెస్టిండీస్, పాకిస్థాన్‌లతో పాటు బంగ్లాదేశ్ ఆడుతుంది.

ధావన్ ధనాధన్

- 100వ వన్డేలో సెంచరీ చేసిన ఓపెనర్
- కోహ్లీ అర్ధ సెంచరీ

జొహన్నెస్‌బర్గ్: టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ అరుదైన ఘనత సాధించాడు. 100వ వన్డేలో సెంచరీ చేసిన భారత తొలి క్రికెటర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో ధావన్ ఈ రికార్డు సాధించాడు. మరోసారి ఓపెనర్ రోహిత్ శర్మ విఫలమయ్యాడు. టీమిండియా ఇన్నింగ్స్‌లో ధావన్, కోహ్లీ తర్వాత ధోనీ ఒక్కడే రాణించాడు. దీంతో టీమిండియా తక్కువ పరుగులు నమోదు చేసింది. మరోవైపు తొలి ఇన్నింగ్స్‌లో ఫ్లడ్ లైట్లు పనిచేయకపోవడం, అదే సమయంలో కాసేపు వరుణుడు పలకరించడంతో దాదాపు 50 నిమిషాల సేపు ఆట ఆగిపోయింది. గెలవల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా జట్టు కడపటి వార్తలందే సమయానికి 7.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 43 పరుగులు చేసింది. ఫ్లడ్ లైట్లు సరిగా పనిచేయకపోడం, భారీ వర్షం వల్ల ఆట నిలిచిపోయింది.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. 4వ ఓవర్లో రోహిత్ అవుటయ్యాడు. అయితే తర్వాత వచ్చిన కెప్టెన్ కోహ్లీ మరో ఓపెనర్ శిఖర్ ధావన్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 158 పరుగుల భాగసామ్యాన్ని అందించారు. మరోసారి సెంచరీ దిశగా దూసుకెళుతున్న విరాట్ కోహ్లీ 32వ ఓవర్లో క్రిస్ మోరిస్ వేసిన బంతికి వెనుదిరిగాడు. తర్వాత అజింక్య రహానే వచ్చాడు. అయితే సెంచరీ పూర్తి చేసుకున్న ధావన్ 36వ ఓవర్లో మోర్కెల్ బౌలింగ్‌లో పెవిలియన్ దారిపట్టాడు. తర్వాత ధోనీ బ్యాటింగ్‌కు దిగాడు. కానీ మరికాసేపటికే ఎన్‌గిడి బౌలింగ్‌లో రహానే అవుటయ్యాడు. తర్వాత శ్రేయాస్ అయ్యర్ వచ్చాడు. కేదార్ జాదవ్ స్థానంలో జట్టులోకి వచ్చిన అయ్యర్ బ్యాటింగ్‌లో నిరాశ పరిచాడు. ఎన్‌గిడి బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. హార్దిక్ పాండ్యా కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. భువనేశ్వర్ కుమార్ రనౌట్ కాగా కుల్‌దీప్ యాదవ్, ధోనీ నాటౌట్‌గా నిలవడంతో టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది. 100వ వన్డేలో సెంచరీ చేసిన శిఖర్ ధావన్ ప్రముఖుల సరసన నిలిచాడు. 34.2 ఓవర్ల వద్ద టీమిండియా బ్యాటింగ్‌కు అంతరాయం కలిగింది. టీమిండియా బ్యాటింగ్ జోరు మీదున్న సమయంలో ఫ్లడ్ లైట్లు పనిచేయకపోవడంతో ఆట నిలిచిపోయింది. ఇది యాదృచ్ఛికంగా జరిగిందో లేక భారత క్రికెటర్ల దూకుడుకు బ్రేక్ వేసేందుకు జరిగిందో తెలియడం లేదు.

జాదవ్ స్థానంలో అయ్యర్

జొహన్నెస్‌బర్గ్‌లో హార్డ్ పిచ్‌ను ముందుగానే గమనించిన కెప్టెన్ విరాట్ కోహ్లీ జట్టులో మార్పులు చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోహ్లీ స్పిన్నర్ కేదార్ జాదవ్ స్థానంలో మరో స్పిన్నర్ శ్రేయాస్ అయ్యర్‌ను తుది జట్టులోకి తీసుకున్నాడు. స్నాయువు కండరాల గాయంతో బాధపడుతున్న జాదవ్ పూర్తి ఫిట్‌గా లేడని కోహ్లీ చెప్పాడు.

సౌతాఫ్రికా జట్టులోనూ మార్పులు

సౌతాఫ్రికా జట్టులోనూ ఒక మార్పు చోటు చేసుకుంది. వేలి గాయంతో తొలి మూడు వన్డేలకు దూరమైన ఏబీ డివిలియర్స్ పూర్తిగా కోలుకోవడంతో నాలుగో వన్డేకు అందుబాటులోకి వచ్చాడు. దీంతో ఖయ జొండోను పక్కన పెట్టారు. అంతేకాకుండా లెగ్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌కు బదులుగా పేస్ బౌలర్ మోర్నే మోర్కెల్‌కు తుది జట్టులో చోటు కల్పించారు.



ధావన్ (109)

100వ వన్డేలో ధావన్ సెంచరీ

టీమిండియా ఓపెనర్ శిఖర్ ధావన్ సౌతాఫ్రికాపై 100వ వన్డే మ్యాచ్ ఆడాడు. ఆరంభం నుంచే సౌతాఫ్రికా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కట్టుదిట్టమైన ఫీల్డింగ్ సెట్ చేసినా బౌండరీలు బాదాడు. 53 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ధావన్‌కిది 26వ అర్ధ సెంచరీ. అంతేకాదు 100 బంతుల్లో 100వ సెంచరీని సాధించాడు. 100వ మ్యాచ్‌లో సెంచరీ చేసిన భారత తొలి క్రికెటర్‌గా రికార్డుల్లోకెక్కాడు.



శ్రీలంకదే సిరీస్

రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఓటమి

ఢాకా: బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను శ్రీలంక 1-0తో కైవసం చేసుకుంది. ఇక్కడ జరిగిన రెండో టెస్టులో శ్రీలంక 215 పరుగులతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఆఫ్ స్పిన్నర్ అకిల ధనంజయ ఐదు వికెట్లు తీశాడు. 339 పరుగుల గెలుపు లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన బంగ్లాదేశ్ మూడో రోజు రెండో సెషన్‌లో 29.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. బంగ్లాదేశ్ ఏమాత్రం ప్రతిఘటించకుండానే ఓటమిని అంగీకరించింది. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో ధనంజయ 24 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. దీంతో ఈ మ్యాచ్‌లో అతనికి మొత్తం 8 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 222 పరుగులు చేసి.. బంగ్లాదేశ్‌ను 110 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో శ్రీలంకకు తొలి ఇన్నింగ్స్‌లో 112 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత 8 వికెట్ల నష్టానికి 200 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక శ్రీలంక 226 పరుగులు చేసింది.

వింటర్ ఒలింపిక్స్‌పై సైబర్ అటాక్



పియాంగ్‌చాంగ్ (సౌత్‌కొరియా): సౌత్ కొరియాలో ప్రారంభమైన పియాంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్ గేమ్స్ ఓపెనింగ్ సెరిమనీపై గుర్తు తెలియని హ్యాకర్లు శుక్రవారం దాడి చేసినట్టు నిర్వాహక కమిటీ శనివారం తెలిపింది. గేమ్స్ సర్వర్లపై దాడి జరగడంతో ప్రధాన ప్రెస్ సెంటర్‌లో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు తమ సర్వర్లను, వెబ్‌సైట్‌ను షట్ డౌన్ చేయాల్సి వచ్చిందని.. దీని వల్ల అభిమానులు తమ టిక్కెట్ల ప్రింట్‌ను తీసుకోలేకపోయారని నిర్వాహక కమిటీ విచారం వ్యక్తం చేసింది. దీనికి బాధ్యులైన వారిని కనుగొనేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఇంటర్నెట్‌తో కనెక్టయిన టీవీలు క్రాష్ అయినట్టు అధికారులకు తెలిసింది. ఒలింపిక్ గేమ్స్ ఓపెనింగ్ సెరిమనీ దగ్గరపడుతున్న సమయంలో సైబర్ అటాక్ జరిగిందని.. దీంతో ఒలింపిక్స్‌తో అనుసంధానమైన 300 కంప్యూటర్లపై ప్రభావం పడిందని నిర్వాహకులు వివరించారు.



ఇండోనేషియాపై భారత్ గెలుపు

ఆసియా గేమ్స్ ఇన్విటేషనల్ బాస్కెట్‌బాల్ టెస్ట్ ఈవెంట్

బెంగళూరు: ఆసియా గేమ్స్ ఇన్విటేషనల్ పురుషుల బాస్కెట్‌బాల్ టెస్ట్ ఈవెంట్‌లో భారత్ 66-55తో ఇండోనేషియాను ఓడించి తొలి విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది జకార్తాలో జరగనున్న ఏషియన్ గేమ్స్‌కు ఇది ప్రాక్టీస్ టోర్నీగా జరుగుతోంది. మూడో క్వార్టర్ వరకు భారత్‌కు ఇండోనేషియా గట్టి పోటీ ఇచ్చింది. ఆ సమయంలో ఇండియా ఒక పాయింట్ మాత్రమే ఆధిక్యంలో ఉండింది. కానీ చివరి క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు అసాధారణ ప్రతిభ కనబరిచి 20 పాయింట్లు సాధించారు. కాగా చివరి క్వార్టర్‌లో ఇండోనేషియా 10 పాయింట్లు మాత్రమే సాధించగలిగింది. వెటరన్ ఆటగాడు జోగిందర్ సింగ్ 19 పాయింట్లు స్కోర్ చేశాడు. అరవింద్ అన్నాదురై 16, సత్నం సింగ్ 11 పాయింట్లతో జట్టుకు తమ వంతు సహకారం అందించారు.

క్రికెటర్లకు డోప్ టెస్ట్ ఉండదు

క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్

న్యూఢిల్లీ: భారత క్రికెటర్లకు డోప్ టెస్ట్ విషయంలో భారత ప్రభుత్వం జోక్యాన్ని బీసీసీఐ ధీటుగా తిప్పికొట్టింది. నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) కిందికి బీసీసీఐని తీసుకురావాలన్న నిర్ణయంపై క్రీడల మంత్రిత్వ శాఖ వెనకడుగు వేసింది. బీసీసీఐ కాంట్రాక్ట్‌లో ఉన్న క్రికెటర్లకు డోప్ టెస్ట్ విషయంపై మంత్రిత్వ శాఖ, బీసీసీఐ, నాడా మధ్య లేఖల ద్వారా పలు చర్చలు జరిగాయి. స్వీడన్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఇంటర్నేషనల్ డోపింగ్ టెస్ట్స్, మేనేజ్‌మెంట్ (ఐడీటీఎం)తోనే టెస్టులు చేయించుకునేందుకు బీసీసీఐకి మంత్రిత్వ శాఖ అనుమతించింది. వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (వాడా), ఐసీసీలతో గొడవలను కొనసాగించాలనుకుంటున్నారా? అన్న ప్రశ్నకు క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ సమాధానమిస్తూ.. 'ప్రతి ఒక్కరికి డోప్ టెస్ట్ చేయాలని మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఎవరితో టెస్ట్ చేయించుకున్నా మాకు అభ్యంతరం లేదు' అని అన్నారు. క్రికెటర్లకు నాడానే డోప్ టెస్ట్ చేయాలన్న దానిపై మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోబోదని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. అయితే సరైన శాంపిల్స్ కలెక్ట్ చేయాలని మాత్రమే బీసీసీఐకి మంత్రిత్వ శాఖ సూచించిందన్నారు. నాడా ద్వారా క్రికెటర్లకు డోప్ టెస్ట్‌లు చేయించేలా బీసీసీఐకి చెప్పమని ఐసీసీని వాడా కోరింది. అలా చేయకపోతే నాడా సభ్యత్వాన్ని తొలగిస్తామని కూడా వాడా బెదిరించింది. నాడాను బీసీసీఐ నమ్మాలని అదే ఏడాది రాథోడ్ అన్నారు. 'బయటి ఏజెన్సీలతోనైనా డోప్ టెస్ట్‌లు చేయిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. కానీ నేషనల్ స్పోర్ట్స్ బాడీలన్నీ నాడాపై విశ్వాసముంచితే.. క్రికెటర్లు కూడా నాడాలోనే డోప్ టెస్ట్‌లు చేయించుకుంటారు' అని రోథాడ్ తర్వాత చెప్పారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.